మే
2025

229

సంపుటి : 20 సంచిక : 12

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

### ఈ సంచికలో........

అంతర్జాతీయ సౌహార్ధ సందేశాలు
జనతా ప్రజాస్వామ్యం, సోషలిజం సాధనకు మధురై మహాసభ పిలుపు
ఫెడరల్ స్ఫూర్తికి ముప్పుగా డీలిమిటేషన్ ప్రక్రియ
అమెరికాలో 'పెట్టుబడిదారీ వ్యవస్థ రక్షణ' చర్యలు
మధ్య యుగాలలో సాంకేతికత
ట్రంప్ సుంకాల యుద్ధంతో మళ్లీ ప్రపంచ కల్లోలం
ఆర్థిక పతనానికి దారితీస్తున్న సరళీకరణ విధానాలు
మేధోహక్కులు, విజ్ఞాన ప్రైవేటీకరణ

# అంతర్జాతీయ సౌహార్థ్ర సందేశాలు

## గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కె.కె.ఇ)

కామ్రేడ్స్, ప్రపంచ ప్రజానీకం తీవ్రమైన ప్రమాదకర పరిణామాలను చవిచూస్తున్న నేపథ్యంలో నిర్వహించుకుంటున్న మీ పార్టీ అఖిల భారత 24వ మహాసభలు విజయవం తం కావాలని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ తరపున మేం ఆకాంక్షిస్తున్నాం.

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కె.కె.ఇ)కి మీ పార్టీతో సుదీర్ఘకాలంగా అనుబంధం ఉన్నది. ఈ మహాసభల సందర్భంగా భారత కార్మిక వర్గానికి మా సంఘీభావాన్ని ప్రకటిస్తున్నాం. పెట్టుబడిదారీ దోపిడికి వ్యతిరేకంగానూ, ప్రజల హక్కుల మీద దాడి చేస్తూ, విధ్వంసానికి పాల్పడుతూ, హింసాత్మక దాడులకు, చివరికి హత్యలకు కూడా వెనుదీయని జాతీయవాద విధానాలను, ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకం గానూ మీ పార్టీ నిర్వహిస్తున్న పోరాటాలకు మా పార్టీ సంఘీభావం ప్రకటిస్తున్నది.

కార్మికులు, పేద రైతులు, స్వయం ఉపాధి మీద జీవిస్తున్న ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ప్రజాపోరాటాలు నిర్వహించడంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పోషించిన విశిష్ఠ పాత్రకు, కృషికి మా పార్టీ తరపున విప్లవాభినందనలు తెలియచేస్తున్నాం. వ్యవసాయ ఆహార వ్యాపార కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం ఒనగూర్చేందుకు, భూమిలేని రైతులు, చిన్న రైతుల ప్రయోజనాలు బలిపెట్టేందుకు ఉద్దేశించి ప్రభుత్వం చేసిన చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం దేశవ్యాప్తంగా సుదీర్ఘకాలం పాటు చేసిన సమరశీల పోరాటం అంతర్జాతీయంగా ప్రతిధ్వనించింది. కీలకమైన వివిధ పెట్టుబడిదారీ ఉత్పత్తి రంగాలలో కార్మికవర్గం చేపట్టిన పోరాటాలకు సారధ్యం వహించిన సి.పి.ఐ(యం)కు మా పార్టీ విప్లవాభివందనలు తెలియచేస్తుంది.

కామ్రేడ్స్, ఇవాళ అంతర్జాతీయంగా మనం ఒకేవిధమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటు న్నాం. సామ్రాజ్యవాద యుద్ధాలు, ఇండో–ఫసిఫిక్ సముద్ర తీరప్రాంతంలో సామ్రాజ్యవాద పోటీ మూలంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, అణ్వాయుధ మారణహోమ ప్రమాధాలతో పాటు బూర్జువా, ఉదారవాద, సోషల్ డెమో క్రాట్ పార్టీలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు – ఇవన్నీ పెట్టుబడి దారీ వ్యవస్థ తెచ్చిపెట్టిన ప్రమాదాలే అన్న సత్యం మనకు తెలుసు. పెట్టుబడిదారీ వ్యవస్థ వర్గ దోపిడిని తీవ్రతరం చేస్తుంది. సామ్రాజ్య వాద యుద్ధాలను రగిలిస్తుంది. ఈ వ్యవస్థలో ఏర్పడే ఆర్థిక సంక్షోభాలు, ప్రజాసామాన్యాన్ని అనేక ఇక్కట్లకు గురిచేస్తాయి.

మా దేశంలో బూర్జువా పార్టీలు, న్యూడెమోక్రసీ ప్రభుత్వం చేపట్టిన ప్రజాకంటక విధానాలకు వ్యతిరేకంగా గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఎత్తున వర్గ పోరాటాలు నిర్వహి స్తున్నది. బూర్జువా వర్గంతో, దాని అధికారం తో, సామ్రాజ్యవాద కూటములయిన నాటో, ఐరోపా యూనియన్‌లతో తలపడుతున్నది.

తెంపెలో జరిగిన భీభత్సమైన రైలు ప్రమాదం జరిగి 2025 ఫిబ్రవరి 28 నాటికి రెండేళ్ళు నిండిన సందర్భంగా 'వాళ్ళ లాభాలా? మన జీవితాలా?' నినాదం పేరిట ఇచ్చిన సమ్మె పిలుపు చరిత్రలో నిలిచిపోయేలా అసాధారణమైన రీతిలో విజయవంత మయ్యింది. లక్షలాది మంది కార్మికులు, యువజనులు, ప్రజలు పాల్గొన్న ఈ సమ్మెతో గ్రీస్ ప్రజా ఉద్యమాలలో పెద్ద కదలిక మొదలయ్యింది. ఇది మునుముందుకు కొనసాగుతుంది.

అలాగే మార్కెట్లను పంచుకోవడానికి, సహజ వనరులను కొల్లగొట్టడానికి సాగిస్తున్న సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నది. మా దేశంలో ఉన్న నాటో, ఐరోపా యూనియన్ సైనిక స్థావరాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నది. నరమేధానికి దారితీస్తున్న యుద్ధాల నుండి గ్రీస్ దూరం కావాలని, సామ్రాజ్యవాద కూటములయిన నాటో, ఐరోపా యూనియన్‌లు వైదొలగాలని మా పార్టీ ఆందోళనలు చేపట్టింది. ఏ సార్వభౌమ దేశంలో అయినా ప్రజలే సర్వాధికారాలు కలిగి ఉండాలని కోరు కుంటున్నది.

70 ఏళ్ళ సోషలిస్టు పాలనలో, మనిషిని మనిషి దోచుకునే వీలులేని సమాజంలో సర్వతోముఖాభివృద్ధి సాధించిన రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రజానీకం ఇప్పుడు జరుగుతున్న సామ్రాజ్యవాద యుద్ధంలో తమ రక్తం ధారబోస్తున్నారు. మా పార్టీ ఈ రెండు దేశాల ప్రజల పక్షాన నిలబడుతుంది.

1967 జూన్ నాటికి ఉన్న భౌగోళిక సరిహద్దులతో తూర్పు జెరూసలెం రాజధానిగా గల పాలస్తీనా ప్రజానీకం స్వతంత్ర దేశ ఆకాంక్షకు మద్ధతుగా మా పార్టీ ప్రతిరోజూ ఏదో ఒక సంఘీభావ కార్యక్రమం నిర్వహి స్తున్నది. నరహంతక ఇజ్రాయిల్ ప్రభుత్వం, దానికి కొమ్ముకాస్తున్న అమెరికా–నాటో–ఐరోపా యూనియన్ దేశాలు చేస్తున్న దురాక్రమణ దాడులకు గురవుతున్న మధ్య ప్రాచ్య దేశాల ప్రజానీకానికి మా పార్టీ అండగా నిలుస్తుంది. తక్షణమే గాజా భూభాగంలోని పాలస్తీనా ప్రజానీకంపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న హత్యాకాండను నిలిపివెయ్యాలని, లెబనాన్–సిరియా దేశాలలో సామ్రాజ్యవాదం జోక్యం చేసుకోరాదని మా పార్టీ డిమాండ్ చేస్తున్నది.

పెట్టుబడిదారీ విధానానికి, గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా జరిగే పోరాటాలను మరింత విస్తృతం చెయ్యడానికి కార్మికోద్యమాలను పున:సమీకరించి, కార్మిక వర్గానికీ, ప్రజా బాహుళ్యానికీ మధ్యన పొత్తు కుదిర్చి విశాల పోరాట వేదిక ద్వారా అంతిమ పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. ఇంకా సూటిగా చెప్పుకోవాలంటే దుర్మార్గమైన పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోసి నూతన సోషలిస్టు – కమ్యూనిస్టు సమాజాన్ని నెలకొల్పేందుకు కృతనిశ్చయంతో ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమం ఇవాళ అనేక కొత్త సవాళ్ళను ఎదుర్కొంటూ ఉన్నదనే విషయం మా గమనంలో ఉన్నది. ఈ పరిణామాలను లోతుగా, నిర్ధిష్టంగా అధ్యయనం చెయ్యడం, అభిప్రాయాలు, ఆలోచనలు, అనుభవాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం, ఐక్య కార్యాచరణలను పెంపొందించడం, విప్లవకర వ్యూహాన్ని అభివృద్ధి చేసుకోవడం – వీటి అవసరాన్ని, ప్రాధాన్యతను మనం గమనంలో ఉంచుకోవాలి అని ఆకాంక్షిస్తున్నాం.

ఈ ఆలోచనలు మీతో పంచుకుంటూ మీ పార్టీ మహాసభలు విజయవంతం కావాలని, రానున్న కాలంలో మీ పార్టీ చేపట్టే పోరాటాలు మరింత బలోపేతం కావాలని ఆశిస్తూ..

**విప్లవాభినందనలతో..**
**– గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ**
**కేంద్ర కమిటీ – అంతర్జాతీయ సంబంధాల విభాగం**

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. అంతర్జాతీయ సౌహార్థ్ర సందేశాలు** .........2

**2. జనతా ప్రజాస్వామ్యం, సోషలిజం సాధనకు మధురై మహాసభ పిలుపు**
ప్రకాశ్ కరత్.....4

**3. ఫెడరల్ స్ఫూర్తికి ముప్పుగా డీలిమిటేషన్ ప్రక్రియ**
ఎంవిఎస్ శర్మ........**7**

**4. అమెరికాలో 'పెట్టుబడిదారీ వ్యవస్థ రక్షణ' చర్యలు**
సిపి చంద్రశేఖర్ ...... 15

**5. మధ్య యుగాలలో సాంకేతికత**
ఎంవిఎస్ శర్మ...... 18

**6. ట్రంప్ సుంకాల యుద్ధంతో మళ్లీ ప్రపంచ కల్లోలం**
మిథాలీ ముఖర్జీ........23

**7. ఆర్థిక పతనానికి దారితీస్తున్న సరళీకరణ విధానాలు**
ఎ కోటిరెడ్డి.........27

**8. మేధోహక్కులు, విజ్ఞాన ప్రైవేటీకరణ**
రఘునందన్..........31



**సంపాదకుడు :**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం :**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visitcpi(m)site at:cpim.org


# సంఘ్‌పరివార్ సెన్సార్‌షిప్

ప్రముఖ మళయాళ నటుడు మోహన్ లాల్ నటించిన 'ఎంపురాన్' సినిమా అభ్యుదయ సినిమా కాదు, వామపక్ష భావజాలం వ్యాప్తిచేసే సినిమా అంతకన్నా కాదు. అది 2002 గుజరాత్ మతఘర్షణల పూర్వరంగంలో తీసిన కమర్షియల్ సినిమా. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఫిల్మ్ సెన్సార్ సర్టిఫికేటు కూడా దానికి లభించింది. కానీ ఆర్‌ఎస్‌ఎస్ పరివారానికి ఆ సినిమా కథ నచ్చలేదు. గుజరాత్ మతఘర్షణల నేపథ్యం అంటేనే సంఘ్ పరివారానికి కంపరం పుట్టుకొస్తుంది. ఎందుకంటే ఆ ఘర్షణల సృష్టికీ, వేలాది మంది స్త్రీపురుషుల మరణాలకూ కారణమైంది ఆర్‌ఎస్‌ఎస్ పరివారం కనుక.

సంఘ్ పరివార్ సంస్థలన్నీ ఒక్కపెట్టున ఎంపురాన్ సినిమా నిర్మాతలపై విరుచుకుపడ్డాయి. చివరికి సెన్సార్ సర్టిఫికేట్ పొంది థియేటర్లలో ప్రదర్శించబడుతున్న సినిమాకు కాషాయ పరివారం ఒత్తిడితో నిర్మాతలు మరోమారు 24 చోట్ల సెల్ఫ్-సెన్సార్ చేయాల్సి వచ్చింది. సినిమాలో విలన్ పాత్రధారి పేరు 'బల్‌రాజ్ బజ్రంగి' ని 'బల్‌దేవ్'గా మార్చాల్సి వచ్చింది.

ఈ రోజున మన దేశంలో ప్రభుత్వ సెన్సార్‌షిప్‌తోపాటు ఫాసిస్టుల సెన్సార్‌షిప్ సమాంతరంగా ఎలా నడుస్తున్నదో చెప్పడానికి ఎంపురాన్ ఒక ఉదాహరణ మాత్రమే. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని విమర్శించే లేదా ఆ భావజాలానికి అనుగుణంగా లేని సినిమాలను సంఘపరివార్ సంస్థలు లక్ష్యంగా చేసుకుంటున్నాయి. కులం, మతం, చారిత్రక ఘటనలు, సామాజిక న్యాయం, మహిళా సమస్యలు ఒకటేమిటి దేశంలో సంస్కరణకు గురికావాల్సిన ఏ అంశమైనా సంఘ్ పరివార్ భావజాలానికి అనుగుణంగా లేకపోతే సెన్సార్‌షిప్పుకు గురికావాల్సిందే. చివరికి జ్యోతిబా పూలే మీద తీసిన సినిమా కూడా పరివారానికి ఆగ్రహం తెప్పించింది. ఎందుకంటే అందులో నిమ్నకులాల మీద అగ్రవర్ణాలు జరిపిన అకృత్యాలగురించిన దృశ్యాలు ఉన్నాయట. అంటే చారిత్రక వాస్తవాలను సినిమాగా తీయడం వీరి దృష్టిలో నేరం.

కానీ మరోవంక సంఘ్‌పరివార్ విషపూరితమైన భావజాలాన్ని ప్రచారం చేస్తూ తీస్తున్న సినిమాల్లో పూర్తిగా చారిత్రక వక్రీకరణలు, అబద్దాలు ఉన్నప్పటికీ, ప్రజలమధ్య విద్వేషాలు రెచ్చగొట్టే కథనం ఉన్నప్పటికీ వాటికి సెన్సార్ సర్టిఫికేట్ రావడమే కాదు, 'గోదీ మీడియా'లో విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో కాశ్మీరీ ఫైల్స్, రామ్‌సేతు వంటి పూర్తి అబద్ధాలతో తీసిన సినిమాలే కాదు సంఘ్ పరివార్ భావజాలాన్ని, కుహనా దేశభక్తిని, మితవాద జాతీయవాదాన్ని ప్రేరేపించే అనేక సినిమాలు వచ్చాయి, వస్తున్నాయి. ఇటీవల విడుదలైన "ఛావ" సినిమాను ఉపయోగించుకుని ముస్లిం వ్యతిరేక భావోద్వేగాలను ఆర్‌ఎస్‌ఎస్ పరివారం ఎలా రెచ్చగొట్టిందో మనం చూశాం. చివరికి నాగ్‌పూర్‌లో పెద్ద ఎత్తున హింసాకాండకు ఇది దారితీసింది.

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) ఇప్పుడు పూర్తిగా ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో ఉంది. దాన్ని ఉపయోగించుకుని సంఘ్ పరివార్ సినిమాలను తన ఎజెండాకు అనుగుణంగా మార్చుకుంటున్నది. తన ఎజెండాకు అనుగుణంగా లేని లేక లౌకిక వాదాన్ని సమర్థించే సినిమాలపై "భారత-వ్యతిరేక", "హిందూమత-వ్యతిరేక' లేక జాతీయ ప్రయోజనాలకు హానికరం అనే ముద్రలు వేసి వాటిని సెన్సార్ చేయిస్తున్నారు. అనేక సందర్భాల్లో సినిమా నిర్మాతలే సంఘీయుల ఫాసిస్టిక్ ఒత్తిడితో స్వయంగా సెన్సార్ చేసుకుంటున్నారు. "నేటి భారత దేశంలో హిందూ-ముస్లిం యువతీయువకుల మధ్య ప్రేమ కథాంశంతో సినిమా తీయలేని పరిస్థితి నెలకొని ఉండడం నిజంగా విషాధం" అని సినిమా నటుడు స్వర భాస్కర్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

సినిమాల మీదనే కాదు ఇంకా అనేక సృజనాత్మక రంగాలపై ఆర్‌ఎస్‌ఎస్ పరివారం ఫాసిస్టు దాడులు సాగిస్తున్నది. ఉత్తరాదిలో ప్రజలపై బలమైన ప్రభావం చూపే స్టాండప్ కమేడియన్ కునాల్ కమ్రా మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిపై జోక్ వేసినందుకు కేసుపెట్టారు. అనేక పుస్తకాలను, నాటకాలను సంఘ్‌పరివార్ ప్రజల్లోకి రాకుండా అడ్డుకుంటున్నది. సినిమాలమీద, ఇతర సృజనాత్మక వ్యక్తీకరణలమీద ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు దాడులను ప్రతిఘటించకపోతే రాజ్యాంగం మనకు ప్రసాధించిన భావప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా కోల్పోవడానికి ఇంకెన్నో రోజులు పట్టదు. అందువల్ల ఈ ఫాసిస్టు సెన్సార్‌షిప్పునూ, భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై ఫాసిస్టు తరహా దాడులనూ అడ్డుకోవడానికి తక్షణం ప్రజాతంత్ర శక్తులను ఏకం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# జనతా ప్రజాస్వామ్యం, సోషలిజం సాధనకు మధురై మహాసభ పిలుపు



ప్రకాశ్ కరత్

**(సి.పి.ఐ. యం 24వ అఖిల భారత మహాసభల సందర్భంగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, సమన్వయకర్త కామ్రేడ్ ప్రకాశ్ కరత్ ప్రారంభోపన్యాసం పూర్తి పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం....సంపాదకుడు)**

మహాసభల ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించిన కామ్రేడ్ మాణిక్ సర్కార్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు కామ్రేడ్ కె.బాల క్రిష్ణన్, సి.పి.ఐ. ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.రాజా, సి.పి.ఐ(యం.ఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దీపాంకర్ భట్టా చార్య, ఆర్.యస్.సి. ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మనోజ్ భట్టాచార్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ జి.దేవరాజన్, మహాసభలకు విచ్చేసిన ప్రముఖ అతిథులకు, స్నేహితులకు నమస్కారం.

సిపిఐ(ఎం) 24వ అఖిల భారత మహా సభలకు విచ్చేసిన మీ అందరికీ నా హృదయ పూర్వక శుభాకాంక్షలు.

మహాసభ అనేది కమ్యూనిస్టు పార్టీకి కీలకమైన, అత్యున్నత వేదిక. ప్రాచీన తమిళ సాహిత్య, సాంస్కృతిక, నైతికతలతో అలరా రుతూ, ఎనిమిది దశాబ్దాలకు పైగా కార్మికవర్గ, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను సామరస్యంగా మిళితమయిన మధురై నగరంలో ఈ మహా సభను నిర్వహించడం సముచితం అని నేను భావిస్తున్నాను.

ఈ మహాసభల సందర్భంగా మధురై లోను, తమిళనాడు రాష్ట్రంలోను కమ్యూనిస్టు పార్టీ విశేష అభివృద్ధికి కృషి చేసిన ఉద్యమ ప్రముఖ నాయకులు పి.రామమూర్తి, కెతికె తంగమణి, యన్.శంకరయ్య, కె.పి.జానకి అమ్మాళ్‌లను మనం స్మరించుకుందాం.

ఈ మధురై నగరం అనేక మంది పార్లమెంట్, శాసనసభ సభ్యులను అందిం చింది. లోక్‌సభకు ఆరుసార్లు కమ్యూనిస్టు పార్లమెంట్ సభ్యులను ఎన్నుకున్నది. కె.టి.కె తంగమణి (1957), పి.రామమూర్తి (1967), పి.మోహన్ (1999, 2004), ప్రస్తుత యం.పి. సు.వెంకటేశన్ (2019, 2024). 1940లో మధురైలో తొలిగా పార్టీ శాఖ ఏర్ప డిన నాటి నుండి మొదటగా తరతరా లుగా కమ్యూనిస్టులు పార్టీని, ఉద్యమాన్ని నిర్మించడా నికి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల లో విశేషంగా కృషి చేశారు. ఈ ఉద్యమ నిర్మా ణానికి కృషి చేసిన స్త్రీపురుషులంద రినీ మనం స్మరించుకుందాం. ప్రజా ప్రయోజ నాలను పరిరక్షించడానికి కృషి చేస్తున్న ఒకే ఒక్క కారణాన స్థానిక గూండాలు హతమార్చిన పార్టీ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అమరజీవి కామ్రేడ్ లీలావతికి విప్లవాభినందనలు అర్పిస్తున్నాను.

ఈ మహాసభ ఒక విషాదకర సందర్భం లో మనం జరుపుకుంటున్నాం. పార్టీ మహాసభ ల సన్నాహాలకు నాయకత్వం వహించిన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ఈరోజున భౌతికంగా మన మధ్యన లేరు. అనూహ్యమైన ఈ పరిస్థితిని అధిగమించడా నికి పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్రకమిటీలు 24వ మహాసభల నిర్వహణను పరిపూర్తి చెయ్యడా నికి సమిష్టిగా, ఐక్యంగా పనిచేశాయి. మార్క్సి స్టు సిద్ధాంతం – ఆచరణలకు కామ్రేడ్ సీతా రాం ఏచూరి అందించిన ప్రత్యేకమైన, వైవిధ్యమయిన తోడ్పాటు స్ఫూర్తిని మనం ఆచరిద్దాం.

**మిత్రులారా, సహచరులారా!**

పార్టీ మహాసభ ప్రధాన కర్తవ్యం 'రాజ కీయ– ఎత్తుగడల' పంథాను రూపొందిం చడం. పార్టీ రాజకీయ కృషికి దిశా నిర్దేశం చేసేది ఇదే. ఇది రూపొందించు కోవాలంటే వర్తమాన రాజకీయ పరిస్థితిపై నిర్దుష్టమైన అవగాహన కలిగి ఉండడం, ప్రభుత్వ – పాలక వర్గాల వర్గ స్వభావం పైన వర్గ బలా బలాల పొందికపై స్పష్టమైన అంచనా ఉండ డం అవసరం. కొన్ని సందర్భాలలో ఇవన్నీ అంచనా వెయ్యడం సంక్లిష్టంగా ఉంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితులలో ఈ అంచనాకు రావడం చాలా సులువయ్యింది.

ఈ క్రింది మూడు ప్రశ్నలు వేసుకుందాం..

1. డొనాల్డ్ ట్రంప్ నాకు మంచి స్నేహితుడని ఎవరు చెప్పుకుంటున్నారు?

2. గౌతమ్ అదాని, ముఖేష్ అంబా నీలకు ఆప్త మిత్రుడు ఎవరు?

3. ఆర్ఎస్ఎస్‌కు పూర్తి విధేయత ప్రకటించిందెవరు?

పై మూడు ప్రశ్నలకు సమాధానం ఒకటే – నరేంద్రమోడీ, బిజెపిలు.

ప్రధాని నరేంద్రమోడీ, అతని ప్రభుత్వం హిందూత్వ – కార్పొరేట్ అపవిత్ర చెలిమికి ప్రాతినిధ్యం వహిస్తూ, అమెరికన్ సామ్రాజ్య వాదంతో అంటకాగుతున్నాయి. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు హిందూత్వ – కార్పొరేట్ చెలిమికి వ్యతిరేకంగా పోరాడి ఓడిస్తే ప్రస్తుత రాజకీయ సంక్షోభం సమసిపోతుందా? ఇలాం టి అంచనాకు రావడం సులభమే కానీ, మన ముందున్న సంక్లిష్టమైన సమస్య ఏంటంటే – బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల జమిలి ప్రమాదాన్ని మనం సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి, వాటిని రాజకీయంగా ఎలా ఒంటరిపాటు చెయ్యాలి, రాజకీయ పరిస్థితుల మితవాద మొగ్గును ఎలా తిప్పికొట్టాలి అనేదే. ఇవాళ హింతూత్వ శక్తులు రాజకీయ ఆధిపత్యం చలాయించ డానికి కేవలం ఎన్నికలలో అది సాధించిన విజయాల ద్వారా మాత్రమే సాధ్య పడలేదని మార్క్సిస్టులుగా మనకు అంచనా ఉన్నది. సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో హిందూత్వ శక్తుల ప్రభావం బలో పేతం కావడం మూలంగా ఆ శక్తులు రాజకీ యాధిపత్యాన్ని చలాయిస్తున్నాయి. ప్రజా

స్వామ్యం మీద, రాజ్యాంగం మీద నియంతృత్వ దాడులు కొనసాగిస్తూ హిందూత్వ శక్తులు ఆధిపత్యాన్ని సాధించాయి.

అందుకే ఈ మహాసభలలో మనం రూపొందించుకోనున్న రాజకీయ – ఎత్తుగడల పంథా ఆర్.యస్.యస్. – బిజెపి, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా బహుముఖ పోరాట చేసేదిగా ఉండాలి. ప్రజల జీవనోపాధిని పరరక్షించడానికి, నయా–ఉదారవాద విధానాల దాడులను తిప్పికొట్టడానికి మార్క్సిస్టు పార్టీ, ఇతర వామపక్షశక్తులు అనేక పోరాటాలు నిర్వహిస్తున్నాయి. అయితే ఈ పోరాటాలలోకి సమీకరించబడుతున్న ప్రజానీకంలో మితవాద, విభజన వాద హిందూత్వ మతతత్వానికి వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం కావించడం ద్వారా మాత్రమే వారిని రాజకీయంగా చైతన్యవంతం చెయ్యగలుగుతాం. బిజెపికి వ్యతిరేకంగా అన్ని లౌకికశక్తులనూ విశాల ప్రాతిపదికన సమీకరించే కృషిలో భాగంగా నయా–ఉదారవాద విధానాల వ్యతిరేక పోరాటాలను, హిందూత్వ మతతత్వ రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా కూడా మేళవించాల్సిన అవసరం సదా మన స్మరణలో ఉండాలి. కేవలం వామపక్ష శక్తులు మాత్రమే హిందూత్వ మెజార్టీ మతతత్వ కుట్రలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చెయ్యగల శక్తులు. ఎందుకంటే వామపక్ష శక్తులకు మాత్రమే నయా–ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చెయ్యగల సత్తా ఉన్నది.

మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారం చేబట్టాక ఆర్.యస్.యస్. ఆదేశిత హిందూత్వ అజెండాను, నయా–ఉదారవాద విధానాలకు దూకుడుగా అమలు చేస్తున్నది. ఈ క్రమంలో నిరంకుశత్వాన్ని బలోపేతం చేసుకుంటూ నయా–ఫాసిస్టు పోకడలు పోతున్నది. ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు అజెండాను అమలు చెయ్యడంలో భాగంగా నిరంతరం మత మైనార్టీలుగా ఉన్న ముస్లింలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో హిందూత్వ సంస్థలు ముస్లింలను మతపరమైన హింసకు గురిచేస్తున్నాయి. ముస్లింల మీద ఎక్కుపెట్టిన ఈ నిరంతర హింస ద్వారా మత విభజనను తీవ్రతరం చేసి దేశవ్యాప్తంగా 'హిందూత్వ'ను సంఘటిత పరచుకోవడానికి చూస్తున్నది.

మోడీ ప్రభుత్వం ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి మారుపేరుగా తయారయ్యింది. కొత్త కొత్త రంగాలను ప్రైవేటీకరించి, పెద్ద ఎత్తున లాభాలు పోగేసుకోవడానికి బడా గుత్త సంస్థలకు అవకాశం కల్పిస్తున్నది. దీని పర్యవసానంగా మునుపెన్నడూ లేనంత తీవ్రస్థాయిలో అసమానతలు ఏర్పడ్డాయి. జనాభాలో 1 శాతంగా ఉన్న సంపన్నుల దగ్గర 40 శాతం దేశ సంపద పోగుపడిపోయింది. నిరుద్యోగం, ముఖ్యంగా యువతలో తీవ్ర స్థాయిలో ఉన్నది. కాంట్రాక్టీకరణ ద్వారా శ్రమ దోపిడి తీవ్రమయ్యింది. పారిశ్రామిక రంగంలో కార్మికుల నిజ వేతనాల విలువ పడిపోయింది. వ్యవసాయ రంగ సంక్షోభం మరింత తీవ్రతరం కావడంతో రైతుల వ్యవసాయ కార్మికుల పరిస్థితులు మరింతగా దిగజారాయి.

❝ మోడీ ప్రభుత్వం మూడవసారి అధికారం చేబట్టాక ఆర్.యస్.యస్. ఆదేశిత హిందూత్వ అజెండాను, నయా-ఉదారవాద విధానాలకు దూకుడుగా అమలు చేస్తున్నది. ఈ క్రమంలో నిరంకుశత్వాన్ని బలోపేతం చేసుకుంటూ నయా-ఫాసిస్టు పోకడలు పోతున్నది. ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు అజెండాను అమలు చెయ్యడంలో భాగంగా నిరంతరం మత మైనార్టీలుగా ఉన్న ముస్లింలను లక్ష్యంగా చేసుకుని దాడు లకు పాల్పడుతున్నది. ❞



సిపిఎం మహాసభల సందర్భంగా ఏప్రిల్ 6న మధురైలో జరిగిన రెడ్‌షర్ట్ వలంటీర్ల ఫ్లాగ్ మార్చ్

రాబోయే కాలంలో కార్మికుల, కష్టజీవుల వర్గ – ప్రజా పోరాటాలు తీవ్రతరం కానున్నాయి. ఈ పోరాటాలకు రాజకీయంగా దిశానిర్దేశం చెయ్యడానికి మనం సంసిద్ధంగా ఉండాలి.

కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చెయ్యడానికి మోడీ ప్రభుత్వం చూస్తున్నది. ఈ నాలుగు కోడ్‌లను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో భారత కార్మికవర్గం 2025 మే 20న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెకు పూనుకోనున్నది. వామపక్ష పార్టీలు, వర్గ–ప్రజా సంఘాలు అన్నీ కలిసి ఈ సమ్మెను దిగ్విజయం చెయ్యడానికి కృషి చెయ్యాలి.

లోక్‌సభలో బిజెపికి స్వంతంగా మెజార్టీ లేదు. అలాగే పార్లమెంటు ఉభయ సభలలో బిజెపి సంకీర్ణమైన యన్.డి.ఎ.కు మూడింట రెండువంతుల మెజార్టీ లేదు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని, రాజ్యాన్ని హిందూత్వ అజెండాకు అనుకూలంగా మలచడానికి నిరంకుశ పోకడలతో కూడిన కృషిని కొనసాగిస్తూ ఉన్నది. లోక్‌సభకు, రాష్ట్రాల శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించ డానికి మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగంలో పొందుపరచిన సమాఖ్యతత్వం మీద, రాష్ట్రాల హక్కుల మీద చేస్తున్న ప్రత్యక్ష దాడి వినా మరొకటి కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, అత్యున్నత న్యాయవ్యవస్థను బలహీన పరచడం, ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిని నీరుకార్చడం కొనసాగుతూ ఉన్నది.

ప్రతిపక్ష నాయకుల మీద ఉపా, మనీ లాండరింగ్ వంటి క్రూరమైన చట్టాలను వినియోగిస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా రెండు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను అవినీతి ఆరోపణల మీద జైలు పాల్జేశారు. మోడీ ప్రభుత్వం సమాఖ్యతత్వాన్ని, రాష్ట్రాల హక్కులను తుంగ

> భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తన స్వంత బలాన్ని ఎలా పెంచుకోవాలి అనే కీలక మైన అంశాన్ని ఈ మహాసభలు పరిష్కరించే దానికి కృషి చెయ్యాలి. దేశ వ్యాప్తంగా స్థానిక సమస్యల మీద కేంద్రీకరించి వర్గ-ప్రజా పోరాటాలు పెంపొందించడానికి ప్రణాళికా బద్ధమైన కృషి కొనసాగాలి. పునాది స్థాయి నుండి పార్టీని నిర్మించి, పార్టీ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించుకోవాలి.

లో తొక్కుతూ నిరంకుశ కేంద్రీకృత అధికారాలను బలోపేతం చేసుకుంటుంది. భాజపాయేతర రాష్ట్ర ప్రభుత్వాలకు నిధుల కేటాయింపులో తీవ్ర వివక్షకు పాల్పడుతున్నది.

భారతదేశంలో సామాజిక సంబంధాలు కులవ్యవస్థ పునాదిగా గల మౌళిక నిర్మాణం లోనే ఒదిగి ఉండేలా చూడడానికి బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు ఉపకులాల అస్థిత్వాలను ఎగదోస్తున్నాయి. సామాజిక, సాంస్కృతిక రంగాలలో మనువాద విలువలను, భావజాలాన్ని కృత్రిమ మార్గాల ద్వారా చొప్పిస్తున్నది. మహిళలు, దళితులు, ఆదివాసుల హక్కులపై దాడిచేసే మనవాద, పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా చేసే పోరాటం హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అంతర్భాగం కావాలి.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తన స్వంత బలాన్ని ఎలా పెంచుకోవాలి అనే కీలకమైన అంశాన్ని ఈ మహాసభలు పరిష్క రించే దానికి కృషి చెయ్యాలి. దేశవ్యాప్తంగా స్థానిక సమస్యల మీద కేంద్రీకరించి వర్గ-ప్రజా పోరాటాలు పెంపొందించడానికి ప్రణాళికా బద్ధమైన కృషి కొనసాగాలి. పునాది స్థాయి నుండి పార్టీని నిర్మించి, పార్టీ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించుకోవాలి.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించడంలో కేరళ వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం ముందుపీఠిన ఉన్నది. కేరళలో యల్.డి.యఫ్ ప్రభుత్వం, ప్రత్యామ్నాయ, ప్రజానుకూల విధానాలను అమలు చేస్తున్న కారణంగా కేంద్ర ప్రభుత్వం నుండి వివక్షను ఎదుర్కొంటున్నది. రాజ్యాంగంలో పొందు పరిచిన సమాఖ్య తత్వాన్ని, రాష్ట్రాల హక్కులను పరిరక్షించ డానికి, యల్.డి.ఎఫ్. ప్రభుత్వం, కేరళ ప్రజానీకం చేస్తున్న పోరాటం అఖిల భారత స్థాయిలో నిరంకుశత్వానికి వ్యతిరేకం గాను, సమాఖ్యతత్వాన్ని పరిరక్షించడానికి జరుగుతున్న కీలక పోరాటంలో అంతర్భాగం.

**సహచరులారా, మిత్రులారా!**

ట్రంప్ అధ్యక్ష పదవిని చేపట్టడం అమెరికన్ సామ్రాజ్యవాద శకంలో నూతన అధ్యాయానికి నాంది పలికినట్లయ్యింది. సామ్రాజ్య వాద దోపిడి మరింత నగ్నంగా కొనసాగడానికి ఊతం చిక్కింది. భౌగోళిక హద్దులలో ఉన్న దేశాలను కలిపేసుకోవాలను కోవడం, మిత్రదేశాల సహజ వనరులనూ కొల్లగొట్టాలనుకోవడం సామ్రాజ్యవాద తాజా దోపిడి పద్ధతి. గాజా నుండి పాలస్తీనా ప్రజానీకాన్ని తుడిచిపెట్టాలన్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు పథకానికి ట్రంప్ వంతపాడుతున్నాడు. వర్ధమాన దేశాల మీద దూకుడుగా అనేక చర్యలు తీసుకుంటున్నాడు. ఈ పరిణామాల పట్ల ప్రధాని మోడీ మౌనం పాటిస్తూ ట్రంప్ పట్ల తన విధేయతను చాటుకుంటున్నాడు.

రానున్న కాలంలో మన దేశం తీవ్ర పర్యవసానాలకు గురి కానున్నది. సుంకాల విధింపు విషయంలో మోడీ ప్రభుత్వం మన దేశ కీలక ప్రయోజనాలను కాపాడకుండా లొంగుబాటు ప్రదర్శిస్తున్నది. ఇంధన సరఫరా, సైనిక ఆయుధాల కొనుగోళ్ళ విషయంలో ఇప్పటికే మన దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టింది. అమెరికాతో అంటకాగాలని చూస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొత్త 'ఫ్రంట్' ఏర్పడుతున్నది. భారతదేశ సార్వభౌమ ప్రయోజనాలను తాకట్టుపెట్టాలని చూసే ఏ ప్రయత్నాన్ని అయినా ఎదుర్కోవడంలో సి.పి.ఐ(యం), వామపక్ష శక్తులు ముందు పీఠిన ఉంటాయి. సామ్రాజ్య వాద దోపిడి, బిజెపి అనుసరిస్తున్న లొంగుబాటు వైఖరులకు వ్యతిరేఖంగా ప్రజానీకంలో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలి.

ట్రంప్ సారధ్యంలో అమెరికన్ సామ్రాజ్య వాదం ఆర్థిక, వాణిజ్య యుద్ధాలకు తెరతీస్తుంది. ప్రపంచ దేశాల్లో రాజకీయంగా, సైనిక పరంగా జోక్యం చేసుకోవడానికి పూను కుంటుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను పెంపొందించడానికి, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ఎండగట్టడానికి సి.పి.యం., వామపక్ష శక్తులకు ఇదే సరైన అదను.

గత 17 నెలలుగా ఇజ్రాయిల్ జియోనిస్టు ప్రభుత్వం గాజాలోని పాలస్తీనా ప్రజానీకంపై సాగిస్తున్న క్రూరమైన జాతి హత్యాకాండను ఈ మహాసభల వేదిక నుండి ఖండిస్తున్నాం. పాలస్తీనా ప్రజానీకానికి మా సంఘీభావాన్ని, పూర్తి మద్దతును ప్రకటిస్తున్నాం. మోడీ ప్రభుత్వం పాలస్తీనా ప్రజా ప్రయోజనాలను నిస్సిగ్గుగా వంచించి, ఇజ్రాయిల్ ప్రభుత్వానికి గుడ్డిగా మద్దతు పలకడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఆరు దశాబ్దాలకు పైగా అమెరికన్ సామ్రాజ్యవాదం కొనసాగిస్తున్న అమానవీయ ఆర్థిక దిగ్బంధనాన్ని వీరోచితంగా ఎదుర్కొంటున్న క్యూబా ప్రజానీకానికి, ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నాం. సోషలిస్టు క్యూబా ప్రజానీకానికి మేం సదా అండగా నిలుస్తాం.

**సహచరులారా, మిత్రులారా!.**

వామపక్ష ఐక్యతను బలోపేతం చెయ్యడానికి, వామపక్ష రాజకీయ జోక్యాన్ని పెంపొందించడానికి ఇదే సరైన అదను. నయా-ఉదారవాద పెట్టుబడిదారీ విధా నాలను నికరంగా ఎదిరిస్తూ కార్మికవర్గ ప్రయోజనాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నది వామ పక్ష శక్తులే. హిందూత్వ శక్తుల నయా-ఫాసిస్టు విధానాలను ఎదుర్కొని పోరాడగలిగే సైద్ధాంతిక బలం, విశ్వాసం కేవలం వామపక్ష శక్తులకే ఉన్నది. మన దేశంపై సామ్రాజ్యవాద శక్తులు సాగిస్తున్న కుట్రలను తిప్పికొట్టగలిగే పోరాటాలకు నాయకత్వం వహించగలిగే శక్తి ఒక్క వామపక్ష శక్తులకు మాత్రమే ఉన్నది.


వామపక్ష- ప్రజాతంత్ర ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి సి.పి.ఐ(యం) ఇతర వామపక్ష శక్తులతో కలిసి పనిచేస్తుంది.

బిజెపి-ఆర్‌యస్‌యస్‌లకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలు విజయవంతం కావడానికి తగినట్లుగా అన్ని లౌకిక-ప్రజాస్వామిక శక్తులను కూడగట్టి విశాల వేదికను నిర్మించే కృషికి సి.పి.ఐ(యం) పునరంకితమవుతుంది.

మధురై మహాసభ నుండి ఈ పిలుపు దేశవ్యాప్తంగా బిగ్గరగా ప్రతిధ్వనించాలి. మితవాద చీకటి శక్తులను తిప్పికొట్టడానికి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యంగా, బలంగా ఒక పట్టు పట్టాలి. లౌకిక, ప్రజాస్వామిక, అభ్యుదయ భావజాల విలువలతో కూడిన 'నవభారత' నిర్మాణానికి మనమంతా కలిసికట్టుగా కృషి చేద్దాం. జనతా ప్రజాస్వామ్యం, సోషలిజం సాధనం దిశగా అడుగు ముందుకు వేద్దాం.

**(అనువాదం : కె.సత్యరంజన్)**

# ఫెడరల్ స్ఫూర్తికి ముప్పుగా డీలిమిటేషన్ ప్రక్రియ



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎంవిఎస్ శర్మ

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ చొరవతో మార్చి 22న చెన్నైలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ మీద జరిపిన సమావేశంలో 7 రాష్ట్రాలనుండి ప్రతినిధులు పాల్గొన్నారు. తమిళనాడు, కేరళ, తెలంగాణా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు కర్నాటక, ఒడిశా, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలనుండి ప్రతినిధులు పాల్గొన్నారు. లోక్ సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ న్యాయంగా జరిగేలా పోరాడేందుకు ఒక జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కేంద్రం తలపెడుతున్న డీలిమిటేషన్ ప్రక్రియ వలన జనాభా నియంత్రణతో బాటు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రాలు నష్టపోతాయని, అందువలన అన్ని రాష్ట్రాలతోనూ చర్చలు జరపాలని, డీలిమిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని జెఎసి డిమాండ్ చేసింది.

### ఏమిటీ డీలిమిటేషన్?

లోక్ సభ స్థానాల సంఖ్యను, ఆయా రాష్ట్రాల అసెంబ్లీల నియోజక వర్గాల సంఖ్యను, వాటి భౌగోళిక హద్దులను పునర్నిర్ణయించడాన్ని డీలిమిటేషన్ అంటారు. మన దేశంలో 18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు ఉంది. ఈ హక్కు అందరికీ సమానమే. కాని ఇప్పుడు హిందీ ప్రాంతంలోని కొన్ని లోక్ సభ నియోజకవర్గాల్లో ఒక్కోదానిలో 20 నుండి 30 లక్షల వరకూ జనాభా ఉంటే, కొన్ని కేంద్ర పాలిత ప్రాంతాల్లోని నియోజక వర్గాల్లో కేవలం 50 వేల మంది జనాభా మాత్రమే ఉన్నారు. అంటే ఎక్కువ జనాభా కలిగిన ప్రాంతాల ఓటర్ల ఓటు విలువ తక్కువగా ఉంది. దానితో పోల్చితే తక్కువ జనాభా ఉన్న ప్రాంతాల ఓటర్ల ఓటు విలువ ఎక్కువగా ఉంది. ఈ ఎగుడు దిగుడులను ఎప్పటికప్పుడు సరి చేయడానికి రాజ్యాంగం ఒక విధానాన్ని రూపొందించింది. అదే డీలిమిటేషన్. రాజ్యాంగం లోని 82వ అధికరణం ఇందుకు విధివిధానాలను నిర్దేశించింది. దాని ప్రకారం దేశాధ్యక్షులు ఒక డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. అందులో ఒక రిటైర్ అయిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి, (లేదా రిటైర్ అయిన హైకోర్టు న్యాయమూర్తి) చీఫ్ ఎలక్షన్ కమిషనర్, రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. ప్రతీ పదేళ్ళ తర్వాత జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ పూర్తి కాగానే ఈ కమిషన్ నియోజకవర్గాల సంఖ్యను, వాటి హద్దులను నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం 1951, 1961, 1971 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ జరిగింది. 1952 ఎన్నికలలో 489 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరిగితే, 1962లో 494 స్థానాలకు, 1972లో 543 స్థానాలకు ఆ సంఖ్య పెరిగింది.

1976లో రాజ్యాంగానికి చేసిన 42వ సవరణ ద్వారా ఈ డీలిమిటేషన్ ప్రక్రియను 25 సంవత్సరాలపాటు, అంటే 2001 వరకూ వాయిదా వేశారు. కొన్ని రాష్ట్రాలు తమ జనాభా పెరుగుదలను నియంత్రించడంలో బాగా వెనకబడుతున్నాయని, దాని వలన లోక్ సభ స్థానాల పునర్నిర్ణయంలో అసమతుల్యత ఏర్పడుతుందని, అందుచేత ఆ రాష్ట్రాలు జనాభా నియంత్రణ మీద శ్రద్ధ పెట్టి పురోగతి సాధించే వరకూ డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని ఆ సవరణ ద్వారా నిర్ణయించారు. మళ్ళీ 2001లో (అప్పటికి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది) అదే కారణంతో డీలిమిటేషన్‌ను మరో 25 సంవత్సరాల పాటు వాయిదా వేస్తూ రాజ్యాంగానికి 84వ సవరణ చేశారు. ఈ సవరణ 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల సేకరణ ప్రాతిపదికగా డీలిమిటేషన్‌ను చేపట్టాలని నిర్దేశిస్తోంది.

మన దేశంలో ప్రతీ పది సంవత్సరాలకూ ఒకసారి జనాభా లెక్కలను సేకరిస్తారు. 2021లో జరగవలసిన జనగణనను కరోనా కారణంగా వాయిదా వేశారు. కాని కరోనా ముప్పు తొలగిపోయి మూడేళ్ళు కావస్తున్నా ఇంకా కేంద్రం దాని జోలికి పోవడం లేదు. 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026 తర్వాత తొలి జనగణన ప్రాతిపదికన డీలిమిటేసన్ జరగాలి. అంటే 2031 జనగణన ప్రాతిపదికన జరగాలి.

### జనాభా విస్ఫోటనం

1971 నాటికి దేశంలో 54.8 కోట్ల జనాభా ఉంటే ఇప్పుడు 140 కోట్లు దాటిపోయింది. అంటే 50 ఏళ్ళ పాటు డీలిమిటేషన్ ను వాయిదా వేసినా (1976లో మొదటిసారి, 2001లో రెండవసారి) జనాభా నియంత్రణ లక్ష్యాలను చేరుకోవడంలో కొన్ని రాష్ట్రాలు ఘోరంగా విఫలం అయాయి. ఇప్పుడేం చేయాలన్నది ముందున్న ప్రశ్న. ఇప్పటికే ఓటర్ల సంఖ్యలో అసమతుల్యత చాలా ఎక్కువగా ఉంది గనుక డీలిమిటేషన్‌ను చేపట్టాలన్నది ఒక వాదన అయితే, డీలిమిటేషన్‌ను ఇప్పుడున్న జనాభా ప్రాతిపదికన చేపడితే రాష్ట్రాల మధ్య అసమతుల్యత ఇంకా పెరిగిపోతుందన్నది రెండో వాదన.

ఇంకా స్పష్టంగా అర్థం కావడానికి ఒక అధ్యయన సంస్థ వేసిన అంచనాలను పరిశీలిద్దాం. 2026 నాటి జనాభా అంచనాల ప్రకారం డీలిమిటేషన్‌ను చేపడితే నియోజక వర్గాల సంఖ్యలు ఎలా మారనున్నాయ న్నది ఆ అధ్యయనం వెల్లడిస్తోంది. ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా 543 గానే కొనసాగిస్తూ తాజా జనాభా ప్రకారం ఆయా రాష్ట్రాల లోక్‌సభ స్థానాల సంఖ్యను సవరిస్తే ఎలా మారుతాయి అన్నది అంచనా వేస్తే కొన్ని రాష్ట్రాలలో దిగువ విధంగా ఉంటుంది:

> కేవలం లోక్ సభ స్థానాల సమస్య మాత్రమే కాదిది. ఆర్థిక సంఘం కేటాయింపులలో కూడా మొత్తం నిధుల్లో 50 శాతం జనాభా ప్రాతిపదికనే ఉంటాయి. ఆ విధంగా చూసినా, దక్షిణాది రాష్ట్రాల, ఇతర అభివృద్ధిసాధిస్తున్న రాష్ట్రాల వాటాలు ఆ కేటాయింపుల్లో తగ్గిపోతాయి.

| రాష్ట్రం | ప్రస్తుత స్థానాలు | 2026 జనాభా ప్రకారం సవరిస్తే | పెరుగుదల లేదా తరుగుదల |
|---|---|---|---|
| యు.పి. | 80 | 91 | +11 |
| బీహార్ | 40 | 50 | +10 |
| రాజస్తాన్ | 25 | 31 | + 6 |
| ఎం.పి. | 29 | 33 | + 4 |
| తమిళనాడు | 39 | 31 | – 8 |
| ఎపి+తెలంగాణా | 42 | 34 | – 8 |
| కేరళ | 20 | 12 | – 8 |
| కర్నాటక | 28 | 26 | – 2 |
| పంజాబ్ | 13 | 12 | – 1 |
| హిమాచల్ | 4 | 3 | – 1 |
| ఉత్తరాఖండ్ | 5 | 4 | – 1 |

పై అంచనాలను చూస్తే నాలుగు రాష్ట్రాల లోక్‌సభ స్థానాల సంఖ్య బాగా పెరుగుతుంది. తక్కిన రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గుతుంది అని తేల్తోంది. ఈ జాబితాలో లేని మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా, హర్యానా, తదితర రాష్ట్రాల లోక్‌సభ స్థానాలు కూడా పెరగకపోగా తగ్గే పరిస్థితే ఉంది. ఈశాన్య రాష్ట్రాల స్థానాలూ అంతే.

ఇక గతంలో మాదిరిగా లోక్ సభ సీట్లను జనాభా పెరిగిన ప్రకారం 848 కి పెంచి పునర్నిర్ణయిస్తే ఎలా ఉంటుందన్న అంచనా కూడా ఉంది.

అంటే సీట్లను పెంచి లెక్కించినా, యుపి. బీహార్, రాజస్తాన్, ఎంపి రాష్ట్రాలలోని స్థానాలే అత్యధికంగా పెరుగుతాయి. ఇటీవల కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా స్పందిస్తూ “దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గబోదు” అని ప్రకటించారు. డీలిమిటేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నదీ, లేనిదీ ఇంకా ప్రభుత్వం ప్రకటించలేదు. అందుకు నియమించవలసిన కమిషన్ కూడా ఉనికిలోకి రాలేదు. కానీ అమిత్‌షా ఈ విధంగా ప్రకటించడం అనుమానాలకు, ఆందోళనలకు కారణం అవుతోంది. ఇంతకూ కొన్ని రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గకపోయినా, మొత్తం సీట్లలో ఆ రాష్ట్రాల నిష్పత్తి తప్పనిసరిగా తగ్గిపోనుంది అన్నది పై రెండు జాబితాల్లో దేనిని చూసినా స్పష్టంగా తేలు తోంది. అంతేకాక, ఈ సమస్య దక్షిణాది రాష్ట్రాలకు, ఉత్తరాది రాష్ట్రాలకు నడుమ సమస్య కానేకాదనీ, నాలుగు రాష్ట్రాలు మినహా అత్యధిక రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోనున్నదనీ ఈ జాబితాలు స్పష్టం చేస్తున్నాయి.

| రాష్ట్రం | ప్రస్తుత స్థానాలు | సవరించిన స్థానాలు | పెరుగుదల లేదా తరుగుదల |
|---|---|---|---|
| యు.పి. | 80 | 143 | +63 |
| బీహార్ | 40 | 79 | +39 |
| రాజస్తాన్ | 25 | 50 | +25 |
| ఎం.పి.. | 29 | 52 | +23 |
| తమిళనాడు | 39 | 49 | +10 |
| ఎపి+తెలంగాణా | 42 | 54 | +12 |
| కేరళ | 20 | 20 | 0 |
| కర్నాటక | 8 | 41 | 13 |
| పంజాబ్ | 13 | 18 | +5 |
| హిమాచల్ | 4 | 4 | 0 |
| ఉత్తరాఖండ్ | 5 | 7 | +2 |
| ఈశాన్య రాష్ట్రాలు (అస్సాం మినహా) | 11 | 11 | 0 |

**జెఎసి వాదనలు**

1. దక్షిణాది రాష్ట్రాల స్థానాల వాటా డీలిమిటేషన్ వలన 24 శాతం తగ్గిపోతుంది. అందువలన ప్రభుత్వ అధికారంలో సమతుల్యత దెబ్బ తింటుంది.

2. ఏయే రాష్ట్రాలైతే శ్రద్ధగా కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను అమలు జరుపుతూవస్తున్నాయో, వాటిని అందుకు సత్కరించి ప్రోత్సహించే బదులు శిక్షిస్తారా? ఏ రాష్ట్రాలు విఫలమయ్యాయో వాటిని సత్కరిస్తారా?

3. కేవలం లోక్ సభ స్థానాల సమస్య మాత్రమే కాదిది. ఆర్థిక సంఘం కేటాయింపులలో కూడా మొత్తం నిధుల్లో 50 శాతం జనాభా ప్రాతిపదికనే ఉంటాయి. ఆ విధంగా చూసినా, దక్షిణాది రాష్ట్రాల, ఇతర అభివృద్ధిసాధిస్తున్న రాష్ట్రాల వాటాలు ఆ కేటాయింపుల్లో తగ్గిపోతాయి.

4. డీలిమిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలి. అన్ని రాష్ట్రాలనూ విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడి అభిప్రాయానికి వచ్చి దానిని అమలు చేయాలి. కేంద్రం ఏకపక్షంగా ముందుకు పోకూడదు.

5. డీ మిటేషన్‌ను మరో 25 సంవత్సరా లపాటు వాయిదా వేయాలి, లేదా 1971 జనాభా లెక్కల ప్రాతిపదికనైనా తీసుకుని డీలిమిటేషన్ చేయాలి. ఏది చేసినా ఇప్పుడు రాష్ట్రాలకున్న ప్రాతినిధ్య నిష్పత్తి ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గిపోకూడదు.

**బిజెపి వైఖరి**

డీలిమిటేషన్ సమస్యను ఒక వివాదంగా మార్చి, రాష్ట్రాల నడుమ తంపులు పెట్టి ఆ క్రమంలో రాజకీయ లబ్ధి పొందాలని బిజెపి ప్రయత్నిస్తోందని భావించాల్సివస్తుంది. ఇలా భావించడానికి కొన్ని కారణాలు ఉన్నాయి.

1. జనాభా ప్రాతిపదికన మాత్రమే ఇప్పుడు డీలిమిటేషన్ గనుక చేపడితే సీట్లు బాగా పెరిగే రాష్ట్రాలలో ఇప్పుడు బిజెపి లేదా ఎన్డీయే ప్రభుత్వాలే ఉన్నాయి. దేశంలో పదేళ్ళనుండీ అధికారంలో ఉన్నా, ఇప్పటికీ చాలా రాష్ట్రాలలో బిజెపి ఓట్ల బలం పెరగడం లేదు. 2024 ఎన్నికల్లో ఆ బలం తగ్గింది కూడా. చెరపకుండానే ఒక గీతను చిన్నది చేయాలంటే దాని పక్కన అంతకన్నా పెద్ద గీతను గీయడమే మార్గం అన్న నానుడి ఉంది. దానిని బిజెపి పాటించి లబ్ధి పొందాలనుకుంటోంది. దానితో కేంద్రంలో అధికారమూ స్థిరం చేసుకోవచ్చు, తన భాగస్వామ్య పార్టీల ప్రాధాన్యతనూ కుదించవచ్చు, ప్రతిపక్షాలనూ బలహీనపరచవచ్చు.

2. ఫెడరల్ స్ఫూర్తికి బిజెపి వ్యతిరేకం. ఆ పార్టీ మొదటినుంచీ కేంద్రీకృత అధికారాలనే కోరుకుంటోంది. అధ్యక్షతరహా పాలనను, అధికారాలు లేని చిన్న చిన్న రాష్ట్రాలను, వనరుల కేంద్రీకరణను బిజెపి కోరుతోంది. డీలిమిటేషన్ ప్రక్రియ ఆ విధానాల అమలుకు కావలసిన సంఖ్యాబలాన్ని కొంతమేరకైనా కల్పిస్తుంది.

> **“ ఫెడరల్ స్ఫూర్తికి బిజెపి వ్యతిరేకం. ఆ పార్టీ మొదటి నుంచీ కేంద్రీకృత అధికారాలనే కోరుకుంటోంది. అధ్యక్షతరహా పాలనను, అధికారాలు లేని చిన్న చిన్న రాష్ట్రాలను, వనరుల కేంద్రీకరణను బిజెపి కోరుతోంది. డీలిమిటేషన్ ప్రక్రియ ఆ విధానాల అమలుకు కావలసిన సంఖ్యాబలాన్ని కొంతమేరకైనా కల్పిస్తుంది. ”**

**వాస్తవాలనుండి దృష్టిని మళ్ళించే ప్రయత్నం**

డీలిమిటేషన్‌కు ప్రాతిపదిక తాజా జనాభా లెక్కలు. మరి బిజెపి ప్రభుత్వం జనగణన ప్రక్రియను వెంటనే ప్రారంభించే చర్యలను ఎందుకు తీసుకోవడం లేదు? కరోనా ముప్పు దాటిపోయి ఇన్ని సంవత్సరాలు గడిచినా బిజెపి ఆ వూసు ఎందుకు ఎత్తడం లేదు?

దేశ వ్యాప్తంగా వెనుకబడ్డ తరగతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను సర్వే చేసి లెక్కలు తేల్చాలన్న డిమాండ్ అన్నివైపులనుండీ వస్తోంది. బిజెపి మాత్రం ఈ విషయంలో మౌనం వహిస్తోంది. దీనికి కారణం ఏమిటి? ఒకవైపు కులాల రాజకీయాలను నడుపుతూనే మరోవైపు వారికి సంబంధించిన వాస్తవ స్థితిగతులను తేల్చడానికి ఎందుకు వెనకాడుతోంది? జనగణనలో అంతర్భాగంగా బిసిల సర్వేను చేర్చవచ్చు కదా?

ముస్లింల వల్లే హిందువులు వెనకబడ్డారు అని, ముస్లిం జనాభా విపరీతంగా పెరిగిపోతోంది అని, గత ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం ముస్లింలను విపరీతంగా బుజ్జగించే వైఖరి తీసుకోవడం వల్లే హిందువులు నష్టపోతున్నారని నిరాధారమైన విద్వేష ప్రచారాన్ని బిజెపి –ఆరెస్సెస్ ఎప్పటినుంచో సాగిస్తూనేవున్నాయి. జనాభా లెక్కలు తీస్తే అసలు విషయాలు బైట పడతాయి. బిజెపి పదేళ్ళ పాలన నిర్వాకాలు కూడా వెలుగులోకి వస్తాయి. ఆ వాస్తవాలను స్వీకరించే ధైర్యం బిజెపికి లేదు. 2017–18 లో దేశంలో పౌష్టికాహార లభ్యత మీద జరిపిన సర్వే దిగ్భ్రాంతిని కలిగించే కొన్ని వాస్తవాలను బైటపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 63 శాతం ప్రజలు కనీస స్థాయి ఆహారం లేకుండా ఇక్కట్లపాలౌతు న్నారని ఆ సర్వే వెల్లడించింది. ఆ నివేదికను వెబ్‌సైట్‌లో పెట్టిన గంటలోపే దానిని తొలగించివేశారు మోడీ ప్రభుత్వ అధికారులు. అంతే కాదు, మళ్ళీ 2022–23 లో చేయవల సిన సర్వేను కూడా నిలిపివేశారు. దేశంలో ప్రాంతీయంగా, సామాజిక తరగతులవారీగా, స్త్రీ–పురుషుల ప్రాతిపదికగా ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. జనగణన ఈ వాస్తవాలను వెల్లడిస్తుంది. వాటిని కప్పిపుచ్చడం సాధ్యం కాదు. అందుచేత ఏదో సాకుతో జనగణనను ఎగ్గొట్టి నాటకం ఆడుతోంది కేంద్ర ప్రభుత్వం.

1976లో, మళ్ళీ 2001లో రాజ్యాంగాన్ని సవరించి మరీ డీలిమిటేషన్ ప్రక్రియను ఐదు దశాబ్దాలపాటు వాయిదా వేశారు. ఇంత కాలం గడిచినా యుపి, బీహార్, రాజస్తాన్, ఎం.పి, రాష్ట్రాల్లో జనాభా నియంత్రణ ఎందుకు జయప్రదం కాలేకపో యింది? ఎందుకు ఆ రాష్ట్రాల ప్రజలు వెనకబడిపోయారు? ఈ మౌలిక ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పాలి. పేదరికం ఎక్కువగా ఉండే చోటే జనాభా కూడా ఎక్కువగా ఉంటుంది. మూడవ ప్రపంచ దేశాల్లో జనాభా ఎక్కువగా ఉండడానికి, సంపన్న దేశాలలో జనాభా తక్కువగా ఉండడానికి పేదరికమే కారణం. చైనా పేదరికాన్ని అధిగమించడంలో విజయం సాధించడంతో బాటే జనాభా నియంత్రణ లోనూ జయప్రదం కాగలిగింది. కానీ మన దేశంలో కార్పొరేట్లను మరింత పెంచే విధానాలనే ఈ ఐదు దశాబ్దాలలోనూ అమలు చేశారు గనుక ఇక్కడ జనాభా నియంత్రణలో పూర్తి విజయం సాధించలేకపోయాం. ఉన్న పరిమితుల్లో కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేయడానికి ప్రయత్నిం చాయి కనుక అక్కడ జనాభా నియంత్రణ కొంతవరకైనా జరిగింది. ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభావృద్ధి 231 శాతం ఉంటే దక్షిణాదిలో 171 శాతం ఉంది. యుపి, బీహార్, రాజస్తాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 1967 తర్వాత ఎక్కువ ప్రభుత్వాలలో బిజెపి ( లేదా దాని పూర్వ రూపం జనసంఘ్) భాగస్వామిగా కొనసాగింది. ఆ పార్టీ అనుసరించిన విధానాల వల్ల అక్కడ పేదరికం పెరిగిందే తప్ప తగ్గలేదు. బుల్డోజర్ పాలన సాగిస్తున్నారు. ఈ వాస్తవాలమీద అర్థవంతమైన, ప్రజాస్వామిక స్ఫూర్తి కలిగిన చర్చ జరపడానికి బిజెపికి సత్తా లేదు. అందుకే ఏదో ఒక వివాదాన్ని ముందుకు తెస్తూ ప్రజల దృష్టిని పక్కదోవ పట్టిస్తుంది.

ప్రణాళికా విధానాన్ని రద్దు చేయడం, జిఎస్‌టిని తెచ్చి రాష్ట్రాల ఆర్థిక వనరులమీద పెత్తనం చెలాయించడం, వసూలైన పన్నుల్లో రాష్ట్రాల వాటాను ఎగగొట్టడం, లేదా కుదించడం, వెనుకబడ్డ ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధిని పట్టించుకోకపోవడం, ఉపాధి హామీ పథకం వంటి పేదరిక నిర్మూలన పథకాలను నీరుగార్చడం, సహకార వ్యవస్థను నాశనం చేయడం, సెస్‌లు, సర్‌చార్జిలను పెంచి రాష్ట్రాలకు రావలసిన వనరులకు ఎగనామం పెట్టడం– ఇలా రకరకాలుగా బిజెపి ప్రభుత్వం

> **" డీలిమిటేషన్ సమావేశంలో పాల్గొనడానికి ముందు సంసిద్ధత తెలిపిన వైసిపి తర్వాత గైరుహాజరైంది. జగన్ మోడీకి ఈ విషయం మీద ఒక లేఖ రాశారు. డీలిమిటేషన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుందని అంటూనే, "ఆ అన్యాయాన్ని జరగకుండా చూసే మోడీ సమర్ధవంతమైన నాయకత్వం" పట్ల ప్రగాఢ విశ్వాసాన్ని, విధేయతను ప్రకటించారు. "**

రాష్ట్రా హక్కులమీద, స్వయంప్రతిపత్తి మీద దాడి చేస్తూనేవుంది. తాను నియమించిన గవర్నర్ల ద్వారా ప్రతిపక్ష రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాల పాలనకే ఆటంకాలు కల్పిస్తోంది. ఆయా బాధిత రాష్ట్రాలు ఇప్పుడు లోక్ సభలో కనీసం తమ గోడును చెప్పుకోడానికైనా కొంత సంఖ్యాబలం ఉంది. ఇప్పుడు డీలిమిటేషన్ పేరుతో ఆ అవకాశాన్ని కూడా కుదించడానికి బిజెపి ప్రయత్నిస్తోంది.

**ప్రాంతీయ పార్టీల వైఖరులు**

ప్రాంతీయ పార్టీలలో ఎక్కువ భాగం ఆయా రాష్ట్రాలు ఎదుర్కొన్న వివక్షతకు తలెత్తిన ప్రతిఘటననుంచి పుట్టుకొచ్చాయి. డీలిమిటేషన్ కారణంగా అత్యధిక రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గనుంది. అందుచేత ప్రాంతీయ పార్టీలన్నీ ఈ డీలిమిటేషన్ విషయంలో ఒకదగ్గరకు చేరాలి. కాని కొన్ని పార్టీలు మాత్రమే డీలిమిటేషన్ విషయంలో వ్యతిరేకంగా స్పందిస్తున్నాయి. తమిళనాడులోని అన్ని పార్టీలూ (బిజెపి మినహా) ఈ విషయంలో ఒకే వైఖరితో ఉన్నాయి. కేరళలో కూడా అంతే. ఒడిశా లోని బిజెడి డీలిమిటేషన్ పట్ల జెఎసి తోనే ఉన్నాననిప్రకటించింది. తెలంగాణాలోని బిఆర్ఎస్ కూడా డీలిమిటేషన్‌ను ప్రస్తుత రూపంలో వ్యతిరేకిస్తోంది. ఇక తృణమూల్ కాంగ్రెస్ మాత్రం విచిత్రంగా తమ ప్రభుత్వం ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డుల జారీ విషయంలో కేంద్రంతో పోరాటంలో ఉన్నందున డీలిమిటేషన్ విషయంలో ఎటువంటి వైఖరినీ తీసుకోబోవడం లేదంటూ గోడమీద పిల్లివాటాన్ని ప్రదర్శిస్తోంది. డీలిమిటేషన్ లో పశ్చిమ బెంగాల్‌కూ నష్టమే జరుగుతుంది. ఐనా టిఎంసి దానిని విస్మరిస్తోంది.

డీలిమిటేషన్ సమావేశంలో పాల్గొనడానికి ముందు సంసిద్ధత తెలిపిన వైసిపి తర్వాత గైరుహాజరైంది. జగన్ మోడీకి ఈ విషయం మీద ఒక లేఖ రాశారు. డీలిమిటేషన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరుగుతుందని అంటూనే, "ఆ అన్యాయాన్ని జరగకుండా చూసే మోడీ సమర్ధవంతమైన నాయకత్వం" పట్ల ప్రగాఢ విశ్వాసాన్ని, విధేయతను ప్రకటించారు. ఇక టిడిపి డీలిమిటేషన్ విషయంలో సమావేశానికి వెళ్ళకపోగా పూర్తిగా మౌనం పాటిస్తోంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు మనకు ఎక్కువ సీట్లు కావాలంటే ఎక్కువమంది సంతానాన్ని కనడమే పరిష్కారం అని బహిరంగంగా ప్రకటించేశారు కూడా. ఇంతకన్నా సిగ్గుచేటు ఇంకొకటి ఉంటుందా? జనసేనకు చెందిన ఒక పార్లమెంటు సభ్యుడు చెన్నైలో విమానం దిగి సమావేశానికి పోకుండానే ఎంచక్కా వెనుదిరిగి వచ్చేసినట్టు హిందూ దినపత్రిక వెల్లడించింది. ఇదీ మన రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీల పరిస్థితి. వీళ్ళ చేతుల్లో మన రాష్ట్ర ప్రయోజనాలు ఏం కానున్నాయో వేరే చెప్పనవసరం లేదు.

డీలిమిటేషన్‌కు సూత్రప్రాయంగా ఎవరూ వ్యతిరేకం కాదు. అందుకోసం జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడం పట్ల ఎవరికీ వ్యతిరేకత లేదు. కాని భారతదేశం భిన్న జాతుల సమాఖ్య. రాజ్యాంగంలోని మొదటి వాక్యమే ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఈ సమాఖ్యస్ఫూర్తిని ఎంత బలంగా కాపాడుకుంటే అంత బలంగా దేశం ముందుకు సాగుతుంది. భిన్న జాతులన్నీ భారత దేశంగా ఒక్కటైన నాడు ఏయే నిష్పత్తిలో వాటి ప్రాతినిధ్యం లోక్‌సభలో ఉందో అదే నిష్పత్తి కొనసాగినప్పుడే ఆ సమాఖ్యతత్వం పటిష్టంగా కొనసాగుతుంది. జనాభా పెరుగుదల ఎగుడుదిగుడుగా జరిగినందువల్లనే రెండుసార్లు రాజ్యాంగాన్ని సవరించి మరీ డీలిమిటేషన్‌ను ఏభై సంవత్సరాలపాటు వాయిదా వేశారు. అంటే ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలగకూడదన్న చైతన్యాన్ని అప్పటి ప్రభుత్వాలు ప్రదర్శించాయి. ఇప్పుడు కూడా జనాభా ఎగుడుదిగుడులను సరి చేసేవరకూ డీలిమిటేషన్‌ను వాయిదా వేయడమే పరిష్కారం. అసమానతలను తొలగించి జనాభాను ఆయా రాష్ట్రాల్లో తగు విధంగా నియంత్రించడమే ముందు జరగాలి. అసమానతలను, పేదరికాన్ని తొలగించే ఆర్థిక విధానాలు అమలులోకి రావాలి.

అమెరికా కనుసన్నల్లో మెలిగే మన ప్రభుత్వం డీలిమిటేషన్ విషయంలో మాత్రం అమెరికాను అనుసరించడం లేదెందుకని? అక్కడ అమెరికన్ కాంగ్రెస్‌లో స్థానాలు 435గా 1913 నుండీ కొనసాగుతున్నాయి. అమెరికా కూడా ఒక ఫెడరల్ రాజ్యాంగం కలిగివుంది. 1913 నాటి జనాభా 9.4 కోట్లు అయితే 2024 నాటికి అది 34 కోట్లు. కాని ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యం యధాతథంగా కొనసాగుతోంది.

ఐతే బిజెపి హయాంలో ఇటువంటి సూత్రబద్ధ విధానాలను మనం ఆశించగలమా? అందుకే వాటిని ప్రతిఘటించి ఫెడరల్ స్ఫూర్తి నిలబెట్టడానికి ఏర్పడిన జెఎసికి మద్దత్తునివ్వడమే ఇప్పుడు మనం చేయవలసిన పని. రాష్ట్ర ప్రయోజనాలకన్నా కార్పొరేట్లకు, మోడీ ప్రభుత్వానికి భజన చేయడంలోనే తలమునకలౌతున్న ఆంధ్రప్రదేశ్ పార్టీల అవకాశవాదాన్ని రాష్ట్ర ప్రజానీకానికి వివరించడమే విజ్ఞుల కర్తవ్యం. ❋

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# ఆర్‌ఎస్‌ఎస్‌-బిజెపి పరివార్ మతతత్వ దాడులను ఎదుర్కోవాలి

మతాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టటం ద్వారా సమాజాన్ని విభజించటం కోసం ఆర్‌ఎస్‌ఎస్‌-బిజెపి- సంఘ్ పరివార్ చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో భాగంగా, దేశంలోని వివిధ ప్రాంతాలలో వరుస వారీగా మతపరమైన దాడులను తీవ్రం చేయటాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ తీవ్రంగా ఖండిస్తున్నది. కేంద్రంలోను, వివిధ రాష్ట్రాలలో ఉన్న బిజెపి ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని అధిగమించటానికి, మెజారిటి మతంలోని ప్రజలలో హిందుత్వ ఎజెండాకు మద్దతును నిలబెట్టుకోవటానికి, పెంచుకోవటానికి ఇదొక్కటే మార్గమని సంఘ్ పరివార్‌కు తెలుసు.




అందువలననే ప్రజలను మతపరంగా విడదీయటానికి గతం నుండి ఉన్న సమస్యలతో పాటు కొత్త అంశాలపై కూడా ప్రచారం చేయటాన్ని మనం చూస్తున్నాం. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి లాంటి హిందువుల పండుగలను ఉపయోగించుకొని, ముస్లింల నివాస ప్రాంతాలు, మసీదుల వద్ద వారిపై దాడులు చేయటం పెరుగుతున్నది. రంజాన్ మాసంలో శుక్రవారం నాడు హోలి పండుగ రావటాన్ని పురస్కరించుకొని, ముస్లింలపై దాడులు చేయటానికి, వారిని బెదిరించటానికి పూనుకున్నారు.

ఈ మధ్య జరుగుతున్న దాడులలో ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే పిల్లలను కూడా వదిలి పెట్టటం లేదు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో పోలీసులు ఒక పిల్లవాడిని తొక్కి చంపారు. మహారాష్ట్రలోని మల్వాన్‌లో ఎటువంటి ఆధారాలు లేకపోయినప్పటికీ పాకిస్తాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశాడన్న నేరం మోపి, 15 సంవత్సరాల యువకుడిని జైలుపాలు చేశారు.

చరిత్రను వక్రీకరించి,ముస్లింలపై ద్వేషాన్ని పెంచే సినిమాలను బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ మధ్య వచ్చిన “చావా” సినిమా ఔరంగజేబును రాక్షసుడిగా చూయించి, ఆయన సమూహానికి చెందిన వారందరూ అటువంటి వారేనని ముద్ర వేసింది. సహజంగా హిందువులు, ముస్లింలు కలిసి పాల్గొనే యాత్రలు, ఉత్సవాలు తదితరాల నుండి ముస్లింలను మినహాయించటం కోసం మహారాష్ట్రలో బిజెపి మంత్రులు దీనిని ఉపయోగించుకొంటున్నారు. ఈ విధమైన ప్రచారం వలననే నాగపూర్‌లో ఘర్షణలు జరిగాయి. అనేకమంది ముస్లింలను అరెస్టు చేశారు. ఒక ముస్లిం నాయకుని ఇంటిని బుల్‌డోజర్‌తో కూల్చివేశారు.

దేవాలయాలను కూల్చివేసి, వాటిపై మసీదులు నిర్మించారని తాము చేస్తున్న వాదనలను కోర్టులు బలపరిచేలా చేయటానికి ఈ మధ్యకాలంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు, వారి మద్దతుదారులు పదే పదే ప్రయత్నాలు చేస్తున్నారు. దురదృష్టవశాత్తు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌తో పాటు అనేక కిందిస్థాయి కోర్టులు తమ వ్యాఖ్యలు, ఆదేశాలతో అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. అనేక ప్రాంతాలలో ప్రజలు మతపరంగా చీలిపోవటానికి ఇవి దోహదం చేస్తున్నాయి. సంభాల్‌లో జరిగిన విషాదకరమైన పరిణామాలలో ఐదుగురు ముస్లిం యువకులను కాల్చి చంపారు. సంభాల్‌లో జరిగే ఉత్సవాల్లో లక్షలాది ప్రజలు-ముస్లింల కన్నా హిందువులు ఎక్కువ మంది పాల్గొంటారు. శతాబ్దాలుగా పాల్గొంటున్న ఉత్సవాలను జాతి వ్యతిరేక శక్తుల పేరుతో నిషేధించారు. అనేక మతాల ప్రజలను ఒక్కచోటికి తీసుకొచ్చే సమ్మిళిత ఉత్సవాలపై ఇది తీవ్రమైన దాడి.

మహిళలు, ముఖ్యంగా యువ దంపతుల హక్కులపై దాడి చేసే ఉత్తరాఖండ్‌లోని యుసిసి లాంటి కొత్త చట్టాలు ముస్లిం పర్సనల్ చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేశాయి. యుపి, మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలు మత మార్పిడి చట్టాలను మరింత కఠినతరం చేసి, మతాంతర వివాహం చేసుకున్న ముస్లిం యువకుడు-హిందు మహిళ జంటలపై తీవ్రంగా ప్రయోగిస్తున్నారు. ఈ విధమైన వివాహాలు చేసుకున్న పురుషులకు మరణశిక్ష విధించటం గురించి కూడా ప్రతిపాదనలు చేస్తున్నారు.

ముస్లింలు, ఇతర మైనారిటి మతాల ప్రజలపై దాడులు చేస్తూ ప్రజలను మతపరంగా చీల్చటానికి సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నాలను, ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ ఎజెండాను ప్రజల ముందు బట్టబయలు చేయటానికి శక్తివంతంగా ప్రచారం చేయాలని సిపిఐ(ఎం) 24వ మహాసభ అన్ని పార్టీ శాఖలకు పిలుపు ఇస్తున్నది. ఈ దాడులను ప్రతిఘటించటానికి విస్తృత ప్రజానీకాన్ని, లౌకిక, ప్రజాస్వామిక సంస్థలను సమీకరించటానికి పార్టి అన్ని ప్రయత్నాలు చేయాలని పిలుపునిస్తున్నది.

# ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, సమగ్రంగా, పారదర్శకంగా వ్యవహరించాలనే డిమాండ్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలి

గత దశాబ్దంలో రాజ్యాంగ వ్యతిరేకంగా, ఏ మాత్రం పారదర్శకం కాని పద్ధతులలో ఎన్నికలు నిర్వహించిన భారత ఎన్నికల కమిషన్ తీరు పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ తీవ్ర ఆందోళన, ఆవేదనను వ్యక్తం చేస్తున్నది. స్వతంత్రత క్షీణించటం, ప్రతిపక్ష రాజకీయ పార్టీల పట్ల తిరస్కార భావంతో వ్యవహరించటం, ఎన్నికల చట్టాలను ఉల్లంఘించటం, ఎన్నికల నియమావాలు, నిబంధనలను పక్కన పెట్టి వ్యవహరించటంతో ఎల్లప్పుడూ ధనవంతులకు అనుకూలంగా ఉంటున్న ఎన్నికల విధానం పూర్తి ప్రహసనంగా మారింది.

ఎన్నికల కమిషనర్ల నియామకంలో స్వతంత్రంగా వ్యవహరించాలని 2023 నవంబరులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వమ్ము చేస్తూ, ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే కమిటి నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని మినహాయిస్తూ హడావిడిగా చట్టం చేసింది. దీనితో సెలక్షన్ కమిటీలోని ముగ్గురిలో ఇద్దరు పాలకపార్టీ కేబినెట్ మంత్రులు ఉంటారు.

ఇసిఐ భారత ప్రజలలో గణనీయమైన భాగం విశ్వాసాన్ని కోల్పోయింది. సెంటర్ ఫర్ ది స్టడి ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సిఎస్‌డిఎస్) 2024, ఏప్రిల్‌లో నిర్వహించిన అధ్యయనం లో కేవలం 28 శాతం భారతీయులు మాత్రమే ఇసిఐపై విశ్వాసం లేదా నమ్మకం కలిగి ఉన్నారని వెల్లడించటం దిగ్భ్రాంతి కలిగించింది.

భారతదేశ ఎన్నికల విధానం దిగజారి పోవటం అనేది క్లిష్టమైనదిగానూ, అనేక స్థాయిలలో అక్రమ పద్ధతులకు పాల్పడటం తోనూ ముడిపడి ఉంది. అనేకమంది నిపుణులు, పౌరసంఘాలు నిరంతరం ముందుకు తెస్తున్న అంశాలు: ఎ) ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాతా ఓటర్ల లెక్కలను ప్రకటించక పోవటం, 2) 17సి, 17ఎ ఫారాలను బహిరంగపర్చకపోవటం, ఎన్నికల చట్టాలు,




ఇసిఐ నిబంధనలకు అనుగుణంగా వీడియో రికార్డింగ్, ఇండెక్స్ కార్డులను అందుబాటులో ఉంచకపోవటం, 3) తప్పుడు పద్ధతులలో ఓటర్ల చేర్పులు, తొలగింపులు చేస్తూ, పారదర్శకత లేకుండా ఇసిఐ పని చేయటం. వీటిపై వారు నిరంతరం జోక్యం చేసుకుంటున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎం) విశ్వసనీయత, ఎన్నికల క్రమంలో ఇసిఐ వ్యవహరిస్తున్న తీరు ప్రశ్నార్థకంగా ఉన్నది.

పక్షపాతరహితంగా ఎన్నికలను నిర్వహించటంలో విశ్వసనీయతను కోల్పోవటం, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్), ప్రజా ప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగా వ్యవహరించకుండా, చట్టాన్ని ఉల్లంఘించిన ప్రధాన ఘటనలు మొదట 2014 పార్లమెంటు ఎన్నికలలో జరిగాయి. తర్వాత 2017లో జరిగిన ఉత్తరప్రదేశ్, గుజరాత్ శాసనసభ ఎన్నికలలో, 2019 పార్లమెంటు ఎన్నికలలో కూడా ఈ విధంగా చట్టాలను ఉలంఘించటం జరిగింది. ప్రధానమంత్రి, హోంమంత్రి, యుపి ముఖ్యమంత్రి, ఇతర అధికార పార్టీ ప్రధాన నాయకులు ఎన్నికల నిబంధనావళిని ఉల్లంఘించి, బహిరంగంగా మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులు వచ్చినప్పటికీ, వాటిని పట్టించుకోకపోవటంతో ఇసిఐ పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని స్పష్టమైంది. బిజెపి తన ప్రయోజనాలను నెరవేర్చుకోవటానికి ప్రభుత్వ వనరులను దుర్వినియోగ పరచటాన్ని నిరోధించటంలో ఇసిఐ విఫలమైంది. ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు రాజ్యాంగపరంగా ఉన్న మౌలికమైన హక్కులను కూడా లాక్కుంటున్నారు. కనీసం సవరించని, సవరించిన ఓటర్ల జాబితాలను కూడా ఎన్నికలలో పోటి చేసే రాజకీయ పార్టీలకు, పౌరులకు ఇవ్వటానికి మొండిగా నిరాకరిస్తున్నారు. ఈ మధ్యనే ఇపిఐసి డూప్లికేట్ కార్డులను జారి చేసే అంశం కూడా ముందుకొచ్చింది.

2024 పార్లమెంటు ఎన్నికలలో ఓట్ల ద్వారా ప్రజలు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా కనీసం 79 నియోజక వర్గాల ఫలితాలలో సరిగా ప్రతిబింబించ లేదని ఎన్నికలు పూర్తయిన వెంటనే సాక్ష్యాలతో కూడిన నివేదికను (ప్రజాస్వామ్యానికి ఓటు) ను పౌరుల గ్రూపులు ప్రచురించాయి. ఎన్నికలు పూర్తి అయిన రోజు రాత్రి 7-8 గంటలకు పోలింగ్ వివిధ దశలలో పోలైనవని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఓట్ల లెక్కులకు, అంతిమంగా ఇచ్చిన ఓట్లసంఖ్యలో దాదాపుగా ఐదుకోట్ల ఓట్ల వ్యత్యాసం- ఖచ్చితంగా 4,65,46,885 ఓట్లు- ఉన్నది. 2024 పార్లమెంటు ఎన్నికలలో బిజెపి, ఎన్‌డిఎ కూటమి దాదాపు 79 స్థానాలలో ఈ అదనపు ఓట్లతోనే విజయం సాధించిందని రాష్ట్రాల వారీగా లభ్యమైన అంకెలు, లెక్కలపై నిపుణులు చేసిన విశ్లేషణలో వెల్లడైంది. ఏ కూటమి అధికారంలోకి వస్తుందన్న అంశాన్ని ఇవే నిర్ధారించాయి. పోలైన ఓట్లసంఖ్య అసాధారణంగా పెరగటానికి గల కారణాలను వివరించటానికి ఇసిఐ నిరాకరించింది.

మరోవైపున కొన్ని నియోజక వర్గాలలో బిజెపికి ఓటు వేయటానికి విముఖంగా ఉన్న మతాలకు, కులాలకు చెందిన వారు అధికంగా ఉన్నచోట్ల చాలా ఎక్కువగా ఓట్లను తొలగించారని అత్యంత సునిశితంగా జరిపిన సర్వేలలో స్పష్టమైంది. దీనితో పాటుగా నకిలీ ఓట్లను గుర్తించటం కోసం కొత్తగా చేర్చిన ఓట్లపై మరింత

సమగ్రంగా పరిశీలన చేయాల్సివుంది.

2024 ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంటు ఎన్నికలు, 2024 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల మధ్య ఏడు నెలల కాలంలో మహారాష్ట్రలో కొత్తగా చేరిన ఓటర్ల సంఖ్య నిర్ఘాంతపరిచేదిగా ఉందని స్వతంత్ర అధ్యయనాలలో వెల్లడైంది. ఈ కాలంలో కొత్తగా 40,81,229 ఓట్లు చేర్చారు. నెలకు (2024 ఏప్రిల్- నవంబరు నెలల మధ్య) సగటున 5,83,032 ఓట్లు అదనంగా చేర్చారు. కానీ 2019-24 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో నెలకు సగటున 71,116 మంది మాత్రమే కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. అంతకు ముందు 2014-19 మధ్య నెలకు సగటున 1,31,302 మంది మాత్రమే కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. పాలక బిజెపి నాయకత్వంలోని కూటమి ఓట్లను పెంచాలనే లక్ష్యంతోనే ఈ ఓట్లు చేర్చారనే వాదనను ఇవి బలపరుస్తున్నవి. అనేకసార్లు డిమాండ్ చేసినప్పటికీ ఇప్పటి వరకు ఈ అదనపు ఓట్లకు సంబంధించి ఎటువంటి పత్రాలను అందజేయలేదు.

దీనితో పాటు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, అస్సాంలలో ఎన్నికల బాధ్యతలలో ఉన్న పోలింగ్ అధికారులు ప్రశ్నార్థకంగా, పక్షపాత ధోరణితో వ్యవహరించారని 56 నియోజక వర్గాల నుండి రాతపూర్వకమైన ఫిర్యాదులు వచ్చాయి. ఇంతకన్నా దుర్మార్గమైనది ఏమిటంటే అట్టడుగు తరగతుల ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించు కోకుండా నిరోధించటానికి రాష్ట్ర పోలీసులను వినియోగించారు.

మరొక తీవ్రమైన అంశం 2017లో ప్రవేశపెట్టిన, 2024 ప్రారంభంలో సుప్రీంకోర్టు రద్దు చేసిన రాజ్యాంగ వ్యతిరేకమైన ఎన్నికల బాండ్ల పథకం బిజెపి-కార్పొరేట్ల మధ్య ఉన్న చట్ట విరుద్ధ సంబంధాలను ప్రజల ముందు బట్టబయలు చేసింది. ఎన్నికల బాండ్ల ద్వారా ఐదు సంవత్సరాలలో బిజెపి అత్యధిక మొత్తాన్ని-సుమారుగా 8,500 కోట్ల రూపాయలు- పొందటం, ఇది ఎన్నికలలో ఆ పార్టీకి అసమానమైన అవకాశాలు అందుబాటులోకి రావటానికి కారణమైంది. అక్రమ మార్గం ద్వారా పొందిన ఈ మొత్తాన్ని ఇచ్చిన వారికి తిరిగి చెల్లించటం లేదా ఆ మొత్తాన్ని ఖర్చు చేసిన వివరాలను వెల్లడించటం గానీ ఆ పార్టీ చేయలేదు. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయటంలో మా పార్టీ ముఖ్యమైన పాత్ర నిర్వహించిందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నాం.

ఇపిఐసి కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేయటానికి ఇసిఐ తాజాగా తీసుకుంటున్న చర్యలు ఎన్నికల విధానాన్ని అదుపు చేసే క్రమం -ఓటర్ల చేర్పులు, తొలగింపులు- పూర్తిగా కేంద్ర ప్రభుత్వం అదుపులో ఉన్న యుఐడిఎఐ చేతిలోకి పోవటానికి దారితీస్తుంది. కాబట్టి దీనిని కూడా తీవ్రంగా వ్యతిరేకించాలి. ఇపిఐసి కార్డు పౌరసత్వానికి రుజువుగా ఉండగా, ఆధార్ కార్డు మనం ఉన్న ప్రాంతం గుర్తింపును తెలుపుతుంది.

ఇటువంటి ఆందోళనకరమైన పరిణామాల నేపథ్యంలో ఇసిఐ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించే విధానానికి తిరిగి వెళ్ళాలని డిమాండ్ చేస్తూ పార్టీ విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్వహించటానికి పూనుకోవాలి. ఇసిఐ తప్పనిసరిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఎన్నికలకు సంబంధించిన సమాచారం అంతటినీ పారదర్శకంగా రాజకీయ పార్టీలు, భారత ప్రజలకు నిరంతరం అందించాలి.

అందువలన ప్రతి భారతీయ ఓటరు ఎటువంటి భయం, పక్షపాతం లేకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించు కోవాలని, ఎన్నికల విధానంలో చోటు చేసు కుంటున్న అక్రమ పద్ధతులను బట్టబయలు చేసే ప్రయత్నాలను తక్షణమే తీవ్రం చేయా లని సిపిఐ(ఎం) 24 వ మహాసభ నిర్ణయిం చింది. ఇసిఐ స్వతంత్రంగా, పారదర్శకంగా పని చేయాలని, ఎన్నికలలో అందరికీ సమాన అవకాశాలు ఉండే విధానాన్ని పునరుద్ధరించ టం కోసం ఉద్యమం నిర్వహించాలని మేం నిర్ణయించుకున్నాం. దేశంలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఏ మాత్రం రాజీలేకుండా, ముందస్తుగా నిర్వహించాల్సిన అతి ముఖ్యమైన కర్తవ్యం ఇది.

# ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ ప్రతిపాదనను వ్యతిరేకించండి

ఆర్‌ఎస్‌ఎస్-బిజెపిలు కోరుతున్న కేంద్రీకృత, నిరంకుశ ప్రభుత్వ ఏర్పాటులో భాగమైన ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ ప్రయత్నాలను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ‘ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే నాయకుడు’ అన్న వారి నినాదాలను ముందుకు తీసుకువెళ్ళటంలో భాగమే ఇది. హిట్లర్ ఫాసిస్టు విధానాలను అమలు జరిపిన కాలం నాటి ఈ నినాదాన్ని తీసుకొని, దానికి మెరుగులు దిద్దారు.

ఏకకాల ఎన్నికలతో ఎక్కువ ధనాన్ని ఆదా చేయవచ్చునని, తరచుగా అభివృద్ధి కార్యకలాపాలను ఆటంకపరచటాన్ని తగ్గించవచ్చన్న కాలం చెల్లిన వాదనలను బిజెపి నాయకులు తిరిగి ముందుకు తెస్తున్నారు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల కోసం భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి పార్లమెంటు 466 కోట్ల రూపాయలు కేటాయించింది. ఇతర అవసరాల కోసం రాష్ట్రాలు మరికొంత మొత్తాన్ని ఖర్చు చేశాయి. ఇదంతా కలిపినా ఏమంత పెద్ద మొత్తం కాదు. ఇతర సంవత్సరాలలో ఈ ఖర్చు మరీ తక్కువగా ఉంటుంది. అభివృద్ధిని చూసినపుడు 1967 నుండి నేటి వరకు తరచుగా దేశంలో నిర్దిష్ట కాల పరిమితులలో ఎన్నికలు జరుగుతున్నాయి. అవి అభివృద్ధిని ఆటంకపరిచాయని రుజువు చేయటానికి ఎటువంటి ఆధారమూ లేదు.

‘ఒకదేశం, ఒకే ఎన్నిక’ (ఒఎన్ఒఇ) రాజ్యాంగంలోని రెండు మౌలికాంశాలైన సమాఖ్య విధానం, ప్రజాస్వామ్యాలను దెబ్బతీస్తాయి. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు ప్రకటించింది. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడి తాను అధికారంలోకి వచ్చినప్పటి నుండి దీనిని ముందుకు తెస్తున్నాడు. ఒఎన్ఒఇ ‘చర్చనీయాంశం కాదని, భారతదేశానికి అవసరమని’ 2020లో ప్రకటించారు.

వాస్తవంలో ఒఎన్ఒఇ ప్రతిపాదనతో పార్లమెంటు ఎన్నికలతో కలిపి జరపటం కోసం కొన్ని అసెంబ్లీల కాల పరిమితిని కుదించాల్సి ఉంటుంది. ఏదైనా ఒక రాష్ట్ర ప్రభుత్వం పడిపోయి, అసెంబ్లీని రద్దుచేస్తే, ఆ అసెంబ్లీ మిగిలిన కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి. రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా ప్రజలు తమ ప్రతినిధులను ఐదు సంవత్సరాల కాలానికి ఎన్నుకొనే హక్కుకు ఇది

(మిగతా 14వ పేజీలో)

# ప్రజల ప్రాథమిక హక్కులు, మౌలికావసరాలను గుర్తించాలి

ప్రజలకు అందించే అత్యవసర సరుకులు, సేవలు సంక్షేమ పథకాలు– ఆహారం, ఇల్లు, ఉద్యోగం, పెన్షన్, విద్య, ఆరోగ్య పరిరక్షణ వంటివి– ధర్మంగా ఇస్తున్నవి కావని, ప్రతి పౌరుని ప్రాథమిక హక్కులని భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) 24వ మహాసభ విశ్వసిస్తున్నది.

ఈ అత్యవసరాలను తీర్చుకునే హక్కు ప్రతి పౌరునికి ఉంది, న్యాయానికి, సమానత్వానికి అవి పునాదిగా ఉంటాయి. సామాజికాభివృద్ధిలో సంక్షేమ పథకాలు కీలకమైన పాత్ర పోషిస్తాయి. సంక్షేమ పథకాలను మానవ వనరుల అభివృద్ధి కోసం పెడుతున్న పెట్టుబడిగా పరిగణించాలి. మరింత ఎక్కువగా ఉత్పత్తి చేసే శ్రామికశక్తిని తయారు చేయటం ద్వారా దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధికి అది పునాదులు వేస్తుంది.

ప్రభుత్వం సామాజిక రంగం నుండి వైదొలగాలనీ, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం విద్య, వైద్య సదుపాయాలను ప్రైవేటీకరించాలనీ ప్రబోధించటం పునాదిగా ఉన్న నయా–ఉదారవాద విధానాలను ప్రవేశపెట్టిన తర్వాత సామాజిక రంగంలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను దెబ్బతీయటం కోసం వీటిపై సైద్ధాంతిక దాడులు చేస్తున్నారు.

ఈ కార్యక్రమాలను రద్దు చేయటానికీ, సబ్సిడీలను తగ్గించటానికీ బిజెపి నాయకత్వంలోని మోడి ప్రభుత్వం ప్రయత్నాలను తీవ్రం చేసింది. సామాజిక సంక్షేమ పథకాలను “ఉచితాలు” అని ముద్ర వేసి, వాటిని తూలనాడటంలో ప్రధానమంత్రి




మోడి ముందెత్తున ఉన్నాడు. ఈ పథకాలు దేశ ఆర్థికాభివృద్ధికి విఘాతం కలిగిస్తాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా–ఉదారవాద, మార్కెట్ అనుకూల విధానాల వినాశకర ప్రభావాల నుండి ఆర్థికంగా దిగువస్థాయిలో ఉన్న ప్రజలను కాపాడటంలో సామాజిక సంక్షేమ పథకాలు నిర్వహించిన కీలకపాత్రను మరుగుపరచటానికి ఈ ప్రచారం ద్వారా ప్రయత్నం చేస్తున్నారు.

సబ్సిడీల స్థానంలో కొన్ని పథకాలకు నగదు బదిలీ చేయటాన్ని మోడి ప్రభుత్వం ప్రారంభించింది. సామాజిక సంక్షేమ పథకాలు బలహీనం కావటానికి, అంతిమంగా అవి రద్దు కావటానికి ఈ విధానం దారి తీస్తుంది.

ప్రభుత్వం కులం, మతం, ఇతర వైవిధ్యాలతో నిమిత్తం లేకుండా పౌరులందరూ గౌరవప్రదంగా జీవించే అవకాశం కల్పించాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో పేర్కొన్న దానిని వమ్ము చేయటానికి ఈ విధానం దారితీస్తుంది. దురదృష్టవశాత్తు ఇవి చట్టబద్ధంగా అమలు చేయవలసిన వాటిలో లేవు. వాటిని చట్టపరంగా అమలు చేయవలసిన రాజ్యాంగబద్ధ హక్కులుగా మార్చవలసిన అవసరం ఉన్నది.

ఆర్థికపరమైన సమస్యల వలన ఈ హక్కులకు రక్షణ కల్పించలేమని నయా–ఉదారవాద విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వాలు వాదిస్తున్నాయి. కార్పొరేట్లకు క్రమంగా పన్నులను తగ్గించటం, చట్టబద్ధంగా వారు చెల్లించాల్సిన పన్నులను కూడా వసూలు చేయటానికి విముఖత చూపటం తమ విధానాలలో ముఖ్యాంశంగా ఉన్న ప్రభుత్వం ఇటువంటి వాదనలు చేయటం హాస్యాస్పదం. బిజెపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి కార్పొరేట్ పన్నులను ప్రతి సంవత్సరం తగ్గిస్తున్నది. హేతుబద్ధమైన పన్నుల విధానాన్ని అనుసరించటం ద్వారా అన్ని అత్యవసర సేవలను పౌరులందరికీ అందించటం సాధ్యమౌతుంది.

అమలులో ఉన్న వివిధ సంక్షేమ పథకాలను బలహీనపరచటానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను దృఢ నిశ్చయంతో ప్రతిఘటించాలని, మౌలిక హక్కులైన ఆహారం, ఇల్లు, ఉపాధి, పెన్షన్, విద్య, వైద్య సదుపాయాలను సాధించుకోవటం కోసం ఐక్యంగా పోరాడటానికి కదలాలని సిపిఐ(ఎం) 24వ మహాసభ దేశ ప్రజలకు పిలుపు ఇస్తున్నది.

# ‘ఒకే దేశం, ఒకే ఎన్నిక’ ప్రతిపాదనను వ్యతిరేకించండి

**(13వ పేజీ తరువాయి)**


భంగం కలిగిస్తుంది.

అన్ని గ్రామ పంచాయితీలు, మునిసిపాలిటీలకు ఏకకాలంలో ఎన్నికలు జరపటం సమాఖ్యవాదం మీద తీవ్రంగా దాడి చేయటమే. రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో, అధికార వికేంద్రీకరణతో స్థానికసంస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు చేయాలన్న విధానంపై ఇది ప్రతీకార దాడి చేయటమే అవుతుంది.

పార్లమెంటు, అసెంబ్లి ఎన్నికలు కలిపి జరపటం కోసం రాజ్యాంగానికి ప్రధానమైన సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణ, ఇతర నిబంధనల సవరణతో పాటు ఆర్టికల్ 83 (సభ కాల పరిమితి), ఆర్టికల్ 85 (పార్లమెంటును రద్దు చేయటం), ఆర్టికల్ 172 (రాష్ట్ర అసెంబ్లీలను రద్దు చేయటం), ఆర్టికల్ 356 (రాజ్యాంగ యంత్రం విఫలం కావటం) అంశాలలో రాజ్యాంగానికి సవరణలు చేయాల్సి ఉంటుంది.

ఏకకాల ఎన్నికల కోసం చేసే కృత్రిమ ప్రయత్నాలను, ఇందుకోసం రాజ్యాంగానికి సవరణలు చేయాలన్న ఆలోచనలను సిపిఐ (ఎం) 24వ మహాసభ పూర్తిగా వ్యతిరేకిస్తున్నది. ఈ హానికరమైన ప్రయత్నాలను ఓడించటం కోసం ప్రజాస్వామ్యం, బహుళత్వం, సమాఖ్య విధానంపై విశ్వాసం ఉన్న అన్ని పార్టీలు, సంస్థలు ఐక్యంగా ముందుకు రావాలి. ప్రజాస్వామ్య వ్యతిరేక, సమాఖ్య విధాన వ్యతిరేకమైన ఈ ప్రయత్నాన్ని వ్యతిరేకించాలని భారత ప్రజలకు సిపిఐ(ఎం) పిలుపు ఇస్తున్నది.

# అమెరికాలో 'పెట్టుబడిదారీ వ్యవస్థ రక్షణ' చర్యలు



రచయిత న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో మూడు దశాబ్దాలపాటు అధ్యాపకునిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన అమెరికాలోని మెసాచుసెట్స్ యూనివర్శిటీలో రాజకీయ ఆర్థిక శాస్త్ర సీనియర్ రిసెర్చ్ ఫెల్లోగా పనిచేస్తున్నారు.

**సిపి చంద్రశేఖర్**

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్గతంగా పునర్వ్యవస్థీకరణ చెందుతోందా? డొనాల్డ్ ట్రంప్ రెండో సారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన తరువాత తొలి రెండు మాసాల్లో తీసుకున్న చర్యలు చూస్తుంటే ఔననిపిస్తోంది. ఈ క్రమం ఏదో యాదృచ్ఛికంగా కాకుండా గతంలో మాదిరిగానే విధాన పరంగా జరుగుతోంది. గతంలో మహామాంద్యం తరువాత అమలైన న్యూ డీల్‌నూ, 1970 ద్రవ్యోల్బణ సంక్షోభం తరువాత నయా-ఉదారవాద విధానాన్నీ చేపట్టినట్లే ఇప్పుడు కూడా విధానపరంగానే చర్యలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే ప్రతి సందర్భంలోనూ విధానపరమైన మార్పులన్నీ కూడా వాస్తవ ప్రపంచంలోని సంక్షోభాలను అదిగమించడానికి చేపట్టినవే. ఇలా జరిగిన ప్రతిమార్పు ప్రభావం తదుపరి పెట్టుబడి సంచయనంపై ఉండింది.

ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి చర్యా దేశ విదేశాల్లో విధానపరమైన మార్పుల నుదేశించినదేనన్న విషయం సూచనప్రాయంగా అవగతమవుతోంది. ఆర్థిక రంగంలో అయిదు విధానపరనిర్ణయాలు మనకు కనిపిస్తున్నాయి.

**ట్రంప్ ఆర్థిక పరమైన చర్యలు**

మొదటి చర్య దిగుమతి సుంకాలు పెంచడం. అమెరికా ఉత్పత్తిని తిరిగి స్వదేశానికి తీసుకురావడం, దేశవాళీ ఉత్పత్తిని పెంచడం, దేశీయులకు ఉద్యోగాలు కల్పించడం, జాతీయ భద్రతా లక్ష్యాలను సాధించడం కోసం సుంకాలను ఆయుధాలుగా మలుచుకోవడం అనే లక్ష్యాలతో దిగుమతి సుంకాలను పెంచినట్లు ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. ఈ రంగంలో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం, అమలు చేయడం సుదీర్ఘంగా ఆలోచించి చేయడం జరగదు గనుక ఈ విషయంలో కొన్ని సార్లు వెనకడుగు వేయడం కూడా కద్దు. అయితే అమెరికన్ ఉత్పత్తిని తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేందుకు బలవంతంగా చేపడుతున్నట్లు చెబుతున్న చర్యలు కేవలం ఇతరుల మెప్పుకోసం మాత్రం కాదు.

కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకాల విధింపుపై కొంత పునరాలోచన చేస్తున్న సూచనలు కనిపిస్తున్నప్పటికీ కొంత కాలం తరువాత వాటిని కూడా అమలు చేస్తారు. అన్ని దేశాపై 10 శాతం అదనపు సుంకాలు విధించిన ట్రంప్ ప్రభుత్వం చైనాపై మరింత అదనపు సుంకాలు వేసింది. ఆటోమొబైల్స్, స్టీల్, అల్యూమినియం, ఇంకా అనేక వస్తువులపై అదనపు సుంకాలు విధిస్తారో లేదో వేచి చూడాలి. అయితే అమెరికా సుంకాలకు ప్రతిగా దాని వాణిజ్య భాగస్వాములంతా ప్రతిసుంకాలు విధించేందుకు సిద్ధపడుతున్నాయి.

రెండో అంశం బడా వాణిజ్యం నగ్నంగా రాజ్యాన్ని చెరపట్టడానికి అవకాశం కల్పించడం. గతంలో స్వతంత్రంగా ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను ఒక్క ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌తో అమెరికా ప్రభుత్వ అధీనంలోకి తెచ్చుకోవడం జరిగింది. దీంతో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్), ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టిసి)తో సహా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలన్నీ స్వతంత్రాన్ని కోల్పోయాయి. ఇకపై ప్రభుత్వం వాటి పనిని పర్యవేక్షిస్తుంది, వాటి నిర్ణయాలను గమనిస్తుంది. దీనివల్ల క్రిప్టోకరెన్సీ వాణిజ్యాన్ని నియంత్రించడానికి సెక్ చేస్తున్న ప్రయత్నాలకు వెనువెంటనే విఘాతం కలుగుతుంది. దీంతోపాటు అమెజాన్, మెటా వంటి ప్లాట్‌ఫార్మ్ కంపెనీల గుత్తాధిపత్యం, శక్తిని తగ్గించేందుకు మాజీ కమిషనర్ లినా ఖాన్ నేతృత్వంలో జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట పడుతుంది.

ట్రంప్ నాయకత్వంలోని రాజ్యానికీ, అమెరికన్ బడా పెట్టుబడికీ మధ్య పెరుగుతున్న బంధం బహిరంగంగా కనిపిస్తోంది. ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజునుండీ అమెరికాలోని బడా పెట్టుబడిదారులు ఆయన వెనుక చేరడంతోపాటు, వారిలో కొంతమంది ట్రంప్ విధాన నిర్ణయ వ్యవస్థలో భాగస్వాములుగా మారారు. వీరిలో ఎక్స్, టెస్లా అధిపతి అయిన ఎలాన్ మస్క్ ప్రముఖుడు. అమెరికా ప్రభుత్వంలో బడా పెట్టుబడి అసహ్యించుకునే శక్తులను ఏరపారవేసే పనిని ఈయన చేపట్టాడు. "ప్రభుత్వ సామర్థ్యాన్ని" పెంచడం ద్వారా వనరులను పొదుపు చేయడం ఈయన పని. ఆ విధంగా మిగిలిన సొమ్మును బడా పెట్టుబడిదారులకు పన్ను రాయితీల రూపంలో చెల్లిస్తారు.

❝ తనకు వ్యూహాత్మకమైన భూభాగాల మీద అధిపత్యంగానీ లేక పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికిగానీ ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడు. గ్రీన్‌లాండ్, పనామా కాలువ, పాలస్తీని యన్లను తరిమేశాక గాజా ప్రాంతాల విషయంలో ఆయన ఇప్పటికే ప్రకటనలు చేశారు. ఒకవైపు అమెరికా మిత్రదేశాలను రక్షించడం కోసం చేస్తున్న ఖర్చును తగ్గించి వేస్తూనే మరోవైపు ట్రంప్ చేస్తున్న ఈ ప్రయత్నాలు అమెరికా సాఫ్ట్ పవర్ (పరోక్షాధిపత్యం) పెంచుకోడానికి ఉద్దేశించినవే. ❞




అమెరికాలోని డెట్రాయిట్‌లో ట్రంప్ వ్యతిరేక ప్రదర్శన

మస్క్ నాయకత్వంలోని ప్రభుత్వ సామర్థ్య పెంపు విభాగం (డోజ్) 5,000 కోట్ల డాలర్లు పొదుపు చేస్తుందని ట్రంప్ బహిరంగంగానే ప్రకటించాడు. ఇందులో 20 శాతం తిరిగి ప్రజలకు వెళుతుందనీ, మరో 20 శాతాన్ని ప్రభుత్వ అప్పుతీర్చడానికి ఉపయోగపెడతామని చెప్పాడు. ఇది పోను ఇంకా 60 శాతం నిధులు చేతిలో ఉంటాయి.

**వాణిజ్య భాగస్వాములపై డిమాండ్లు**

మూడో అంశం తన విదేశీ వాణిజ్య, పెట్టుబడి భాగస్వాములపై ట్రంప్ చేస్తున్న దుందుడుకు డిమాండ్లు. తనకు వ్యూహాత్మకమైన భూభాగాల మీద అధిపత్యంగానీ లేక పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికిగానీ ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడు. గ్రీన్‌లాండ్, పనామా కాలువ, పాలస్తీనియన్లను తరిమేశాక గాజా ప్రాంతాల విషయంలో ఆయన ఇప్పటికే ప్రకటనలు చేశారు. ఒకవైపు అమెరికా మిత్రదేశాలను రక్షించడం కోసం చేస్తున్న ఖర్చును తగ్గించి వేస్తూనే మరోవైపు ట్రంప్ చేస్తున్న ఈ ప్రయత్నాలు అమెరికా సాఫ్ట్ పవర్ (పరోక్షాధిపత్యం) పెంచుకోడానికి ఉద్దేశించినవే.

నాల్గవదేమంటే, ట్రంప్ ఈ రోజు బెదిరింపులకు పరిమితమైనా రేపు బలవంతంగానైనా ప్రపంచంలోని కీలకమైన ఖనిజాలను చేజిక్కించుకోదలుచుకున్నాడు. ఉక్రెయిన్‌లో ఉన్నా, గ్రీన్‌లాండ్ లేక మరెక్కడున్నా ఈ ఖనిజాలను నయానోభయాలో స్వాధీనం చేసుకోడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది.

ఇక చివరి విషయం ట్రంప్ ఇతర దేశాలతో వ్యవహరించేటప్పుడు కేవలం తనకేం లాభం అని మాత్రమే చూస్తున్నారు. రష్యా, ఐరోపాలతో ఆయన వ్యవహరించే తీరుచూస్తే ఇది అర్ధమవుతుంది. రష్యా మార్కెట్లు చేజిక్కించుకోవడం కోసం దానితో నెయ్యం, తన నుండి తీసుకోవడమే గాని తమ స్వంత రక్షణకు కూడా నిధులు రాల్చని ఐరోపాను వదిలించుకోవడం ఆయన వ్యవహార సరళిలో ప్రధానాంశం.

**ఈ చర్యల వెనుక లక్ష్యం ఏమిటి?**

ఈ చర్యలు ఒకవైపు సింబాలిక్‌గానే కాకుండా వాస్తవంలో కూడా అక్కరకొస్తున్నాయి. ఉదాహరణకు సుంకాలను పెంచడం ద్వారా అమెరికన్ ఉద్యోగాలను తిరిగి అమెరికాకు తీసుకొస్తానని చెప్పడం కేవలం నిరుద్యోగంతో కుతకుతలాడుతున్న అమెరికా తెల్లజాతీయులను, కార్మికవర్గ ఓటర్లను మభ్యపుచ్చడానికి మాత్రమే. ఈ నినాదాలకు ఆకర్షితులయ్యే గత ఎన్నికల్లో వీరు ట్రంప్‌కు ఓటేశారు. నిజానికి అమెరికన్ పెట్టుబడి ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి నాయకత్వంలో అమలుపరచబడిన ప్రపంచీకరణ విధానాల వల్ల ఈ సెక్షన్ ప్రజలు నష్టపోయారు.

ప్రపంచీకరణ వల్ల సమాజంలోని "1 శాతం" ధనికులు మాత్రమే లాభపడ్డం చూసి ఆగ్రహం చెందిన వీరు ట్రంప్‌కు ఏమాత్రం సంకోచం లేని అనుయాయులుగా మారిపోయారు. తమ కష్టాలకు కారణం ధనికులూ, రాజ్యం అని భావిస్తున్న ఈ సెక్షన్ ప్రజలు, సూపర్ ధనికులు మరింత ధనికులు కావడం చూసి ఆగ్రహం చెందుతున్న వీరు డోజ్ ద్వారా కొన్ని మార్పులు తీసుకువస్తానని ట్రంప్ తీసుకుంటున్న చర్యలకు మరింత ముగ్ధులై ఆయనకు సూపర్ విధేయులుగా మారారు.

21వ శతాబ్దపు పెట్టుబడిదారీ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణలో తన ప్రాధాన్యతను కోల్పోతూ పూర్వం లాగా కొనసాగడం కష్టం అయిన తరుణంలో ట్రంప్ 2.0 పాలనలో ఈ చర్యలకు దిగిన విషయాన్ని 20 శతాబ్దం ప్రారంభం నుండి చరిత్రను పరిశీలిస్తే అర్ధమవుతుంది.

అయితే 1970వ దశకంలో అమెరికాలోనూ ఇతర పశ్చిమ దేశాల్లోనూ వచ్చిన వ్యవస్థాగత మార్పుల నేపథ్యంలో నేటి ఈ మార్పులు జరుగుతున్న విషయాన్ని గుర్తించాలి. నాటి మార్పుల్లో ప్రధానంగా కీనీసియన్ తరహా న్యూ డీల్‌నూ, ద్రవ్య పెట్టుబడిని అదుపు చేసే విధానాలనూ వదిలిపెట్టి రుణం ఆధారంగా అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ద్రవ్య లోటును అదుపు చేయడం వంటి విధానాలు చేపట్టడం జరిగింది.

పేదలు, మధ్య తరగతి వర్గాలనుండి ఆదాయాలను ధనవంతులు, సూపర్ ధనవంతులకు చేర్చడమే ఈ విధానాల ముఖ్య లక్ష్యం. నయా–ఉదారవాద వర్గ లక్షణం అదే. అమెరికాలో ప్రారంభమైన ఈ విధానం అనేక ఐరోపా దేశాలకు పాకింది.

**పెట్టుబడిదారీ సంక్షోభం**

ఈసారి పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న వ్యవస్థీకృత సంక్షోభం రెండు విధాలుగా ఉంది.

ద్రవ్య బుడగల మీద ప్రయాణం చేస్తూ పెట్టుబడి సంచయనం చేసుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచ వ్యాపితంగా కొద్దిమంది సంపద విపరీతంగా పెరగడానికి దోహదపడింది. అయితే ఇలాంటి అసమానతల వ్యవస్థ మనుగడ సాగించడం అసాధ్యమైపోయింది. 2008 ద్రవ్య సంక్షోభం తరువాత ఆధిపత్య దేశం ప్రపంచం మీద రుద్దిన నిబంధనలను ధిక్కరించి దాని మిత్రులు తమ స్వంత విధానాలు అమలు చేయడం ప్రారంభించారు. అయితే అది కూడా పెట్టుబడిదారీ వ్యవస్థను దాని సంక్షోభం నుండి కాపాడలేపోయింది.

దానికితోడు 1960తో అంతమైన రెండు దశాబ్దాల పాటు పెట్టుబడిదారీ వ్యవస్థ అమలు చేసిన సంక్షేమ రాజ్యం వంటి విధానాలు, తక్కువ ద్రవ్యోల్బణం, దాదాపు పూర్తి ఉపాధితో కూడిన అభివృద్ధి వల్ల దానికి లభించిన ప్రతిష్ట కూడా నేడు అడుగంటిపోయింది. అందువల్ల రాజకీయంగా కూడా "పాలక పార్టీలకు ఎటువంటి మార్పులు లేకుండా తమ పాలనను కొనసాగించడం" కష్టతరమైపోయింది. దీన్నే లెనిన్ విప్లవ పరిస్థితులుగా నిర్వచించాడు.

ఇటువంటి పరిస్థితులకు ట్రంప్ నాయకత్వంలో అమెరికా పెట్టుబడి నుండి వస్తున్న ప్రతిస్పందన, ఆయన ప్రవచించిన "అమెరికాను మళ్లీ మహత్తరంగా తీర్చిదిద్దాలి" (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్-''మాగా) అజెండా..రెండూ అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకునేందుకుద్దేశింపబడినవే. తన సుదీర్ఘకాల ప్రపంచ మిత్రులు, దాని నేరాల్లో భాగస్వామ్య దేశాలతో సహా అన్ని దేశాలనూ పణంగా పెట్టి ట్రంప్ అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థను రంక్షించుకోడానికి చేస్తున్న ప్రయత్నమిది.

ట్రంప్ ఆయన సహచరులు ఉన్నది అమెరికా రాజ్యాన్ని నాశనం చేయడానికి కాదు. వారి లక్ష్యమంతా ఆ రాజ్యాన్ని స్వాధీనం చేసుకుని దాన్ని సూపర్-ధనవంతుల ప్రయోజనాలు రక్షించే సాధనంగా మార్చుకోవడం, సంపదను వారికి అనుకూలంగా పంపిణీచేయడమే. అయితే ఈ క్రమంలో వారు మతిలేని, అహేతుక ఆలోచనలు గల తమ వీర మద్దతుదారులకు కొంత డబ్బు విడుదల చేస్తారనుకోండి.

**అమెరికా పెట్టుబడికి పెద్దపీట**

వాళ్ల ఉద్దేశ్యంలో, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలనుండి వనరులను చేజిక్కించుకుని, సామ్రాజ్యనిర్మాణ కార్యం నుండి డబ్బును మిగిలిస్తే అది అమెరికన్ బడాపెట్టుబడిదారులకు డబ్బు సమకూర్చడానికి తోడ్పడుతుంది. అదే సమయంలో అసంతృప్తితో ఉన్న తెల్లజాతి కార్మికవర్గానికి కొంచెం పైసలు విదిలించవచ్చు.

> **❝ అమెరికా రాజ్యం పరిధిలో పెట్టుబడి సంచయనం జరపడం కోసం మిగిలిన ప్రపంచాన్ని వలసగా మార్చుకోడానికి ప్రయత్నం జరుగుతోంది. స్థిరత్వం లేని ఈ పరిస్థితిని సుధీర్ఘ కాలం కొనసాగించాలన్నదే ట్రంప్ ప్రభుత్వ చర్యల వెనుకనున్న లాజిక్. ఇటువంటి ప్రయత్నం వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థకు మంచి జరక్కపోగా చెడుజరుగుతుందని సిద్ధాంతం, చరిత్ర మనకు తెలియజేస్తున్నాయి. ❞**




వాషింగ్టన్ డిసిలోని పెన్సిల్వేనియా ఎవెన్యూను దిగ్బంధించిన ట్రంప్ వ్యతిరేక నిరసన కారులు

దీనివల్ల సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఇప్పుడు కొత్త రూపంలోకి వచ్చాయి. గతంలో మాదిరి రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీసిన పాత రూపంలోని సామ్రాజ్యవాద వైరుధ్యాలు కావివి. అలా అని అటువంటి వైరుధ్యాలు లేకుండానూ పోలేదు. ఇక్కడ జరుగుతున్నదేమంటే ఒక సామ్రాజ్యవాద ఆధిపత్య శక్తి తన స్వంత పెట్టుబడిదారీ వర్గం ప్రయోజనాలకోసం మాజీ సామ్రాజ్యవాద మిత్రులందరినీ స్వార్థంతో లొంగదీసుకుంటోంది. దానికోసం అది పాత శత్రువులతో చెట్టపట్టాలేసుకోడానికైనా సిద్ధపడుతోంది.

అమెరికా రాజ్యం పరిధిలో పెట్టుబడి సంచయనం జరపడం కోసం మిగిలిన ప్రపంచాన్ని వలసగా మార్చుకోడానికి ప్రయత్నం జరుగుతోంది. స్థిరత్వం లేని ఈ పరిస్థితిని సుధీర్ఘకాలం కొనసాగించాలన్నదే ట్రంప్ ప్రభుత్వ చర్యల వెనుకనున్న లాజిక్. ఇటువంటి ప్రయత్నం వల్ల పెట్టుబడిదారీ వ్యవస్థకు మంచి జరక్కపోగా చెడుజరుగుతుందని సిద్ధాంతం, చరిత్ర మనకు తెలియజేస్తున్నాయి. కానీ అమెరికా శతకోటీశ్వర్లు తమకు అమరత్వం సాధించడం కోసం పరిశోధనలపై డబ్బు విపరీతంగా ఖర్చు చేస్తున్నట్లే, తమ లాభాపేక్షతోకూడిన, రక్తపిపాస గల (కూలిపోక తప్పని) ఎజెండాను శాశ్వతం గావించడం కోసం కూడా రకరకాల ఆలోచనలు చేస్తున్న ట్రంప్‌పై బెట్లు కాస్తున్నారు.

(అనువాదం: ఎస్. వెంకట్రావు)

# మధ్య యుగాలలో సాంకేతికత

ఎంవిఎస్ శర్మ

### కాగితం తయారీ

కాగితాన్ని తయారు చేయడం కనుగొన్నాక దాని ప్రభావం సమాజంలోని ఆర్థిక, సామాజిక కార్యకలాపాలపైన బలంగా పడింది. ఐతే ఈ కాగితం తయారీలో భారత ఉపఖండం కన్నా చైనా ముందుంది. క్రీ.శ.11వ శతాబ్దంలో ఇక్కడ పర్యటించిన ఆల్ బెరూనీ భారతదేశంలో అప్పటికి ఇంకా తాటి ఆకుల మీద, చెట్ల బెరళ్ళమీద రాతను కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నాడు. క్రీస్తుకు పూర్వకాలంలోనే చైనాలో జనుము గుజ్జును ఉపయోగించి కాగితాన్ని తయారు చేయడం మొదలైంది. ఆ తర్వాత పట్టు వస్త్రాలమీద, వెదురు మీద రాయడం చేసేవారు. 10వ శతాబ్దం నాటికి కాగితం తయారీకి సంబంధించిన మౌలిక విధానాన్ని కనుగొన్నారు. ఆ తర్వాత ఆ పరిజ్ఞానం క్రమంగా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. చైనా నుండి అరబ్ ప్రాంతాలకు విస్తరించిన కాగితపు తయారీ సాంకేతికత భారత ఉపఖండంలోకి డిల్లీ సుల్తానుల పాలనాకాలంలో ప్రవేశించింది. 14వ శతాబ్దం నాటికి కాగితం తయారీ బాగా పెరిగింది. వస్తువులను ప్యాక్ చేయడానికి కూడా కాగితాన్ని వాడేంతగా కాగితం ఉత్పత్తి మన దేశంలో 14వ శతాబ్దం నాటికి జరిగింది.

ఐతే కాగితం తయారీ సాంకేతికత మాత్రం పెద్దగా మార్పుకు గురవలేదు. పాత వస్త్రాలను, చివికిపోయిన చాంతాడులను, గోనె సంచులను, చెట్ల బెరళ్ళను బాగా నానబెట్టి గుజ్జుగా చేసేవారు. ఆ గుజ్జులో సోడా పొడి, సున్నం కలిపేవారు. ఆ తర్వాత పలుచగా ఆ గుజ్జును వెదురు అచ్చులమీద అద్దేవారు. దానిని బాగా ఎండబెట్టిన తర్వాత ఆ పొరను వెదురు అచ్చునుంచి వేరు చేసి దానిని నున్నని గాజు బంతితో బలంగా రుద్ది ఆ కాగితం సాపుగా అయేలా చేసేవారు. (చూ. ఊహ చిత్రం 2.14)

కాగితం ఉత్పత్తి చౌకగా మారిన తర్వాత పుస్తకాల తయారీ, వాటి అమ్మకాలు, పంపిణీ వేగంగా పెరిగాయి. రికార్డులను తయారు చేయడం, జమాఖర్చులను నిర్వహించడం వంటివి తేలికగా మారాయి. ఐతే పుస్తకాలను అచ్చువేయడం అనేది భారతదేశంలో ఆలస్యంగా మొదలైంది. బహుశా చాలా పెద్ద సంఖ్యలో రాసే ఉద్యోగులు ఇక్కడ ఉండడం అందుకు కారణం అయివుండొచ్చు. 10వ శతాబ్దం నాటికే ప్రింటింగ్ చేయడం చైనాలో మొదలైంది. కర్ర మీద అక్షరాలను అచ్చులుగా చెక్కి వాటితో అచ్చులు వేసే విధానం యూరపియన్ దేశస్తులు మొగల్ దర్బారులలో ప్రదర్శించినా, దానిపట్ల మనదేశంలో పెద్దగా ఆసక్తి వ్యక్తం కాలేదు. జర్మనీలో లితోగ్రఫీ కనుగొన్నాక ఆ సాంకేతికత మన దేశంలోకి ప్రవేశించింది. ఆతర్వాతనే మన దేశంలో అచ్చుయంత్రాల వినియోగం మొదలైంది.

### గాజు వస్తువుల తయారీ

క్రీ.పూ. 500 కాలానికి చెందిన గాజు పూసలను, చేతులకు ధరించే గాజు కడియాలను పురావస్తు పరిశోధకులు ఉత్తర భారతంలో వెలికి తీశారు. రంగురంగుల గాజు పాత్రలను, పూల కుండీలను ఉపయోగించడం ఆ తర్వాత కాలాల్లో జరిగినట్టు కనుగొన్నారు. ఎనామెల్ పూత పూసిన గాజు పాత్రలను, అలంకార వస్తువులను తయారు చేయడం 12వ శతాబ్దంలో మధ్య ఆసియా ప్రాంతంలో మొదలైంది. 14 వ శతాబ్దంలో భారతదేశంలో చేతికి వేసుకునే గాజులను ఉత్పత్తి చేయడం మొదలైంది. చాలా మోటుగా, పారదర్శకత లేని గాజుతో ఆ గాజులు ఉత్పత్తి అయేవి.

15వ శతాబ్దం నాటికి పారదర్శకంగా ఉండే గాజును ఉత్పత్తి చేయడం, దానితో రకరకాల వస్తువులను తయారు చేయడం మొదలైంది. సమయాన్ని కొలవడానికి ఉపయోగించే ఇసుక కొలమానాన్ని (శాండ్ గ్లాస్) తయారు చేయడం కూడా ఈ కాలంలోనే మొదలైంది. కళ్ళజోళ్ళను యూరప్ ఖండం నుంచి దిగుమతి చేసుకుని ఉపయోగించేవారు. 17వ శతాబ్దంలో టెలిస్కోప్‌ల తయారీ యూరప్‌లో మొదలైంది. స్వల్ప కాలంలోనే అవి భారతదేశానికి దిగుమతి అయాయి. అద్దాల తయారీ (మిర్రర్) మనకు చాలా కాలం వరకూ తెలియలేదు. దిగుమతి చేసుకోవడం 19వ శతాబ్దం దాకా కొనసాగింది.

### పూత పూసిన పాత్రల, వస్తువుల తయారీ

చేనేతతో దాదాపు సమానంగా ఎక్కువమంది పని చేసిన రంగం కుమ్మరి వృత్తి. ఐతే లోహపు పాత్రల వాడకం పెరుగుతున్నకొద్దీ ఈ వృత్తి ప్రాధాన్యత తగ్గింది. కాని మధ్య యుగాలలో సైతం ఈ వృత్తి ప్రాముఖ్యత కొనసాగింది. పూత పూసిన మట్టి పాత్రలను, అలంకార వస్తువులను తయారు చేయడం మధ్య యుగాలలో చాలా ఎక్కువగా ఉండేది. మధ్యధరా ప్రాంతం నుండి ఈ సాంకేతిక పరిజ్ఞానం ఇస్లాం వ్యాప్తితో బాటు విస్తరించింది. నీలం, ఆకుపచ్చ, తెలుపు తదితర రంగులలో పూత పూసిన వస్తువులను విరివిగా తయారు చేసేవారు. గచ్చులపై పరిచే పలకల తయారీ (టైల్స్) కూడా సుల్తానుల కాలంలో జరిగింది.

### సబ్బు తయారీ

కుంకుడు కాయలు, షీకాయ వంటి నురుగు కల్పించగల సహజ ఉత్పత్తులను తొలుత శుభ్రపరచడానికి ఉపయోగించారు. ఆ తర్వాత ఉప్పు కలిసిన మట్టిని, జంతువుల కొవ్వును కలిపి ఉడికించి సబ్బులను తయారు చేయడం ముస్లింలతోబాటు మన దేశానికి వచ్చింది. తుగ్లక్ ల పాలనలో సబ్బు తయారీ దారులనుంచి పన్నులు కూడా వసూలు చేసేవారు. దీనిని బట్టి ఈ వృత్తి అప్పటికే విస్తరించిందని స్పష్టమౌతోంది. అంతే కాక ఈ సబ్బులను ఉపయోగించి దుస్తులను శుభ్రపరిచే రజక వృత్తి కూడా వేగంగా విస్తరించిందని గ్రహించాలి. రజకులు అంతవరకూ నదీ ప్రవాహంతోబాటు వచ్చే తెట్టు (చౌడు) ను సేకరించి దానితో బట్టలను ఉతికేవారు. సబ్బుల ఉత్పత్తితో వారి వృత్తికి ఉన్న పరిమితి తొలగిపోయింది.

### చల్లదనాన్ని కలిగించే పరికరాలు

భారతదేశం ఉష్ణ ప్రాంతం. కనుక ఇక్కడ చల్లదనాన్ని కలిగించే పరికరాల అవసరం ఎక్కువ. సింధు నాగరికత నాటికే గొడుగుల వాడకం ఉన్నట్టు అప్పటి సీళ్ళమీద ముద్రించిన బొమ్మలు సూచిస్తున్నాయి. ప్రభువులు, సంపన్నులు తమవెంట ఛత్రాన్ని మోసుకుని రావడానికి పనివారిని నియోగించేవారు. ఛత్రపతి అన్నది ఒక హోదాను సూచించేదిగా ఉండేది. ఐతే క్రీ.శ.13,14 శతాబ్దాలనాటికి

మూయడానికి, తెరవడానికి వీలుగా ఉండే గొడుగుల తయారీ ఎక్కువగా జరిగేది. తమవెంట భారతీయులు అటువంటి గొడుగులను తీసుకుపోవడం ఒక అలవాటుగా కనిపించింది అని అప్పటి ఆసియా యాత్రికుడు జాన్‌డి మారిగ్నల్లి 1338-1353 మధ్య తయ యాత్రల అనుభవాలను గ్రంథస్తం చేసిన సందర్భంగా రాశాడు. ఈ గొడుగులను వెదురు పుల్లలతో తయారు చేసేవారని కన్నూర్ (కేరళ) లో 1516లో పర్యటించిన పోర్చుగీసు యాత్రికుడు బార్బోసా రాశాడు. వాటి సాంకేతికత ఆధారంగానే నేటి ఆధునిక గొడుగుల ఇనుపపుల్లల అమరిక ఉంటుంది.


చేతితో లాగే పంఖాలు 15వ శతాబ్దం నాటికి ఉపయోగంలోకి వచ్చినట్టు, ఎక్కువగా వీటిని సంపన్నుల ఇళ్ళలో ఉపయోగించినట్టు తెలుస్తోంది. ఖస్ గడ్డి (వట్టివేళ్ళు) తో చేసిన తడకలను కిటికీలకు కట్టి వాటిని నీటితో తడిపితే వెలుపలనుండి వచ్చే గాలి చల్లబడి లోపలి వాతావరనాన్ని చల్లబరుస్తుంది. వీటి వాడకం అక్బర్ కాలంలో బాగా వ్యాపించింది. సురేకారాన్ని ఉపయోగించి దానిని రెండు దొంతరల పాత్రలో ఆ దొంతరల మధ్యకు పంపి, దానిని నీటితో కలిపి ఆ పాత్రను బాగా తిప్పితే ఆ పాత్ర బాగా చల్లబడుఇపోతుంది. అటువంటి పాత్రలో ఉంచే పదార్థాలు, పానీయాలు కూడా చల్లగా ఉంటాయి. ఈ తరహా రిఫ్రిజిరేషన్‌ను అక్బర్ స్వయంగా కనిపెట్టినట్టు అబుల్ ఫజల్ రాతలలో ఉంది. యూరపియన్ యాత్రికులు కూడా ఇటువంటి ప్రక్రియ కేవలం భారతదేశంలోనే తాము చూసినట్టు పేర్కొన్నారు.

### కొలమానాలు

భూమిని కొలిచేందుకు వాడే తాళ్ళు తడిచిపోయినప్పుడు పొడుగు తగ్గుతాయి. వేడికి పొడవు సాగుతాయి. అందుచేత తాళ్ళ స్థానంలో వెదురు బొంగులను ఉపయోగించడం అక్బర్ కాలంలో మొదలైంది. వస్తువుల బరువును కొలవడానికి ఉపయోగించే పరికరాన్ని కప్పన్ అనేవారు. బరువును తూచే వస్తువును ఉంచినవైపు దాని పొడవు తక్కువగా ఉండేది. దాని బరువును సూచించే భాగం పొడవుగా ఉండేది. దానికి అమర్చిన ఇనుప రింగును కదిపి సరితూగేలా చేసి బరువు నిర్ధారించేవారు. ఇది 14, 15 శతాబ్దాలనాటికి విరివిగా ఉపయోగించేవారు.

సూర్యుడి నీడను బట్టి సమయాన్ని కొలవడానికి ఒక కర్రను ఉపయోగించేవారు. దానిమీద సమయాన్ని సూచించే కొలతలు

"చేతితో లాగే పంఖాలు 15వ శతాబ్దం నాటికి ఉపయోగంలోకి వచ్చినట్టు, ఎక్కువగా వీటిని సంపన్నుల ఇళ్ళలో ఉపయోగించినట్టు తెలుస్తోంది. ఖస్ గడ్డి (వట్టి వేళ్ళు) తో చేసిన తడకలను కిటికీలకు కట్టి వాటిని నీటితో తడిపితే వెలుపలనుండి వచ్చే గాలి చల్లబడి లోపలి వాతా వరనాన్ని చల్లబరుస్తుంది. వీటి వాడకం అక్బర్ కాలం లో బాగా వ్యాపించింది."



ఉండేవి. దానిపై ఎంతమేరకు ఎండ పడిందో చూసి సమయాన్ని లెక్కించేవారు. ఇది 7వ శతాబ్దం నాటికి వాడకంలో ఉండేది. నీటి గడియారాన్ని కూడా తయారు చేశారు. రాగితో చేసిన ఆ పాత్రలో పైనుంచి పోసిన నీరు కిందకు దిగిన మేరకు కాలాన్ని లెక్క కట్టేవారు. ఇది 11వ వథాబ్దం నాటికి వాడకంలో ఉండేది. గంట గంటకూ కాలాన్ని ప్రకటించే ఉద్యోగులను మొగల్ ప్రభువులు తమ ఆస్థానాల్లో నియమించుకున్నారు. యాంత్రికంగా నడిచే గడియారాల తయారీ మన దేశానికి యూరప్ నుండే 19వ శతాబ్దానికి వచ్చింది.

### టీకాలు వేయడం, సర్జరీలు చేయడం

మశూచి నుండి కాపాడుకోడానికి రోగనిరోధక శక్తిని కలిగించేందుకు టీకాలు వేయడం మన దేశంలో 1731లో బెంగాల్‌లో మొదట వెలుగులోకి వచ్చింది. ఐతే ఆ సాంప్రదాయం అక్కడ స్థానికంగా అంతకు మునుపు 150 సంవత్సరాలకు పైగా కొనసాగుతున్నట్టు ఆ నివేదిక వెల్లడించింది.

మశూచి పొక్కులనుండి చిన్నపాటి మొత్తంలో రసిని తీసుకుని దానిని ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి శరీరంలోకి సూది ద్వారా పంపడం చేసేవారు. ఇదే తరహా పద్ధతి ఆ కాలంలోనే టర్కీ, బెలూచిస్తాన్ వంటి ప్రాంతాల్లో కూడా ఉనికిలో ఉండేది. ఐతే ఈ పద్ధతిని పాటించేవారు ఎక్కువమంది నిరక్షరాస్యులు. ఆధునిక కాలంలో వైద్య రంగం సాధించిన విజయాలకు వీరే తొలి దారులు తీశారని చెప్పవచ్చు.

మన దేశంలో ముక్కు కోసివేయడం ఒక శిక్షగా అమలౌతూవుండేది. దాని వలన కురూపులైనవారికి తిరిగి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ముక్కును రూపొందించేవారు. అందుకోసం ఆ బాధితుడి నుదుటిపై చర్మాన్ని మూడువైపులా కోసి, కనుబొమ్మలవైపు మాత్రం కోయకుండా ఉంచి ఆ చర్మాన్ని జాగ్రత్తగా మెలితిప్పి కన్నుల మధ్యగా కిందకు వచ్చేలా చేసి ముక్కు ఆకారం వచ్చేట్టు చేసేవారు. ఈ తరహా సర్జరీలను చేసేవారిలో ఎక్కువమంది క్షురకులుగా ఉండేవారు.

ఆధునిక ప్లాస్టిక్ సర్జరీకి మూలాలు వీరి వైద్య విధానంలో కనిపిస్తాయి.

### దీపాలు

చాలా కాలం వరకూ నూనెలో తడిపిన వత్తులను ఉంచి వాటి చివరన అంటించడం ద్వారా దీపాలను వెలిగించి ఉపయోగించేవారు. పెద్ద పెద్ద ఇళ్ళలో, దేవాలయాల్లో, ఊరేగింపుల్లో కాగడాలను ఉపయోగించేవారు. మొగలాయీల కాలంలో కొవ్వుతో తయారు చేసిన పెద్ద పెద్ద కొవ్వొత్తులను ఉపయోగించడం పెరిగింది.

> **❝ వివిధ రకాల వృత్తుల్లో నిపుణులైనవారు మన దేశంలో అసంఖ్యాకంగా ఉండేవారు. కంసాలురు, అద్దకం పనివారు. అల్లికల, తివాచీ నేతగాళ్ళు, నూలు, పట్టు నేతగాళ్ళు, కమ్మరులు, దర్జీలు, కట్టడాలు కట్టే మేస్త్రీలు, రాళ్ళు చెక్కే శిల్పులు, ఇలా వందకు పైగా చేతివృత్తులలో పని చేసేవారు యూరప్‌లో ఒక వ్యక్తి చేసే పనిని ఇక్కడ నాలుగు భాగాలుగా విభజించి నలుగురు చేసేవారు. ఆ విధంగా ఇక్కడ ప్రత్యేక నైపుణ్యాన్ని కలిగినవారు ఎక్కువగా తయారయ్యారు. ❞**

వాటిని గాజు కుప్పెల్లో ఉంచి గాలికి ఆరిపోకుండా చూసే విధానం వచ్చింది.

**ముగింపు**

మధ్య యుగాలలో క్రీ.శ.6వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకూ మన ఉపఖండంలో సాంకేతిక పరిజ్ఞానం ఎదుగూ ఒదుగూ లేకుండా స్తంభించిపోయివుందేదని ఆ తర్వాత కాలంలో యూరప్ దేశాలనుండి వచ్చిన ఆధునిక పరిజ్ఞానం అదిపుచ్చుకున్న తర్వాతనే మళ్ళీ పురోగతి మొదలైందని భావించడం తప్పు అని చరిత్ర అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. మొగలాయీల పాలనాకాలం వరకూ కూడా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో జరిగిన సాంకేతిక అభివృద్ధిని ఇక్కడ మన దేశంలో స్వీకరించడం, అలాగే ఇక్కడ జరిగిన సాంకేతిక అభివృద్ధిని ఇతర ప్రపంచం స్వీకరించడం జరుగుతూనేవచ్చింది. దాదాపు 17 వ శతాబ్దం ముగిసేదాకా ఇదే పరిస్థితి.

ఆ తర్వాత యూరప్‌లో మొదలైన యాంత్రిక విప్లవం అక్కడ శరవేగంగా సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు తీసుకువచ్చింది. అటువంటి విప్లవం మన దేశంలో ఎందుకు జరగలేదు అన్న అంశాన్ని లోతుగా పరిశీలించాలి.

ఇక్కడ వస్తువులను తయారు చేసేవారి నైపుణ్యం, కౌశలం చాలా ఎక్కువగా ఉండేది. వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉండేది. అందుచేత వారు ఉపయోగించే పరికరాల సామర్థ్యాన్ని పెంచడం మీద దృష్టి ఎక్కువగా పెట్టలేదు. యూరప్‌లో ఆధునిక పరికరాలను ఉపయోగించి తయారు చేసిన వస్తువులను చూసి ఇక్కడ అదే స్థాయిలో అవే సరుకులను అంతకన్నా తక్కువ స్థాయి పరికరాలను ఉపయోగించి తయారు చేయగలిగేవారు.

ఒక తరహా వస్తువుల తయారీలో ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మరొక తరహా వస్తువుల తయారీకి ఉపయోగించడానికి ప్రయత్నించడం అనేది మన దేశంలో పెద్దగా జరగలేదు. ఉదాహరణకు: బందరు కలంకారీ దుస్తుల తయారీ చాలా ప్రాచీనమైనది. ఇది 14 వ శతాబ్దం నుంచీ ఉంది. ఇందులో రకరకాల డిజైన్లను అచ్చులుగా తయారు చేసి వస్త్రాలమీద అద్దుతారు. ఇందులో మనకు ప్రపంచ ఖ్యాతి వచ్చింది. కాని ఇదే సాంకేతికతను కాగితాలమీద అచ్చు వేసేందుకు ఉపయోగించే ప్రయత్నమే జరగలేదు.

వివిధ రకాల వృత్తుల్లో నిపుణులైనవారు మన దేశంలో అసంఖ్యాకంగా ఉండేవారు. కంసాలురు, అద్దకం పనివారు. అల్లికల పనివారు, తివాచీ నేతగాళ్ళు, నూలు, పట్టు నేతగాళ్ళు, కమ్మరులు, దర్జీలు, కట్టడాలు కట్టే మేస్త్రీలు, రాళ్ళు చెక్కే శిల్పులు, ఇలా వందకు పైగా చేతివృత్తులలో పని చేసేవారు 16వ శతాబ్దంలో ఆగ్రాలో ఉన్నట్టు యూరపియన్ వ్యాపారులు గుర్తించారు. యూరప్‌లో ఒక వ్యక్తి చేసే పనిని ఇక్కడ నాలుగు భాగాలుగా విభజించి నలుగురు చేసేవారు. ఆ విధంగా ఇక్కడ ప్రత్యేక నైపుణ్యాన్ని కలిగినవారు ఎక్కువగా తయారయ్యారు.

ఈ విధమైన ప్రత్యేక నైపుణ్యాన్ని పొందడానికి కుల వ్యవస్థ కూడా దోహదం చేసింది. ఎవరు చేసే వృత్తిలో వారు నైపుణ్యాన్ని పొందడానికి కుల వ్యవస్థ తోడ్పడింది. అదే సమయంలో తక్కిన వృత్తులకు సంబంధించిన పరిజ్ఞానాన్ని పొందడానికి లేకుండా అదే కుల వ్యవస్థ ఆటంకపరిచింది. అంతేగాక సాంప్రదాయం పేరుతో చేసే వృత్తిలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావడానికి జరిగే ప్రయత్నాలను ఆటంకపరిచింది. ఒక వృత్తిలో ఉపయోగించే సాంకేతికతను మరొక వృత్తికి వర్తింపజేయడానికి వీలు లేకుండా నిరోధించింది.

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తవచ్చు. పారిశ్రామిక విప్లవానికి ముందు యూరప్‌లో కార్ఖానా దశ అని ఒకటి ఉండేది. అందులో వ్యాపారుల అన్ని రకాల పరికరాలనూ ఒకదగ్గర చేర్చి పనివారిని నియోగించి వారితో పనిచేయించేవారు. ఆ క్రమంలో ఆ పరికరాల్లో కొత్త కొత్త మార్పులు ప్రవేశపెట్టడం మొదలైంది. అదే క్రమంగా పారిశ్రామిక విప్లవానికి దారి తీసింది. అటువంటి పరిణామం భారతదేశంలో ఎందుకు జరగలేదు?

ఇక్కడ వృత్తిదారులు తమ తమ స్వంత పనిముట్లను కలిగివుండేవారు. వారు ఉపయోగించే పరికరాలు వారి స్వంత ఆస్తిగా ఉండేవి. మొగల్ రాజ్యం ఖర్చుల పద్దులను నిర్వహించిన అబుల్ ఫజల్ పద్దుల్లో ప్రతీ చిన్న చిన్న ఖర్చుకూ లెక్కలు రాసివుంటాయి కాని పరికరాల ఖర్చుకు సంబంధించి ఒక్క పద్దు కూడా కనిపించదు.

వజ్రాల ఉత్పత్తిలో, ఓడల తయారీ రంగంలో సైతం పెద్ద సంఖ్యలో చేతివృత్తుల పనివారు పని చేశారు కాని వారి వారి స్వంత పనిముట్లనే వారు ఉపయోగిస్తూవచ్చారు.

మరొక కారణం కూడా ఉంది. యూరప్‌లో శాస్త్ర పరిజ్ఞానం వస్తువుల తయారీ రంగంతో మేళవించడం జరిగింది. అక్కడి శాస్త్రవేత్తలు రకరకాల వస్తువుల తయారీకి ఉపయోగించే పరికరాలను అభివృద్ధిపరచడానికి యాంత్రిక సూత్రాలను, భౌతిక శాస్త్రాన్ని, రసాయన శాస్త్రాన్ని ఉపయోగించారు. కాని భారతదేశంలో గాని, మధ్య ఆసియా ప్రాంతంలో గాని శాస్త్ర విజ్ఞానాన్ని వస్తూత్పత్తితో మేళవించడానికి ప్రయత్నాలు పెద్దగా జరగలేదు. ఉత్పత్తితో సంబంధం లేకుండా ఆ శాస్త్రవేత్తలు ఉండేవారు. ఇకవేళ వారేమైనా కొత్త విషయాలు కనుగొన్నా ఆ పరిజ్ఞానం ఎక్కువగా రాజాస్థానాలకే పరిమితం అయిపోయివుండేది. పైగా అట్టడుగు తరగతుల ప్రజల పట్ల పాలకవర్గాలకు ఉన్న చిన్నచూపు, ద్వేషం తోడై ఉత్పత్తి రంగంలో సాంకేతిక పరిజ్ఞానం పెగడానికి అవరోధంగా నిలిచింది.

ఇన్ని ప్రతికూలతలు ఉన్నా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి నెమ్మదిగానైనప్పటికీ కొనసాగుతూ వచ్చిందే తప్ప స్తంభించిపోలేదని గమనించాలి.

**(తరువాయి వచ్చే సంచికలో)**

# సాధారణ సెన్సస్‌తో పాటు కులగణనను కూడా తక్షణమే నిర్వహించాలి

దశాబ్దానికి ఒకసారి చేసే జనాభా లెక్కల సేకరణ 2021లో జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు జరపకపోవటంపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జనాభా లెక్కల సేకరణకు అవసరమైన జిల్లా, తాలూకా, సమితి, గ్రామాల అధికారిక సరిహద్దులను స్థంభింపజేయటానికి 2024 జూన్ వరకు ఉన్న పరి మితిని కూడా కేంద్రం పొడిగించలేదు.

2020లో ప్రారంభమై 2021లో పూర్తి కావలసిన జనాభా లెక్కల సేకరణను నిరవధికంగా వాయిదా వేస్తున్నారు. కోవిడ్ అంతమైన తర్వాత మాత్రమే జనాభా లెక్కల సేకరణ చేస్తామని ప్రభుత్వం అప్పుడు ప్రకటించింది. కాని కోవిడ్ అంతమై నాలుగు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ జనాభా లెక్కల సేకరణను ప్రారంభించే సూచనలు కని పించటం లేదు. విధాన నిర్ణేతలు, అధికారులు వివిధ తరగతుల ప్రజల అవసరాలకు అనుగుణంగా విధానాలను రూపొందించటానికి జనాభా లెక్కల సేకరణలో వచ్చిన వివరాలు దోహదం చేస్తాయి.

బ్రిటిష్ కాలం నుండి ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలు సేకరిస్తున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న 1941లో కూడా కుదించిన ప్రాతిపదికన జనాభా లెక్కలు సేకరించారు. జనాభా లెక్కల ద్వారా కేవలం జనాభాను లెక్కించటం మాత్రమే కాకుండా కుటుంబాలు, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న వర్గాలు, వ్యవసాయ కూలీల సంఖ్యకు సంబంధించిన సమగ్ర సమాచారం వస్తుంది. పట్టణ-గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు, వివిధ భాషలు మాట్లాడే ప్రజల సమూహాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలను గురించిన సమగ్ర సమాచారం కూడా లభ్యమౌతుంది.




సాధారణ జనాభా లెక్కల సేకరణలో లభించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి మినహా ఇతర వెనుకబడిన తరగతులకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదు. ఇతర వెనుకబడిన తరగతులలోని వివిధ విభాగాల వారిని గురించిన నిర్దిష్టమైన సమాచారం అవసరం. అందువలన కులగణన చేయాలన్న డిమాండ్‌ను సిపిఐ(ఎం) 24వ మహాసభ బలపరుస్తున్నది.

సామాజిక-ఆర్థిక పరిస్థితులకు కులానికి, విద్యాపరంగా అభివృద్ధి కావటానికి మధ్య ఉన్న సంబంధం, పాలకవర్గాల విధానాలు, రిజర్వేషన్లు వెనుకబడిన తరగతులపై ఎటువంటి ప్రభావాన్ని కలిగిస్తున్నాయన్న అంశాలను తెలుసుకోవటానికి కులగణన తోడ్పడుతుంది. పాలకవర్గాలు అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలు, సామాజిక న్యాయాన్ని సాధించటంలో వాటి వైఫల్యం కూడా వెల్లడౌతుంది.

జనాభా లెక్కలను సేకరించకపోవటం వలన రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలలో మహిళలకు కల్పించిన మూడింట ఒకవంతు స్థానాల రిజర్వేషన్లు అమలు చేయటం మరింత ఆలస్యం (కనీసం 2029లో జరగదు) అవుతుంది.

శాస్త్రీయ ప్రాతిపదికగా సర్వేలు చేసి, నిర్దిష్టమైన సమాచారం సేకరించటంపై ఉన్న సహజమైన తిరస్కార భావం కారణంగా జనాభా లెక్కల సేకరణకు ప్రభుత్వం ఆసక్తి చూయించటం లేదు. వివిధ సర్వేలలో వచ్చిన సమాచారాన్ని తొక్కిపట్టటం లేదా సర్వేలు చేయటానికి ఉన్న నిర్దిష్ట పద్ధతులను మార్చటం ద్వారా సమాచారాన్ని వక్రీకరించటానికి పూనుకుంటున్నది. బిజెపి-హిందుత్వ కూటమి శాస్త్రీయ వ్యతిరేక దృక్పధానికి జనాభా లెక్కల సేకరణ బలైపోతున్నది. కులగణన ద్వారా కుల వ్యవస్థలో ఉన్న అసమానతలు వెల్లడవుతాయి. దానితో మతపరమైన గుర్తింపును గురించి సంఘ్ పరివార్ చేస్తున్న అతి ప్రచారంలోని బండారం బయటపడుతుంది.

సమాజంలో అణచివేతకు గురౌతున్న అన్ని తరగతుల ప్రజానీకానికి న్యాయం జరిగేలా విధానపరంగా నిర్ణయాలు తీసుకోవటానికి శాస్త్రీయ సమాచారం అవసరం. అందుకోసం చాలాకాలం ఆలస్యం జరిగిన జనాభా లెక్కలతో పాటు కులగణనను కూడా తక్షణమే జరపాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం తక్షణమే జనాభా లెక్కలతో పాటు కులగణనను కూడా పూర్తి చేయాలని సిపిఐ(ఎం) 24వ మహాసభ డిమాండ్ చేస్తున్నది. ఈ డిమాండ్‌కు మద్దతివ్వాలని, ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని దేశంలోని అన్ని ప్రజాస్వామిక శక్తులకు అది విజ్ఞప్తి చేస్తున్నది.

# కేరళ వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వాన్ని కాపాడటానికి సమీకృతం కండి!

హిందుత్వ భావజాలాన్ని వ్యతిరేకించటం, లౌకికవాదాన్ని బలపరచటం, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా-ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయాన్ని చూయిస్తున్న వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన- ఎల్‌డిఎఫ్- నాయకత్వంలోని కేరళ ప్రభుత్వ ప్రత్యేకతలను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ పునరుద్ఘాటించింది. బిజెపి-ఎన్‌డిఎ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి వ్యతిరేకంగా ద్రవ్య బ్లాకేడ్‌ను విధించటం ఆశ్చర్యం కలిగించదు. దురదృష్టవశాత్తు ఈ అస్థిరపరిచే కుయుక్తులలో ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా కలిసింది. కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని కాపాడటం కోసం అన్ని ప్రజాస్వామిక తరగతుల ప్రజలు సమీకృతం కావాలని సిపిఐ (ఎం) 24వ మహాసభ విజ్ఞప్తి చేస్తున్నది.

కేరళలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాలను అమలు చేస్తున్నాయి. సమ్మిళిత అభివృద్ధి కోసం పున:పంపిణీ వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. భూ సంస్కరణలను అమలు చేశాయి. కార్మికసంఘాలు, కనీసవేతన చట్టాలు అత్యధిక వేతనాలకు గ్యారంటి కల్పించాయి. ప్రభుత్వ విధానాలు సార్వత్రిక విద్య, ఆరోగ్య సంరక్షణ, సామాజిక రక్షణలు కల్పించాయి. 2025-26 నాటికి నిష్ట దారిద్ర్యాన్ని నిర్మూలించ సంకల్పించింది. సామాన్య ప్రజలకు గౌరవప్రదమైన, మంచి జీవితాన్ని కేరళ ప్రభుత్వం కల్పిస్తున్నది.

సామాజిక, సంక్షేమ రంగాల అభివృద్ధిలో కేరళ దేశానికి ఆదర్శంగా ఉన్నది. గత మూడు దశాబ్దాలలో రాష్ట్ర జిడిపి పెరుగుదల దేశ జిడిపి పెరుగుదల కన్నా అధికంగా ఉన్నది. ప్రస్తుతం విద్యావంతులలోని నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఇందుకు అభివృద్ధి చెందిన శాస్త్రీయ విజ్ఞానంతో అత్యధిక ఉత్పాదకత సాధించేలా ఆర్థిక పునాది, సాంకేతికాభి వృద్ధిని మార్చటం అవసరం. దీనిని సాధించటం కోసం కేరళ విజ్ఞానం, అభివృద్ధి చెందిన నైపుణ్యం, పెట్టుబడులను ఆకర్షించే గమ్యస్థానాలుగా మారాలి. నూతన తరం స్టార్టప్ పరిశ్రమలు పెద్దసంఖ్యలో ప్రారంభం కావాలి. విజ్ఞానాభివృద్ధిపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థగా కేరళ ఎదగాలి.

దిగువ పేర్కొన్న చర్యల ద్వారా ప్రధానమైన ఆటంకాలను అధిగమించటానికి ప్రస్తుత ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢంగా అడుగులు వేస్తున్నది. (ఎ) కేరళను పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యంగా చేయటం, (బి) ప్రత్యేకమైన ఎస్‌పివిల ద్వారా బడ్జెట్‌కు అదనపు నిధులు సమీకరించి, మౌలిక సదుపాయాల కొరతను అధిగమించటం, (సి) ఉన్నత విద్యారంగాన్ని మరింతగా అభివృద్ధి చేయటం, (డి) విద్యార్థులు, నిరుద్యోగుల నైపుణ్యాన్ని, కేరళ ప్రజల విజ్ఞానాన్ని పెంచటం కోసం ప్రచారాన్ని ప్రారంభించటం.

పైన పేర్కొన్న ప్రధానమైన మార్పులతో అభివృద్ధి సాధనకు రూపొందించిన పున: పంపిణీ వ్యూహం నుండి రాష్ట్రం దూరంగా పోతున్నదని అర్థం చేసుకోరాదు. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్యరంగాలను బలపరుస్తారు. ప్రజాస్వామిక హక్కులు, కార్మికుల హక్కులను కుదించటం ఉండదు. ప్రజాస్వామిక వికేంద్రీకరణ, ప్రజల భాగస్వామ్యం ద్వారా సామాజిక, చిన్న పరిశ్రమల రంగాలలో మనం జోక్యం చేసుకోవటం కొనసాగుతుంది. అన్ని రకాలైన కుల, లింగ వివక్షలకు వ్యతిరేకంగా, లౌకిక, శాస్త్రీయ విలువల కోసం మనం చేస్తున్న పోరాటం కొనసాగుతుంది.

ఈ విధమైన మార్పులు రాకుండా అడ్డుకోవటానికే కేంద్రంలోని బిజెపి-ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. అధికారికంగా కుయుక్తులు చేయటానికి గవర్నర్‌ను వినియోగించుకోవటంతో పాటు బిల్లులను ఆమోదించకుండా ఆపటం ద్వారా అసెంబ్లి అధికారాన్ని క్షీణింపజేయటానికి ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ద్రవ్య సమీకరణ అవకాశాలను కేంద్ర ప్రభుత్వం క్రమపద్ధతిలో కుదింపజేస్తున్నది.

ఫైనాన్స్ కమిషన్ నిర్ణయం ద్వారా పన్నులలో కేరళకు రావలసిన వాటా 10వ యుఎఫ్‌సి కాలంలో 3.9 శాతం నుండి 15వ యుఎఫ్‌సి కాలానికి 1.9 శాతానికి తగ్గిపోయింది. కేంద్రం అమలు జరుపుతున్న పథకాలలో రాష్ట్రానికి 1.6 శాతం మాత్రమే దక్కుతున్నాయి. సిపిఎస్ఇఎక్స్‌లో రాష్ట్రం వాటా 1.1 శాతం మాత్రమే. కేంద్రం వివిధ రాష్ట్రాలకు ప్రకటిస్తున్న ప్రత్యేక ప్యాకేజీలలో కేరళకు ఏమీ రావటం లేదు. 2024-25లో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అందించిన మొత్తం నిధులు 25 లక్షల కోట్ల రూపాయలు. జనాభా ప్రాతిపదికన 2.8 శాతం ప్రజలు ఉన్న కేరళకు 70,000 కోట్ల రూపాయలు రావాలి. కాని రాష్ట్రానికి వచ్చింది 35,000 కోట్ల రూపాయలు, రాష్ట్రానికి వాస్తవంగా రావలసిన మొత్తంలో సగం మాత్రమే వచ్చాయి.

కెఐఐఎఫ్‌బి కూడా నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా లాంటి ఎస్‌పివియే అని, ఆ సంస్థ తీసుకొనే పెట్టుబడి రుణాలు రాష్ర ప్రభుత్వం పరోక్షంగా తీసుకొనే రుణాలేననే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొనే సాధారణ రుణాలను కేంద్రం ఏకపక్షంగా తగ్గించింది. కేంద్రం రూపొందించిన కొత్త నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వ అదనపు బడ్జెట్ రుణాలకు గతం నుంచి వర్తింపజేయటం ఇంతకన్నా అధమమైనది. ఫలితంగా గత మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొనే మార్కెట్ రుణాలు 10,000 కోట్ల రూపాయలు తగ్గాయి. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని సంక్షోభంలోకి నెట్టాయి.

రాష్ట్రం పట్ల తన వివక్షను కప్పిపుచ్చుకోవటానికి కేంద్ర ప్రభుత్వం, దాని అనుయాయులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆధారాలు లేని, పూర్తి అసత్యాలతో కూడిన హానికరమైన ప్రచారం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను బట్టబయలు చేయటానికి, కేరళ సాధించిన ప్రజాస్వామిక విజయాలను ప్రచారం చేయటానికి, కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని కాపాడటానికి అన్ని శక్తులను సమీకరించాలని సిపిఐ(ఎం)24వ మహాసభ అన్ని శాఖలకు, సభ్యులకు, సానుభూతిపరులకు, అన్ని తరగతుల ప్రజాస్వామ్యవాదులకు పిలుపు ఇస్తున్నది.

అంతర్జాతీయం

# ట్రంప్ సుంకాల యుద్ధంతో మళ్లీ ప్రపంచ కల్లోలం



రచయిత రాజకీయ ఆర్థిక జర్నలిస్టు. యూనివర్శిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌లో రాయిటర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ జర్నలిజం డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఆమెకు టివి, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో అనుభవం ఉంది. రెండు దశాబ్దాలుగా అనేక భాషల్లో రాస్తున్నారు. మహిళా సమస్యలు, వాతావరణ సమస్యలపై కృషి చేస్తున్నారు.

మిథాలీ ముఖర్జీ

గత దశాబ్ద కాలంలో మానవ జాతి రెండు అసాధారణ ఘటనలను చవిచూసింది. మొద టిది, ప్రపంచ వ్యాపితంగా తలెత్తిన కోవిడ్–19 మహమ్మారి. మనకు తెలిసిన చరిత్రలో ఇదే అత్యంత ప్రాణాంతకమైన వ్యాధి. రెండవది, మనం ఇప్పుడు చూస్తున్న ప్రపంచ వాణిజ్య పతనం.

గత కొద్ది రోజులుగా ప్రపంచ వ్యాపితంగా ఫైనాన్షియల్ మార్కెట్లు కుప్పకూలిపోతున్నాయి. హాంగ్ కాంగ్‌లో స్టాక్ మార్కెట్ 1997 ఆసియా ఫైనాన్షియల్ సంక్షోభం తరువాత అత్యంత వేగంగా పడిపోయింది. ఇతర అనేక మార్కెట్లు కూడా గత దశాబ్దాల్లో ఎరుగనంత వేగంగా పడిపోయాయి. ఫైనాన్స్ మార్కెట్లలో అస్థిరత పెరుగడంలోపాటు, ప్రపంచ వ్యాపితంగా స్టాక్ మార్కెట్ బ్రోకరేజి సంస్థల్లోనూ, వ్యాపారుల్లోనూ, ప్రభుత్వాల్లోనూ ఆందోళన అదే మోతాదులో పెరిగిపోతున్నది.

రిస్కులు మళ్లీ కళ్లెదుట కనిపిస్తున్నాయి. అమెరికాలో మాంద్యం ముంచుకొస్తున్నదన్న మాటలు వినపడుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగి పోతుందనీ, కొన్ని పరిశ్రమలు దివాళా తీస్తా యన్న చర్చ కూడా సాగుతోంది. ఆసియాలో అభివృద్ధి వెనకపట్టు పట్టే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికాలో మాది రిగా కాకుండా ఇక్కడ ప్రతిద్రవ్యోల్బణం లేక డిజిన్‌ఫ్లేషన్ ఏర్పడుతుందని కొందరు చెబుతు న్నారు.

ప్రపంచ పరిస్థితిని ఇప్పుడే అంచనా వేయ డం కష్టం. అయితే నేటి పరిణామాలను గురించి వాడుతున్న మాటలు మంచి ప్రారంభా లవుతాయి. ఇప్పుడు ఈ రకమైన మాటలు వినిపిస్తున్నాయి: షాక్, మారణహోమం, దిగ్భ్రాం తి, గందరగోళం, అరాచకం...వగైరా. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు హై వోల్టేజి షాక్ తగిలిందని ఈ మాటలన్నీ సూచిస్తున్నాయి.

### ప్రతీకారం, పునరేకీకరణ

తరువాత ఏం జరుగుతుంది, ఏం జరిగితే ఏం ఫలితాలస్తాయి, అసలింతకీ ఇప్పుడేం జరుగుతుంది అన్న ప్రశ్నలకు సమాధానాలు ఎక్కడ ప్రారంభించాలి? చరిత్రలో ఏదో ఒక పాయింటు నుండి ప్రారంభించాలి. 1930వ దశకంలో నాటి అమెరికా అధ్యక్షుడు హెర్బర్ట్ హూవర్ సుంకాలపై ఒక చట్టం చేశారు. దాన్ని స్మూట్–హావ్లే సుంకాల చట్టం అంటున్నారు. తీవ్రమైన ఆర్థిక మాంద్యం నేపథ్యంలో దిగు మతి చేసుకునే సరుకులపై సుంకాలు పెంచ డానికి ఉద్దేశించిన చర్య ఇది. దాంతో చర్యకు పెద్ద ఎత్తున ప్రతి చర్యలు ప్రారంభ మయ్యాయి. అన్ని దేశాలూ ప్రతి సుంకాలు విధించాయి. వాణిజ్యం మందగించింది. స్టాక్ మార్కెట్లు పడిపోయాయి. ద్రవ్య పరమైన భయాందోళనలు సర్వత్రా వ్యాపించాయి. దీని వల్లనే అమెరికా ఆర్థిక వ్యవస్థ దిగజారిపోయిందని అనేక మంది ఆర్థిక వేత్తలు చెబుతారు. 1930వ దశకం లాగానే ఇప్పుడూ జరుగుతోందా? దీన్ని ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుంది.

ఎగుమది దారులకు పన్ను రాయితీలు వంటి చర్యలతో కొంత ఉపశమనం కలుగుతుం దని అనుకోవచ్చు. కానీ ఇది సుంకాల పెంపు వల్ల అమెరికా కంపెనీలకు జరిగే తీవ్రమైన గాయాలకు బాండ్ ఎయిడ్ అంటించినట్లుం టుంది. పెద్దగా ఫలితం ఉండదు. మరికొందరు మరో భయంకరమైన విషయం చెబుతున్నారు. అదేమంటే ముందు ముందు ఏం జరుగుతుందో చెప్పలేం అని.

ట్రంప్ సుంకాలకు సమాధానం చెప్పేం దుకూ, వ్యూహాలు అనుసరించేందుకూ ఆయా దేశాలు ప్రణాళికలు రూపొందించుకోవడం ప్రారంభించాయి. ట్రంప్ సుంకాల దెబ్బకు ప్రపంచ వ్యాపితమైన వాణిజ్య యుద్ధం ఆవిష్కృతమవుతోందని సింగపూర్ ప్రధాన మంత్రి లారెన్స్ వాంగ్ హెచ్చరించారు. ఈ యుద్ధంలో సింగపూర్ అన్ని విధాలా నలిగి పోయి, పక్కకు నెట్టబడి, వెనుకబడిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. ట్రంప్ సుంకాలు పెద్దగా తగిలిన చైన ప్రతి చర్యలు తీసుకుం టోంది. ప్రతి రోజూ అమెరికాకు ప్రతి సుంకా లతో సమాధానం చెబుతోంది.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలు కేవలం 10 శాతం సుంకాలకే పరిమితం అవడం వల్ల ట్రంప్ దెబ్బ వాటికి తక్కువగానే తగిలింది. అయినప్పటికీ అవి ట్రంప్ సుంకాల యుద్ధాన్ని ఖండించాయి. ఈ చర్యలు మిత్ర దేశాలపై శత్రుపరమైన చర్యలుగా వర్ణించాయి. తైవాన్ మంత్రి వర్గం తమ దేశంపై విధించిన 32 శాతం సుంకాలు “చాలా అహేతుకమైనవి” అని విమర్శించింది. ఐరోపా యూనియన్ వంటి దేశాలు దీనిపై దుడుకుగా ముందుకెళ్లాలా వద్దా అన్న విషయమై వాటి మధ్య ఏకాభిప్రాయానికి ప్రయత్నిస్తున్నాయి.

ఇందులో ఆసక్తికరమైన విషయం ఏమం టే, ఆరుమాసాల క్రితం అసాధ్యం అను కున్న కొత్త కూటములు ఇప్పుడు సాధ్యమవు తున్నాయి. గత నెల చైనా, దక్షిణ కొరియా, జపాన్‌లు అయిదేళ్ల కాలంలో తొలిసారి ఆర్థిక చర్చలు ప్రారంభించి మూడు దేశాల మధ్య ఆర్థిక బంధాలను పటిష్టం చేసుకోవాలన్న నిర్ణయాని కొచ్చాయి.

ప్రపంచ స్థాయిలో నరాలు బిగబట్టే ఈ పరిణామాల ప్రభావం భారత దేశం మీద ఎలా ఉండబోతోంది, దీనిపై ప్రభుత్వం స్పందన ఏమిటి? ఒక్కమాటలో చెప్పాలంటే మన ప్రభు త్వం నిమ్మకు నీరెత్తినట్లుంది.

2019 కరోనా మహమ్మారికి ముందు వచ్చిన 2007 ప్రపంచ ద్రవ్య సంక్షోభం మనకు ఒక విషయం చెప్పింది. ప్రపంచ వ్యాపితంగా సంభవించే తీవ్రమైన ప్రతికూల ప్రభావాల నుండి ప్రపంచంలోన ఏ దేశమూ తప్పించు కోలేదు.

❝ ట్రంప్ మొదటి దఫా సుంకాలు విధించిన సమయంలో తెరవెనుక మంత్రాంగం నడిపి భారత ప్రభుత్వం కొంత వేడి తగ్గించుకున్నది. కానీ ఈసారి విధించిన 27 శాతం సుంకాల దెబ్బ తక్కువేం కాదు. 2020 నుండి మోడీ ప్రభుత్వం "ఆత్మనిర్భర భారత్" పేరుతో సోలార్ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల మార్కెట్‌ను రక్షించుకోడానికి చర్యలు తీసుకుంది. ఈ మాత్రం దానికే ట్రంప్ భారత్‌ను "సుంకాల రారాజు" అనీ, "నేరస్తురాలు" అనీ తిట్టిపోశాడు.❞




ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా కాలిఫోర్నియాలోని ఓక్లాండ్‌లో ప్రదర్శన చేస్తున్న అమెరికన్లు

అంటే, పరిణామాల ప్రభావానికి నేరుగా గురికాని దేశాలు కూడా పరోక్షంగా ప్రభావితమవుతాయి. ట్రంప్ సుంకాలు పెద్దగా వేయలేదని సంబరపడే దేశాలమీద కూడా పరోక్ష ప్రభావం తీవ్రంగానే ఉంటుంది.

సుంకాల పెంపు ప్రభావం, సరుకుల ధరలు హెచ్చుతగ్గులకు గురికావడం, ప్రపంచ మార్కెట్లలో ప్రతీకార సుంకాల ప్రభావంతో భారత దేశ ఆర్థికాభివృద్ధి మందగించబోతున్నదని ఆర్థిక వేత్తలు హెచ్చరికలు చేయడం ప్రారంభించారు.

ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న పరిణామాల నుండి భారత దేశాన్ని రక్షించేదేమిటి? ట్రంప్ సుంకాల దెబ్బకు అతలాకుతలమవుతున్న ప్రపంచ వాణిజ్యంలో నిలదొక్కుకోడానికి "ప్లాన్ బి" ని అమలు చేయాలని వస్తున్న సలహాలను పాటించడం ఒకటి. ఉదాహరణకు చైనా దిగుమతులపై పెద్ద ఎత్తున పెరుగుతున్న సుంకాల దెబ్బకు భారత దేశం నుండి తన ఐఫోన్‌లను అపిల్ కంపెనీ పెద్ద ఎత్తున అమెరికాకు తరలించింది. దక్షిణాసియాలోని ఇతర దేశాలకంటే ట్రంప్ తనపై సాపేక్షంగా తక్కువ సుంకాలు విధించడంపట్ల భారత్ కొంత ఊరట పొందవచ్చు.

ఈ విధంగా ఆనందపడే సమయంలో మన దేశం కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి. అవి:

ప్రపంచ వ్యాపితంగా ఏర్పడుతున్న ఈ అస్తవ్యస్థ పరిస్థితుల నుండి రక్షించే ఏకైక రక్షణ కవచం మన దేశంలో అంతర్గత గిరాకీని పెంచుకోవడం. ఈ విషయాన్ని భారత ప్రభుత్వం కూడా అంగీకరిస్తోంది. దానికనుగుణంగానే ఇటీవల బడ్జెట్‌లో మధ్యతరగతిపై ఆదాయపన్ను రాయితీలు కల్పించింది. అయితే ఈ చర్య విజయవంతమవుతుందా లేదా అనేది చెప్పలేం. ఒక విషయం మాత్రం నిజం. కరోనా మహమ్మారి తరువాత భారత దేశం తిరిగి పుంజుకోవడం క్రమపద్ధతిలో జరగడం లేదు. గిరాకీ చాలా నెమ్మదిగా ఉంది, ఎందుకంటే జనాభాలోని ఒక చిన్న సెక్షన్ సంపద మాత్రమే పెరుగుతోంది.

గత దశాబ్దకాలంలో భారతీయ మధ్య తరగతి నిజ ఆదాయాలు సగానికి సగం తగ్గిపోయాయి. ఖర్చులు పెరిగిపోయాయి. దాంతో కొనుగోలు శక్తి నేలమట్టమైంది. ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్న సుంకాల యుద్ధాన్ని తట్టుకోడానికి అంతర్గత కొనుగోలు శక్తి పెంచడమే ఏకైక గొప్ప మార్గమయినప్పుడు, మనం ఈ సమయంలో మన దేశీయ ఆర్థిక వ్యవస్థలో తిరిగి గిరాకీ సృష్టించడం చాలా అవసరం.

మనకు తెలియని మరో అంశమేమంటే, మన దేశంలోని వస్తూత్పత్తి వాతావరణాన్ని మార్చడానికి కావలసిన నిపుణులైన కార్మికులు, కార్పొరేట్ సెంటిమెంట్ భారత దేశంలో ఉందా అనేది. పరిశ్రమలు ప్రారంభించేందుకు మనకు మాన్యుఫాక్చరింగ్ ఆడిట్ కావాలి. "మేక్ ఇన్ ఇండియా" వాస్తవానికి ఎంతమేరకు జయప్రదం అయిందో తెలిపే స్పష్టమైన విశ్లేషణ, గణాంకాలు కావాలి. ఇప్పటి వరకు మనకు లభిస్తున్న గణాంకాలు అంతగా ప్రోత్సాహకరంగా లేవు. గత దశాబ్ద కాలంలో వస్తూత్పత్తి పెరుగుదల 5.5 శాతానికి తగ్గిపోయింది. స్థూలజాతీయోత్పత్తిలో వస్తూత్పత్తి వాటా 15–17 శాతాల మధ్య స్తంభించిపోయింది. ఈ రంగంలో ఉపాధి కల్పన 2011 –12లో 12.6 శాతం నుండి 2022–23లో 11.4 శాతానికి తగ్గిపోయింది.

ఇక మూడోది, ఎవరికీ తెలియని అతి పెద్ద అంశం.

డొనాల్డ్ ట్రంప్ ఏం చేయాలని లేక ఏం చెప్పాలని లేక ఏం ఆపాలని, ఏం ప్రారంభించాలని నిర్ణయిస్తాడో ఎవరికీ తెలియదు. అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా చెప్పబడుతున్న భారత దేశం పట్ల కూడా ఏమాత్రం సెంటిమెంటు లేదు. అమెరికా భారత దేశానికి అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2024లో రెండు దేశాల మధ్య 12,900 కోట్ల డాలర్ల వాణిజ్యం నడిచింది. భారత దేశం తన వ్యవసాయాన్ని రక్షించుకోడానికి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల మీద భారీగానే (32 శాతం) సుంకాలు విధించింది. ఇప్పుడు దీన్ని తగ్గించడం అంత తేలికైన విషయం కాదు, ముఖ్యంగా మోడీ ఒక సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్న సమయంలో.

ట్రంప్ మొదటి దఫా సుంకాలు విధించిన సమయంలో తెరవెనుక మంత్రాంగం నడిపి భారత ప్రభుత్వం కొంత వేడి తగ్గించుకున్నది. కానీ ట్రంప్ విధించిన 27 శాతం సుంకాల దెబ్బ తక్కువేం కాదు. ట్రంప్ ఆయన అధికార బృందం మోడీ పుస్తకంలో నుండి "ఆత్మనిర్భర భారత్" అనే ఒక పేజీని తీసుకుని సుంకాల మోత మోదుతోంది. 2020 నుండి మోడీ ప్రభుత్వం "ఆత్మనిర్భర భారత్" పేరుతో సోలార్ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల మార్కెట్‌ను రక్షించుకోడానికి చర్యలు తీసుకుంది. ఈ మాత్రం దానికే ట్రంప్ భారత్‌ను "సుంకాల రారాజు" అనీ, "నేరస్తురాలు" అనీ తిట్టిపోశాడు.

ఫిబ్రవరి నెలలో ఫాక్స్ న్యూస్ విలేకరి సీన్ హన్నిటీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్, మోడీతను జరిపిన సమావేశం గురించి ఇలా చెప్పారు: "నిన్న నేను ప్రధాన మంత్రి మోడీ ఇక్కడ ఉన్నారు. అప్పుడు ఆయనతో నేను 'మేము కూడా ప్రతీకార సుంకాలు విధిస్తాము. నీవెంత పన్ను వేస్తావో నేనూ అంతే వేస్తాను' అని చెప్పాను." అమెరికాకు ఎక్కడన్నా బావా గానీ వంగతోట కాడ బావ కాదు. మన దౌత్య నీతి, మన రాయితీలు మనల్ని ఇక్కడికి తీసుకుపోయింది. ❃

# వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం ముసాయిదాను ఉపసంహరించుకోవాలి

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పంపించిన 'వ్యవసాయ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రం' (ఎన్‌పిఎఫ్‌ఎఎం) ముసాయిదాపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నది. రైతుల ప్రయోజనాలను బలిచేసి, కార్పొరేట్లకు గరిష్ట లాభాలను కట్టబెట్టాలనే ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఈ పత్రం వెల్లడిస్తున్నది. ప్రజలు అసహ్యించుకోవటంతో రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన తీసుకురావటానికి దీనిని సాధనంగా వినియోగించుకొంటున్నది.

పోరాడుతున్న రైతాంగ ఉద్యమం చేస్తున్న డిమాండ్లయిన కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించటం, రైతుల రుణాలను రద్దు చేయటం, సమగ్ర పంటల బీమా పథకం, వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచటం, రైతాంగానికి అనుకూలంగా రుణాలను ఇవ్వటం తదితరాలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఈ తిరోగమన ముసాయిదాను తీసుకొచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం వ్యవసాయ మార్కెటింగ్ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశం అన్న వాస్తవాన్ని నోటిమాటగా చెబుతూనే, సమాఖ్య విధానాన్ని, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలపై దాడి చేసేదిగా ముసాయిదా సారాంశం ఉన్నది. రాష్ట్రాల మద్దతు ఉన్న మౌలిక మార్కెట్ సదుపాయాలను రద్దు చేయాలని, ఎపిఎంసిలను నీరుగార్చటం, ప్రైవేటు కార్టెల్స్ వాణిజ్య దోపిడికి చిన్న, మధ్య తరగతి రైతులను వదిలి వేసేదిగా ఉన్నది.

ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లను ఏర్పాటు చేయటం, ప్రాసెసింగ్, ఎగుమతులు చేసే కార్పొరేట్ కంపెనీలు పొలాల వద్దకు వెళ్ళి స్వయంగా కొనుగోలు చేయటం, సాంప్రదాయకంగా ఉన్న మార్కెట్‌ల స్థానంలో




కార్పొరేట్‌ల ఆధీనంలోని వేర్‌హౌస్‌లు, సైలోలను ఏర్పాటు చేయటం, రాష్ట్రవ్యాపంగా ఒకే విధమైన మార్కెట్ ఫీజులు, వాణిజ్య లైసెన్స్‌ల విధానాన్ని ప్రవేశపెట్టటం ప్రతిపాదిత సంస్కరణలలో ప్రధానమైనవిగా ఉన్నాయి. ఎపిఎంసి మార్కెట్ యార్డులను పక్కన పెట్టి, బడా కార్పొరేట్ సంస్థలు రైతుల నుండి ప్రత్యక్షంగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తాయని ముసాయిదాలో ప్రతిపాదించారు. రిలయన్స్, అదాని లాంటి బడా వాణిజ్యసంస్థలు ఇప్పటికే హర్యానాలోని సిర్సా, పంజాబ్‌లోని లుధియానాలో విస్తృతంగా వేర్‌హౌస్‌లు, ప్రైవేటు రైల్వే నెట్‌వర్క్‌లను నిర్మాణం చేశాయి.

కార్పొరేట్ లాబి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడులు(ఐఎఫ్‌సి) ఎల్లప్పుడూ వ్యవసాయోత్పత్తులను అతి తక్కువ ధరలకు కాజేయటం, దానికి విలువను జోడించటం, బ్రాండ్ పేరుతో మార్కెట్‌లో అసాధారణ లాభాలను గుంజుకోవటమే కార్పొరేట్లు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వ్యూహం. కాబట్టి వారు ఎల్లప్పుడూ మద్దతు ధరల విధానాన్ని వ్యతిరేకిస్తూనే ఉంటారు. ఈ విధంగా బడా పెట్టుబడి రైతులు, వినియోగదారులు ఇరువురిని దోపిడి చేస్తుంది. మార్కెట్‌ను శక్తివంతం చేయటం పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌లు వ్యవసాయ రంగాన్ని దోచుకోవటానికి అనువైన పరిస్థితులను కల్పిస్తున్నది. ఈ విధంగా రైతుల ఆత్మహత్యలు, రుణభారం పెరగటం, రైతులను దరిద్రులను చేయటం కొనసాగిస్తున్నది.

వ్యవసాయాన్ని కార్పొరేకరణ చేయ వలసిన అవసరాన్ని గురించి ముసాయిదా అత్యంత స్పష్టంగా చెబుతున్నది. వ్యవసాయాన్ని "సంస్కరించటం" ఒక్కటే మార్గంగా చూస్తున్నది. వ్యవసాయరంగంలో కార్పొరేట్ల ప్రవేశాన్ని మరింత సుగమం చేసే, మోడికి ఇష్టమైన పథకం అయిన ఎఫ్‌పిఓలను ముసాయిదా ముందుకు తెస్తున్నది. వ్యవసాయరంగంలో పనిచేస్తున్న బడా కార్పొరేట్ సంస్థలతో క్లస్టర్ ప్రాతిపదికగా ఉన్న ఎఫ్‌పిఓలు కాంట్రాక్టు వ్యవసాయ ఒప్పందాలు చేసుకోవటానికి అనుకూల పరిస్థితులను కల్పిస్తుంది.

ఫ్యూచర్స్, ఆప్షన్స్ మార్కెట్ల ద్వారా ద్రవ్యీకరణను మరింత తీవ్రం చేయాలన్న సలహాలు బడా వాణిజ్య సంస్థల పట్టును తెలియజేస్తున్నాయి. దేశ ఆహార పరిశ్రమపై ఎంఎన్‌సిలు, ఐఎఫ్‌సి ఆధిపత్యం పెరగటానికి, భారత ప్రజల ఆహారభద్రత ప్రమాదంలో పడటానికి ఇది దారితీస్తుంది.

పైన చెప్పిన ముసాయిదాకు తీవ్రమైన వ్యతిరేకత రావటం ప్రారంభమైంది. ఈ మధ్యకాలంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) దేశవ్యాపితంగా వేలాది మంది రైతులను సమీకరించి, ఈ ముసాయిదాను దగ్ధం చేసింది. పంజాబ్, హర్యానాలో జరిగిన రెండు కిసాన్ పంచాయత్‌లలో 75,000 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ అనుకూల, రైతాంగ వ్యతిరేక ఎన్‌పిఎఫ్‌ఎఎంను ఉపసంహరించుకొనే వరకు పోరాటాన్ని మరింత తీవ్రం చేయాలని సిపిఐ(ఎం) 24వ మహాసభ అన్ని శాఖలకు పిలుపు ఇస్తున్నది.

# ఎస్‌సి, ఎస్‌టి, ఇతర వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లను ప్రైవేటు రంగానికి విస్తరించాలి.

సమాజంలోని అట్టడుగు తరగతుల– షెడ్యూల్డ్ కులాలు(ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), ఇతర వెనుకబడిన తరగతులు(ఒబిసి) –ప్రజలపై సామాజిక వివక్ష, అస్పృశ్యత కొనసాగుతున్నదని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) 24వ మహాసభ పునరుద్ఘాటిస్తున్నది. ఆర్థిక వివక్ష, అసమానతలు కులవ్యవస్థలో ప్రధానాంశా లుగా ఉన్నాయి. కులం ప్రాతిపదికగా ఉన్న సామాజిక నిర్మాణపు ప్రధాన ఫలితం ఇది. దిగువ కులాలకు చెందిన వారు అనేక ఆంక్షలకు గురవటం, అనేక ప్రదేశాలు, ఆర్థిక కార్యకలాపాల నుండి మినహాయింపబడటం, భూమి, ఇతర ఆస్తులను కలిగి వుండటానికి, వివిధ వృత్తులలోకి ప్రవేశించటానికి నిరాకరించటం జరుగుతున్నది. విద్యతో పాటు వివిధ సేవారంగాలలోకి ప్రవేశించటానికి వారికి అవకాశం లేకుండా చేయటం, ఆర్థికపరమైన అవకాశాలను నిరాకరించటంలో ప్రధానపాత్ర వహిస్తున్నది.

ఈ కులాలు, తెగలను ఆర్థిక అవకాశాల నుండి దూరంగా ఉంచటానికి, విస్తృతంగా ఉన్న వివక్షకు వ్యతిరేకంగా, వీరికి ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించటం విధానపరమైన ముఖ్యాంశంగా ఉన్నది. రాజ్యాంగంలోని 15(4), 16(4), 46, 335 ఆర్టికల్స్ ఎస్‌సి, ఎస్‌టి, ఇతర వెనుకబడిన తరగతులకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించటానికి ప్రాతిపదికను కల్పించాయి. కాని దీనిని కేవలం ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు మాత్రమే అమలు చేస్తున్నారు.

రిజర్వేషన్లను అమలు చేయటంలో లోపాల వలన, చారిత్రకంగా ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు కల్పించటం కూడా సక్రమంగా జరగలేదు. పెద్దసంఖ్యలో రిజర్వు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2023లో 10 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయకుండా ఉన్నాయి. వీటిలో అత్యధికం రిజర్వుడు పోస్టులే. ప్రభుత్వరంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలలో పెద్ద సంఖ్యలో రిజర్వుడు పోస్టులు భర్తీ చేయకుండా ఖాళీగా ఉన్నాయి.

నయా–ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేయటం వలన ప్రభుత్వరంగ సంస్థలలో రిజర్వేషన్ విధానం ద్వారా భర్తీ చేయవలసిన ఉద్యోగాలు భారీగా కుదించబడ్డాయి.

1990లో అన్ని రకాలైన ప్రభుత్వ సంస్థ (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వాల భాగస్వామ్యం ఉన్న సంస్థలు), స్థానిక ప్రభుత్వ సంస్థలలో రెండు కోట్లమంది ఉద్యోగాలు చేస్తున్నారు. 2012 నాటికి ఈ సంఖ్య 1.7 కోట్లకు తగ్గింది. మరో విధంగా చెప్పుకోవాలంటే ఈ కాలంలో 30 లక్షల ప్రభుత్వం ఉద్యోగాలను తగ్గించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ తగ్గింపు మరింత ఎక్కువగా ఉన్నది.

ప్రభుత్వ ఉద్యోగాలను గురించి సమగ్రమైన లెక్కలను ప్రచురించటాన్ని మోడీ ప్రభుత్వం నిలిపివేసింది. కాని వివిధ రకాలైన ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగాలు తీవ్రంగా తగ్గటాన్ని చూస్తున్నాం. 1990 దశాబ్దం మధ్యలో ప్రభుత్వరంగ బ్యాంకులలో మొత్తం ఉద్యోగులు 10 లక్షల మందికి పైగా ఉండగా, 2024 నాటికి ఈ సంఖ్య 7.5 లక్షలకు తగ్గిపోయింది. 2014 నుండి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలలో 4.5 లక్షల మంది ఉద్యోగులు–35 శాతం– తగ్గారు. 2014 నుండి రైల్వేలలో 80,000, పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో 40,000, ప్రభుత్వరంగ బ్యాంకులలో 90,000 మంది ఉద్యోగులు తగ్గారు.

కాంట్రాక్టు విధానాన్ని పెద్దస్థాయిలో అమలు చేస్తున్న గ్రూపు సి, గ్రూపు డి ఉద్యోగాల తగ్గింపు అత్యధికంగా ఉన్నది. 2014–15 నుండి 2022–23 వరకు తగ్గిన ప్రభుత్వోద్యోగాలలో 86 శాతం గ్రూపు సి, గ్రూపు డి ఉద్యోగులే ఉన్నారు.

బయటి వారి చేత పని చేయించుకోవటం (అవుట్ సోర్సింగ్ ఆఫ్ వర్క్), ప్రైవేటు కాంట్రాక్టర్లు, కంపెనీల ద్వారా సిబ్బందిని తీసుకోవటం, కాంట్రాక్టు సిబ్బందిని ఉపయోగించుకోవటం ప్రభుత్వ సంస్థలలో బాగా విస్తరిస్తున్నది.

విద్యారంగాన్ని ప్రైవేటీకరించటం అంటే ప్రభుత్వ విద్యాసంస్థలలో ఉపాధ్యాయ పోస్టుల పెరుగుదల ఉండదు. ఫలితంగా ప్రభుత్వ ఉపాధ్యాయులలో అట్టడుగు తరగతులలోని వీరి శాతం తీవ్రంగా తగ్గిపోతున్నది. 2023–24లో పాఠశాల ఉపాధ్యాయులలో ఎస్‌టిల నుండి 7.7 శాతం, ఎస్‌సిల నుండి 12.6 శాతం మాత్రమే ఉన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఎస్‌సి, ఎస్‌టిలను ఉపాధ్యాయులుగా నియమించుకున్న రికార్డు అత్యంత అధ్వాన్నంగా ఉన్నది. ప్రైవేటు పాఠశాలలలో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులు 13 శాతం మాత్రమే ఉన్నారు.

ప్రభుత్వ ధనాన్ని వినియోగించి ఉద్యోగాలను కల్పిస్తున్న అనేక సంస్థలకు రిజర్వేషన్ల విధానాన్ని విస్తరింపజేయటం లేదు. స్కీం వర్కర్లు, ప్రభుత్వ సహాయం పొందుతున్న ఎయిడెడ్ పాఠశాలలు, కాంట్రాక్టర్లు, ప్రైవేటు సంస్థల ద్వారా రిక్రూట్ చేసుకుంటున్న ఉద్యోగులకు రిజర్వేషన్లను వర్తింపజేయటం లేదు. 20 లక్షల మందికి ఉద్యోగాలను ఇవ్వటం పేరుతో ప్రభుత్వ ధనాన్ని 500 పెద్ద కంపెనీలకు, బడా కార్పొరేట్‌లకు కట్టబెట్టటం కోసం ఉద్యోగాలతో ముడిపడిన పథకాలను 2024 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ పథకం కోసం సుమారు 1.73 లక్షల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తారని అంచనా వేశారు. కానీ ఈ పథకంలో ఎస్‌సి, ఎస్‌టి, ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు ఉండవు.

నయా–ఉదారవాద విధానాలలో ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ కీలకమైన అంశం. దీని ఫలితంగా ఉద్యోగాలు అసంఘటితంగా మారుతున్నాయి. అందువలన కులపరమైన వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా రిజర్వేషన్లు ఒక సాధనంగా వినియోగపడటం క్రమంగా తగ్గిపోతున్నది. సంఘటితంగా ఉన్న మొత్తం ప్రైవేటు రంగానికి రిజర్వేషన్ విధానాన్ని విస్తరించాలని, ప్రైవేటు సంస్థలతో సహా రిజిష్టరైన అన్ని సంస్థలు ఎస్‌సి, ఎస్‌టి, ఇతర వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను అమలు చేయాలని సిపిఐ(ఎం) 24వ మహాసభ డిమాండ్ చేస్తున్నది. ❃

# ఆర్థిక పతనానికి దారితీస్తున్న సరళీకరణ విధానాలు


రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

ప్రభుత్వం అనుసరిస్తున్న సరళీకరణ విధానాలు ఆర్థికవ్యవస్థ పతనోన్ముఖంగా ప్రయాణించటానికి దారి తీస్తున్నాయి. అమెరికా ఆదేశాలకు లొంగిపోయి వ్యవహరించటం, బడా పెట్టుబడిదారుల సంపద దాహానికి ప్రభుత్వ, ప్రజల ఆస్తులను ధారపోయటంతో అభివృద్ధికి తీవ్ర విఘాతం కలుగుతున్నది. దేశంలో ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతున్నదని, ప్రపంచంలో భారతదేశ ఆర్థికవ్యవస్థ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. కాని వెలుగులో కొస్తున్న వాస్తవాలు ఈ ప్రచారానికి పంచర్లు చేస్తున్నాయి. పారిశ్రామికాభివృద్ధి దిగజారుతున్నదని ప్రభుత్వం ప్రకటించిన లెక్కలే వెల్లడిస్తున్నాయి. మిగతా రంగాలు కూడా ముందుకు పోయే పరిస్థితి లేదు. ఆర్థికాభివృద్ధి వెనుకపట్టు పడుతున్నదని వివిధ సంస్థల అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశ ఆర్థికాభివృద్ధి 6.5 శాతం ఉంటుందని ఐఎంఎఫ్, 6.7 శాతం ఉంటుందని ప్రపంచబ్యాంక్ అంచనాలు వేశాయి. ఈ అంచనాలను క్రమంగా తగ్గిస్తూ, ఇప్పుడు 2025-26లో 6.2 శాతం 2026-27లో 6.3 శాతం పెరుగుదల మాత్రమే ఉంటుందని ప్రకటించాయి. ఆర్థిక సంవత్సరం పూర్తయే నాటికి అభివృద్ధి ఆరు శాతానికి దిగువనే ఉన్నా ఏ మాత్రం ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

దేశంలో గత మూడు దశాబ్దాలకు పైగా అమలు జరిపిన సరళీకరణ విధానాలు ఒక వైపున సంపద కేంద్రీకరణకు, మరోవైపున విస్తారమైన ప్రజల ఆదాయాలు తగ్గటానికి దారితీశాయి. ఈ కాలంలో ప్రపంచంలో ఏ దేశంలో కన్నా వేగంగా దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య, వారి వద్ద ఉన్న సంపదలు పెరిగాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆదాయాలు స్థంభించిపోవటం లేదా కుదించుకు పోతున్నాయి. ఇది అభివృద్ధిపై తీవ్ర ప్రభావాన్ని కలుగజేస్తున్నది.

పారిశ్రామికాభివృద్ధి పెరగకుండా వేగంగా అభివృద్ధి చెందటం సాధ్యం కాదు. పారిశ్రామికోత్పత్తి జరుగుతుంటే పెరిగే ఉత్పత్తిని కొనుగోలు చేయటానికి ప్రజల ఆదాయాలు పెరగాలి. ప్రజల ఆదాయాలు పెరగాలంటే పెట్టుబడిదారుల లాభాలు తగ్గాలి. ప్రభుత్వం పెట్టుబడిదారుల నుండి పన్నుల రూపంలో ఎక్కువ డబ్బును వసూలు చేసి, సామాన్య ప్రజల అవసరాల కోసం ఖర్చు చేయాలి. కాని ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా బడా పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీల లాభాలను పెంచే విధానాలను అనుసరిస్తున్నది. ప్రజలకు ప్రయోజనం కలిగించే విధానాలను అమలు చేయటానికి సిద్ధం కావటం లేదు.

### ఆదాయం రాకుండా బిగగట్టి, పన్నుల ద్వారా పిండుతున్న ప్రభుత్వం

ఆదాయాలను పెంచుతామని మోడి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నది. కార్మికులు, రైతులు, మేధావులు, ఇతర వృత్తిదారులు తదితర సమస్త శ్రమజీవులు ఉత్పత్తి చేస్తున్న అదనపు విలువలో సింహభాగం పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నది. ఉత్పత్తి చేసిన సంపదను పెట్టుబడిదారులకు తరలిస్తున్న మార్గాలలో కొన్ని ఈ విధంగా ఉన్నాయి. మోడి ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించింది. కార్పొరేట్ టాక్స్ తగ్గిన మేరకు ప్రభుత్వానికి తగ్గే ఆదాయాన్ని పేదలపై వేసిన పన్నుల ద్వారా భర్తీ చేస్తున్నారు. అట్టడుగు స్థాయి ఆదాయాలు వస్తున్న 50 శాతం మంది వద్ద నుండి జిఎస్‌టిలో దాదాపు 64 శాతం వసూలు చేస్తున్నారు. అత్యధిక ఆదాయం పొందుతున్న 10 శాతం మంది నుండి 4 శాతం మాత్రమే వసూలు చేస్తున్నారు. ఆదాయాన్ని కట్టబెట్టే విధానాలతో పాటు పన్నుల ద్వారా కూడా పెద్దవారి సంపద కదలకుండా, పేదలను ఎలా పీల్చిపిప్పి చేస్తున్నారో ఈ లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.

2014లో 109 మంది మాత్రమే ఉన్న డాలరు శత కోటీశ్వరుల (8,500 కోట్ల రూపాయలు, అంతకన్నా ఎక్కువ ఉన్నవారు) సంఖ్య 2023 నాటికి 259 మందికి పెరిగింది. 2024కు, ఒక సంవత్సరంలో 334కు పెరిగింది. సంవత్సర కాలంలో 75 మంది, దాదాపుగా 30 శాతం పెరిగారంటే ఈ పెరుగుదల ఎంత వేగంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వీరితో పాటు 1,000 కోట్ల రూపాయలకు పైగా సంపద ఉన్నవారు 1,539 మంది ఉన్నారని పేర్కొన్నారు. శత కోటీశ్వరుల సంఖ్యతో పాటు దరిద్రుల సంఖ్య కూడా పెరుగుతున్నది. 2020-22 మధ్య కాలంలో రోజూ కడుపు నిండా తినలేని భారతీయుల సంఖ్య 19 కోట్ల నుండి 35 కోట్లకు పెరిగింది. 2021లో 74.1 శాతం భారతీయులు తాము ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన ఆహారాన్ని తినటం లేదని అధ్యయనాలలో వెల్లడైంది.

దీనితో పాటు గనులు, అడవులు, పరిశ్రమలు, రోడ్లు, వ్యవసాయం, నదులు, సముద్రాలు, మొత్తంగా భూమి, ఆకాశాలను ప్రభుత్వం దేశ, విదేశీ బడా పెట్టుబడిదారుల చేతులలో పెడుతున్నది. ప్రకృతి వనరులపై ప్రజలు శ్రమ చేస్తే ఆ శ్రమ నుండి సంపద ఉత్పత్తి అవుతుంది మినహా ప్రభుత్వాలు,

> **"ప్యూ రిసెర్చ్ సెంటర్ 2021లో నిర్వహించిన అధ్యయనంలో దేశంలో ఉన్న ప్రజలలో 120 కోట్లమందికి తక్కువ ఆదాయం, 6.6 కోట్లమందికి మధ్యస్థాయి ఆదాయం, 1.6 కోట్లమందికి ఉన్నత మధ్య తరగతి స్థాయి ఆదాయం, 20 లక్షల మందికి మాత్రమే అత్యధిక ఆదాయం వస్తున్నదని వెల్లడించింది. అంటే 140 కోట్లమంది ప్రజలలో 120 కోట్లమందికి కొనుగోలు శక్తి అత్యంత హీనంగా ఉన్నదని ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది."**

పెట్టుబడిదారులు చెప్పే దంబర మాటలతో సంపద పెరగదు. ప్రకృతి వనరులకు ప్రజల శ్రమను తోడు చేసి, సంపదను సృష్టించటానికి బిజెపి ప్రభుత్వం పూనుకోవటం లేదు. అన్నింటినీ బడా పెట్టుబడిదారులకు అప్పగిస్తూ, వారే సంపదలను సృష్టిస్తారని మభ్యపెడుతున్నది. ఈ ముసుగులో ప్రజల శ్రమ ఫలితంలో అత్యధిక భాగాన్ని బడా పెట్టుబడిదారుల పరం చేస్తున్నది.

ఒక శాతం ధనికుల చేతిలో దేశంలోని సంపదలలో 40.1 శాతం కేంద్రీకృతం అయ్యాయి. 5 శాతం ధనికుల చేతులలో 60 శాతంకు పైగా సంపద ఉన్నది. దిగువ నున్న 50 శాతం మంది వద్ద 3 శాతం సంపద మాత్రమే ఉన్నది. 2012-21 సంవత్సరాల మధ్య దేశంలో ఉత్పత్తి అయిన అదనపు విలువలో 40 శాతం ఒక శాతంగా ఉన్న ధనికుల చేతుల్లోకి చేరింది. దిగువనున్న 50 శాతం ప్రజల వద్దకు 3 శాతం మాత్రమే చేరింది. బ్రిటిష్ వారు మన దేశాన్ని పాలిస్తున్న కాలంలో ఆదాయ అసమానతలు అత్యున్నత స్థాయికి చేరాయి. 1939-40లలో దేశ ఆదాయంలో 20.7 శాతం 1 శాతం ధనికుల వద్దకు చేరింది. స్వాతంత్ర్యానంతరం ఈ అసమానత కొంత మేరకు తగ్గుముఖం పట్టింది. 1982 వరకు ఆదాయ అసమానతలు భారీ స్థాయిలో పెరగలేదు. 1990వ దశాబ్దంలో సరళీకరణ విధానాల అమలు ప్రారంభం అయింది. ఆ విధానాల ఫలితంగా సంపద కేంద్రీకరణ కూడా పెరిగింది. నరేంద్రమోడి అధికారంలోకి వచ్చిన 2014 నుండి ఈ విధానాలను మరింత వేగంగా అమలు చేయటంతో ఆదాయ అసమానతలు తీవ్రమైనాయి. ప్రపంచంలోనే ఎక్కువ ఆదాయ అసమానతలున్న దేశాలుగా దక్షిణాఫ్రికా, బ్రెజిల్, రష్యాలు ఉండగా, ఆ దేశాలలో కన్నా మన దేశంలోనే అత్యధిక ఆదాయ అసమానతలున్నాయి. ఈ ఆదాయ అసమానతలకు స్త్రీ, పురుషుల ఆదాయా లలోని అసమానతలు కూడా తోడవుతున్నాయి. ఆక్స్‌ఫాం అధ్యయనం ప్రకారం దేశంలో పురుషులకు వస్తున్న వేతనంలో స్త్రీలకు 63 శాతం మాత్రమే వస్తున్నది. ఆదాయంలో దిగువస్థాయిలో ఉన్న కుటుంబాలన్నింటిలోనూ పని చేస్తున్న స్త్రీలు తక్కువ ఆదాయం పొందటం ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావం వేస్తున్నది.

ప్యూ రిసెర్చ్ సెంటర్ 2021లో నిర్వహించిన అధ్యయనంలో దేశంలో ఉన్న ప్రజలలో 120 కోట్లమందికి తక్కువ ఆదాయం, 6.6 కోట్లమందికి మధ్యస్థాయి ఆదాయం, 1.6 కోట్లమందికి ఉన్నత మధ్య తరగతి స్థాయి ఆదాయం, 20 లక్షల మందికి మాత్రమే అత్యధిక ఆదాయం వస్తున్నదని వెల్లడించింది. అంటే 140 కోట్లమంది ప్రజలలో 120 కోట్లమందికి కొనుగోలు శక్తి అత్యంత హీనంగా ఉన్నదని ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది.

ఆదాయంలో అసమానతలు పెరగటంతో పాటు తక్కువ ఆదాయం వస్తున్న ప్రజలు విద్య, వైదం కోసం తమ ఆదాయంలో అత్యధిక మొత్తాలను ఖర్చు చేయాల్సి వస్తున్నది. వైద్యం కోసం చేస్తున్న ఖర్చుల వలన ప్రతి సంవత్సరం 6.3 కోట్లమంది భారతీయులు దరిద్రంలోకి జారిపోతున్నారని కూడా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. విద్యపై పెరుగుతున్న ఖర్చులు కూడా ఇటువంటి పరిణామాలకే దారి తీస్తున్నాయి. ఈ విధంగా అన్ని విధాలుగా ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోవటంతో పారిశ్రామికాభివృద్ధికి ఊతం లభించటం లేదు. ఇది దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నది.

### పెట్టుబడిదారుల లాభాల దాహానికి అంతుంటుదా?

పెట్టుబడిదారుల లాభాల దాహానికి అంతుండదు. పెట్టుబడిపై 50 శాతం లాభం వచ్చినా, 100 లేక 500 శాతం లాభం వచ్చినా ఇంకా ఇంకా లాభాలను పెంచుకోవటం కోసం వారు వెంపర్లాడతారు. ఇది పెట్టుబడిదారుల స్వత:సిద్ధ లక్షణం. పెట్టుబడిదారులకు ఎక్కువ లాభాలు రావాలన్నా, లాభాల శాతం పెరగాలన్నా ఎక్కువ సరుకులను ఉత్పత్తి చేయాలి. ఎక్కువ చౌకగా ఉత్పత్తి చేయాలి. మార్కెట్‌లో ఎక్కువెక్కువగా తమ సరుకులను అమ్ముకోవాలి. కాని మనదేశంలోని బడా పెట్టుబడిదారులు వీటిలో ఏ ఒక్కటీ సక్రమంగా చేయటం లేదు. సరుకులను పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేయటం లేదు. సరుకులను ఉత్పత్తి చేస్తే వాటిని మార్కెట్‌లో అమ్ముకోవాలి. పెట్టుబడిదారులు తమ సరుకులు అమ్ముకోవాలంటే ప్రజలు వాటిని కొనాలి. కొనాలంటే వారి వద్ద డబ్బులు ఉండాలి. కాని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన వివిధ తరగతుల ప్రజల ఆదాయాలు తగ్గిపోతున్నాయి. ప్రజల ఆదాయాలు పెరుగుతుంటే సరుకులు కొనగలరు కాని ఆదాయాలు తగ్గుతుంటే సరుకులు కొనటం ఏ విధంగా సాధ్యమౌతుంది?


### సరుకుల ఉత్పత్తి ఖర్చు ఎలా తగ్గుతుంది?

సరుకులను చౌకగా తయారు చేయటానికి కూడా పెట్టుబడిదారులు తగినంతగా ప్రయత్నం చేయటం లేదు. సరుకులను ఇతర పెట్టుబడిదారుల కన్నా, ఇతర దేశాల కన్నా తక్కువకు ఉత్పత్తి చేయాలంటే సరుకుల ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవాలి. సరుకుల ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవటానికి కార్మికుల చేత ఎక్కువ గంటలు పని చేయించటం ద్వారా వారి సంఖ్యను తగ్గించుకోవచ్చునని, తద్వారా వారికిచ్చే కూలి కూడా తగ్గుతుందని, ఆ విధంగా సరుకుల ఉత్పత్తి ఖర్చు తగ్గుతుందని మన దేశంలోని బడా పెట్టుబడిదారులు హ్రస్వదృష్టితో ఆలోచనలు చేస్తున్నారు. అందువలననే మనదేశంలోని బడా పెట్టుబడిదారులు కార్మికులు వారానికి 70 గంటలు పని చేయాలని ఒకరంటే, 90 గంటలు పని చేయాలని మరొకరు చెబుతున్నారు. మిగతా పెట్టుబడిదారులెవరూ దీనిని వ్యతిరేకించటం లేదు. కార్మికుల చేత వారానికి 90 గంటలు పని చేయించు

కోవటానికి పెట్టుబడిదారులంతా ఉవ్విళ్ళూరుతున్నారని స్పష్టమౌతున్నది.

ఇతర పెట్టుబడిదారుల నుండి ఎదురౌతున్న పోటీలో నెగ్గటానికి సరుకుల ఉత్పత్తి ఖర్చును తగ్గించుకోవటానికి, మరింత చౌకగా, నాణ్యంగా సరుకులను ఉత్పత్తి చేయటానికి పెట్టుబడిదారులు నిరంతరం ప్రయత్నం చేస్తుంటారు. ఇందుకోసం వారు సరుకుల ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకులను తక్కువ ధరలకు కొనుగోలు చేయటానికి, కార్మికుల శ్రమ ఉత్పాదకతను పెంచటం ద్వారా తక్కువ శ్రమతో ఎక్కువ సరుకులను ఉత్పత్తి చేయటానికి మార్గాలను అన్వేషిస్తుంటారు. పరిశోధనల ద్వారా నూతన ఆవిష్కరణలు చేయటం, శాస్త్ర–సాంకేతికాభివృద్ధిని సాధించటం, మరింత మెరుగైన యంత్రాలను తయారు చేయటం ద్వారా సరుకుల తయారీకి అవసరమైన శ్రమ కాలాన్ని తగ్గిస్తుంటారు. ఆ విధంగా సరుకుల ఉత్పత్తి ఖర్చును తగ్గించుకున్న వారు పోటీలో నెగ్గటంతో పాటు, అధిక లాభాలను కూడా సంపాదిస్తుంటారు. నూతన ఆవిష్కరణలు చేయటంలో వెనుకబడిన పెట్టుబడిదారులు పోటీకి తట్టుకోలేరు. ఎక్కువ లాభాలు సంపాదించలేరు.

> "మనదేశంలోని పెట్టుబడిదారులు ఈ పోటీలో వెనుకబడిపోయారు. ఎక్కువ మంది పెట్టుబడిదారులు దిగుమతి అవుతున్న విదేశీ సరుకులను తట్టుకొని, దేశంలోని పరిమితమైన మార్కెట్లో తమ సరుకులను అమ్ముకోగల పరిస్థితిలో లేరు. ప్రపంచ మార్కెట్లోనూ అమ్ముకోలేరు. అందువలన ప్రభుత్వం వారికి అనుకూలమైన విధానాలను అనుసరిస్తే మినహా మార్కెట్‌లో నిలబడగల పరిస్థితి లేదు."



భారత దేశంలో ఆదాయ అసమానతలకు నిదర్శనం ముంబయిలోని ఈ ప్రాంతం

మనదేశంలోని పెట్టుబడిదారులు ఈ పోటీలో వెనుకబడిపోయారు. ఎక్కువ మంది పెట్టుబడిదారులు దిగుమతి అవుతున్న విదేశీ సరుకులను తట్టుకొని, దేశంలోని పరిమితమైన మార్కెట్లో తమ సరుకులను అమ్ముకోగల పరిస్థితిలో లేరు. ప్రపంచ మార్కెట్లోనూ అమ్ముకోలేరు. అందువలన ప్రభుత్వం వారికి అనుకూలమైన విధానాలను అనుసరిస్తే మినహా మార్కెట్‌లో నిలబడగల పరిస్థితి లేదు. తమ చేతగానితనాన్ని, ప్రభుత్వ విధానాల దుష్ఫలితాలను కార్మికులపై నెట్టి, వారు ఎక్కువ గంటలు పనిచేయాలని ప్రచారం చేస్తున్నారు.

**పరిశోధన అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి**

అభివృద్ధిలో వెనుకబడుతున్న మనం వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా లాంటి దేశాలను చూసి నేర్చుకోవాలి. ఈనాడు చైనా ప్రపంచ వస్తూత్పత్తి కర్మాగారంగా మారటంతో పాటు సాంకేతిక అభివృద్ధి, పరిశోధనలలో అమెరికాతో పోటీపడుతున్నది. చైనాలో ఉత్పత్తి అవుతున్న అనేక సరుకులతో ప్రపంచంలోని ఏ దేశం పోటి పడగల స్థితిలో లేదు. దీనిని వారు కార్మికుల చేత ఎక్కువ గంటలు పని చేయించటం ద్వారా సాధించలేదు. చైనాలో ఎనిమిది గంటల పనిదినం అమలులో ఉంది. వారంలో ఐదు రోజులే పనిచేస్తారు. వారానికి 40 గంటలు పనిదినం అమలు జరుపుతూనే సరుకులను ఇంత చౌకగా ఎలా ఉత్పత్తి చేస్తున్నారనేది మన ప్రభుత్వం, పెట్టుబడిదారులు అధ్యయనం చేయాలి. పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయటం కోసం వారు చేస్తున్న ఖర్చును, కృషిని ఆదర్శంగా తీసుకోవాలి. కొన్ని రంగాలలో అమెరికాను, అభివృద్ధి చెందిన దేశాలను తలదన్నేలా చేస్తున్న నూతన ఆవిష్కరణల నుండి పాఠాలు నేర్చుకోవాలి.

ప్రజల కొనుగోలు శక్తిని పెంచటం, అంతర్గత మార్కెట్‌ను విస్తరింప జేసుకోవటం అభివృద్ధిలో కీలకమైనది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత చైనాపై అధిక సుంకాలను విధిస్తే, వారు అంతర్గత మార్కెట్‌ను విస్తరింపజేసుకోవటంపై దృష్టి పెట్టారు. అమెరికాను పక్కన పెట్టి, ఇతర దేశాలలో మార్కెట్లను విస్తరింపజేసుకోవటానికి కృషి చేస్తున్నారు. అంతర్గత, అంతర్జాతీయ మార్కెట్ల విస్తరణ ద్వారా అమెరికా సుంకాల ప్రభావాన్ని అధిగమిస్తామని పూర్తి విశ్వాసంతో చెబుతున్నారు. మనం అదనపు సుంకాలపై అమెరికాను పల్లెత్తు మాట అనకుండా, వివిధ దేశాలపై ఏకపక్షంగా అమెరికా విధించిన ఆంక్షలను అమలు జరుపుతూ సాగిలబడ్డాం. మన వేలితో మనకన్ను పొడవటానికి అమెరికా ప్రయత్నం చేస్తుంటే దానిని వ్యతిరేకించకుండా, మన కన్ను మనమే పొడుచుకుంటున్నాం.

ఇటువంటి పరిస్థితులలో కనీసం అంతర్గత మార్కెట్‌ను విస్తరించుకోవటానికి అవసరమైన చర్యలనైనా తీసుకోవాలి. దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేసుకోకుండా ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదు. ఆర్థికాభివృద్ధి లేకుండా జిడిపి పెరుగుదల, ఐదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థికవ్యవస్థకు చేరటం, 2047 లక్ష్యాలు చిత్తు కాగితాలుగా మారతాయని అర్థం చేసుకోవాలి. అభివృద్ధి సాధన, ఆదాయాలను పెంచుకోవటం కోసం ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయటానికి సిద్ధం కావాలి.

❋

# జమ్మూ-కాశ్మీర్‌కు పూర్తి రాష్ట్రహోదా ఇచ్చి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి

**2019**, ఆగస్టు 5వ తేదీన తీసుకున్న రాజ్యాంగ వ్యతిరేక, వినాశకరమైన నిర్ణయాలతో–ఆర్టికల్ 370, 35ఎ రద్దు–పాటు నిరంకుశంగా తీసుకున్న అనేక నిర్ణయాలు, అవమానపరిచే చర్యలు చారిత్రాత్మక రాష్ట్రమైన జమ్మూ–కాశ్మీర్‌ను విభజించి, దాని స్థాయిని తగ్గించాయి. రాష్ట్ర హోదాను లాక్కోవటంతో పాటు రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించటం తీవ్రమైన రాజకీయ శూన్యంతో పాటు, ఆ రాష్ట్ర ప్రజలలో అనిశ్చితి, పరాయీకరణ భావనను పెంపొందించాయి.

పౌరస్వేచ్ఛ, మానవహక్కులు, ప్రజాస్వామ్య హక్కులు క్షీణిస్తున్నాయి. పిఎస్‌ఎ, యుఎపిఎ లాంటి క్రూరమైన చట్టాల కింద నిరంకుశంగా అరెస్టులు చేయటం ఆందోళన కలిగిస్తున్నది. జమ్మూ–కాశ్మీర్ లోపలా, వెలుపలా వందలాది మంది రాజకీయ నాయకులను, విలేకరులను వేధింపు లకు గురి చేస్తున్నారు. స్వల్ప అంశాలపై పాస్‌పోర్టులను స్థంభింప జేస్తున్నారు. సెక్యూరిటీ వెరిఫికేషన్ పేరుతో యువకులకు ఉద్యోగ అవకాశాలను నిరాకరిస్తున్నారు.

జమ్మూ–కాశ్మీర్‌కు మహారాజా హరిసింగ్ పాలనా కాలం నుండి భూముల రక్షణ, ఉద్యోగాలలో ప్రత్యేకమైన హక్కులున్నాయి. ఈ ప్రాంతంలో నివాసులు కాని వారిని ఇక్కడ భూములు కొనటానికి, ఉద్యోగాలు చేయటానికి అనుమతించలేదు. కొన్ని ఇతర రాష్ట్రాలలో కూడా ప్రజలకు ఈ విధమైన హక్కులు ఇస్తున్న అనేక నిబంధనలు ఉన్నాయి. జమ్మూ – కాశ్మీర్‌లో శాశ్వతంగా నివాసం ఉంటున్న వారికి భూములు, ఉద్యోగాలలో ఉన్న హక్కులను నిరంకుశంగా హరించటం ప్రజలలో అభద్రతను తీవ్రం చేసింది.

అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలను గురించి గొప్పగా చేసిన శుష్క వాగ్దానాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారిపోతున్నది. రోజువారి కూలీలకు కూలి సక్రమంగా చెల్లించటం లేదు. వ్యవసాయం, పండ్ల తోటలు, చేతివృత్తులు, రవాణా లాంటి కీలక రంగాలు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాయి. ఆపిల్ ఉత్పత్తిదారులు ప్రత్యేకమైన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస మద్దతు




ధర(ఎంఎస్‌పి)లు లాంటి చట్టబద్ధమైన రక్షణలు లేవు.

2019 ఆగస్టు నుండి నివాస చట్టాలకు మార్పులు చేయటం, మీడియాపై ఆంక్షలు, ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించటం సాధారణంగా మారాయి. ఈ విధమైన అణచివేత ఉన్నప్పటికీ ఏడు సంవత్సరాల విరామం తర్వాత ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలను మతపరంగా, ప్రాంతాల వారిగా విభజించాలని, ధనబలం, తనను బలపరచే కీలుబొమ్మల ద్వారా ఎన్నికల ఫలితాన్ని తనకు అనుకూలంగా తొత్తడం చేయాలని బిజెపి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వ విధానాలను ప్రజలు స్పష్టంగా తిరస్కరించారు. 2019, ఆగస్టు 5వ తేదీన జమ్మూ–కాశ్మీర్‌పై చేసిన రాజ్యాంగ వ్యతిరేక దాడి, ఆ తర్వాత జరుగుతున్న తీవ్రమైన అణచివేతను వ్యతిరేకిస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారు.

అయినప్పటికీ ప్రజాస్వామికంగా ఇచ్చిన తీర్పును గౌరవించకుండా బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దానిని దిగజార్చటానికి ప్రయత్నం చేస్తున్నది. రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని భారత ప్రభుత్వం పార్లమెంటుకు, సుప్రీంకోర్టుకు హామి ఇచ్చినప్పటికీ బిజెపి, అది నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్ ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి ఆటంకాలు కల్పిస్తున్నారు. జమ్మూ–కాశ్మీర్‌లో ఈ మధ్య పెద్దసంఖ్యలో అధికారుల స్థాయి ఉద్యోగులను బదిలీలు చేయటం ఆందోళన కలిగించటంతో పాటు ఎన్నికైన శాసనసభ అధికారాన్ని బలహీనపరుస్తున్నది.

ఇటువంటి పరిస్థితులలో పార్టీ 24వ మహాసభ ఈ దిగువ డిమాండ్లు చేస్తున్నది.

– రాష్ట్రానికి ప్రత్యేక హోదాను పునరుద్ధరించే క్రమంలో భాగంగా జమ్మూ–కాశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వాలి.

– భూమి, ఉద్యోగాలలో ఉన్న హక్కులను పరిరక్షించాలి.

–ప్రజాస్వామిక, పౌర, కార్మికసంఘాల హక్కులను పునరుద్ధరించాలి.

– రాజకీయ ఖైదీలను, విలేకరులను విడుదల చేసి, పత్రికా స్వాతంత్ర్యానికి గ్యారంటి ఇవ్వాలి.

– ఆధారాలు లేని ఆరోపణలతో యువతను విచక్షణారహితంగా అరెస్టులు చేయటాన్ని ఆపాలి.

జమ్మూ–కాశ్మీర్ ప్రజలకున్న రాజ్యాంగబద్ధమైన, న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం నిలబడాలని అన్ని లౌకిక, ప్రజాస్వామిక శక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

❋

ప్రజా సైన్సు ఉద్యమం ముందున్న సవాళ్లు -2

# మేధోహక్కులు, విజ్ఞాన ప్రైవేటీకరణ

**రఘునందన్**

ప్రజా సైన్స్ ఉద్యమ పనుల్లో మరో ప్రధానమైన అంశం విజ్ఞాన ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కృషి చేయడం. నిజానికి సైన్స్ ఉద్యమ ప్రారంభం, అంతకన్నా ముందు రోజుల్లో ఈ దిశలో కృషి జరిగింది. పేటెంట్లు, కాపీరైట్‌లు మొదలైన మేధో సంపత్తి సమస్యలపై మళ్లీ పని చేయాలి. పెట్టుబడిదారి ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో ఇవి గుర్తించదగిన లక్షణాలు. సృజనాత్మకతను, చౌరవను, వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి వీటిని ప్రారంభించినట్లు చెబుతారు. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు తమ ఆవిష్కరణలను ఇతరులు కాపీ కొట్టి వాటినే తయారు చేయకుండా చూసేలా రక్షించడానికి పేటెంట్ల విధానాన్ని తీసుకువచ్చారు. తొలి రోజుల్లో ఈ వ్యవస్థ వ్యక్తుల కోసం పనిచేసినప్పటికీ, ఆ తరువాత మేధో సంపత్తి యొక్క వర్గీకరణకు చేరింది. బడా కార్పొరేట్ సంస్థలు పరిశోధనల్లోకి ప్రవేశించి, వారి వాణిజ్య ఉత్పత్తులకు పేటెంట్లను ఉపయోగించుకున్నారు. దీంతో వాటి ప్రయోజనం పూర్తిగా మారిపోయింది. కంపెనీలు తమ ఉత్పత్తులపై ఎక్కువ కాలం గుత్తాధిపత్యం కలిగిఉండటానికి చట్టాలు అనుమతించాయి. ఇది విజ్ఞాన విస్తరణకు వ్యతిరేకంగా పనిచేసింది. అదే సమయంలో పోటీని అణచివేసినందున నూతన ఆవిష్కరణల ధరలకు రెక్కలు వచ్చాయి. ఉత్పత్తి చేసి, పేటెంట్ పొందిన సంస్థలకు లాభాలు వెల్లువలా వచ్చాయి. ఫలితంగా మేధో హక్కుల వ్యవస్థ స్వభావం సైన్స్, సాంకేతికతలకు వ్యతిరేకంగా మారింది. ఆవిష్కరణల ప్రయోజనాలు ఎక్కువ సంఖ్యలోని ప్రజలకు చేరకుండా అడ్డుకుంది. అనంతర కాలంలో మేధో హక్కులను వ్యక్తుల నుండి బడా కార్పొరేట్లు కొనడం మొదలు పెట్టడంతో ఈ వ్యవస్థ మరింతగా దిగజారింది.

ప్రస్తుతం ఈ వ్యవస్థ అత్యధిక లాభార్జనకు మార్గంగా మారింది. పెట్టుబడిదారులు తమకు లాభాలు తెచ్చే వస్తువుల ఉత్పత్తిని తక్కువగా చేయడంతో పాటు, అమ్మకాలను కూడా పరిమితంగా చేస్తారు. దీంతో అత్యధిక ధరలు నిర్ణయించడానికి వీలవుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ మేధో హక్కులను కలిగి ఉన్న సంస్థల గుత్తాధిపత్యాన్ని కాపాడేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. పెట్టుబడిదారీ దేశాలు రూపొందించిన చట్టాలను ప్రపంచమంతా పాటించేలా ఒత్తిడి తీసుకువస్తోంది. ఎఐపిఎస్ఎన్, ఢిల్లీ సైన్స్ ఫోరమ్, కెఎస్ఎస్‌పి వంటి భాగస్వామ్య సంస్థలు, ఎఫ్ఎంఆర్ఎఐ వంటి మెడికల్ రిప్రజెంటేటివ్‌ల సంఘాలు, వామపక్ష పార్టీలతో కలిసి పనిచేస్తూ యుపిఎ-1 హయంలో అమెరికా,. ప్రపంచ వాణిజ్య సంస్థలను నిరోధించేందుకు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చాయి. భారత ప్రభుత్వ రంగ సంస్థల, ప్రైవేటు సంస్థల ప్రయోజనాలనైనా పరిరక్షించేలా దేశీయ పేటెంట్ చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశాయి

యాపిల్, గూగుల్ వంటి ఐటి కంపెనీలు ఎటువంటి ఉత్పత్తులను తయారు చేయవు. కానీ, కార్పొరేట్ ప్రపంచంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి,. యాపిల్ సంస్థ తన ఐ ఫోన్‌లోని ఏ ఒక్క భాగాన్ని కూడా తయారుచేయదు. యాపిల్ ఐ ఫోన్లను తయారు చేసే ఫాక్స్‌కాన్ సంస్థకు భారతదేశంలో ఒక్క సెమీ కండక్టర్ యూనిట్ కూడా లేదు. కీలకమైన చిప్‌ల తయారీ గురించి ఆ సంస్థకు ఎటువంటి జ్ఞానం లేకపోవడమే దీనికి కారణం

మేధో హక్కులు నేడు అనేక రంగాలకు విస్తరించాయి. వ్యాపారం ఎలా చేయాలన్న దానిపై కూడా పేటెంట్ పొందారు. వివిధ సమూహాలు, తెగలకు చెందిన ప్రజలు పెంచి పోషించిన జీవ వనరులపై కూడా ప్రపంచస్థాయి సంస్థలు హక్కులు పొందుతున్నాయి. ఇటీవలే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జీవ వైవిధ్య బిల్లును ఆమోదించింది. దీనిలోమూలికా ఔషదాలతో వ్యాపారం చేయడానికి సులభతర పద్ధతుల్లో అనుమతులు ఇస్తామని పేర్కొంది. ఇది గిరిజనులకు తరతరాలుగా వస్తున్న సాంప్రదాయ జ్ఞానాన్ని హరించి, వారి హక్కులను విస్మరించడమే. దీనివల్ల అటవీ ప్రాంతంలోని సాంప్రదాయ వనరులు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. ఎఐపిఎస్ఎన్‌తో పాటు దాని సభ్య సంస్థలు మేధో హక్కు సమస్యలు, ప్రపంచ చట్టాలు, అంతర్జాతీయ వాణిజ్యం తదితర అంశాలను నిశితంగా పరిశీలిస్తాయి. విజ్ఞానంపై గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా ఇతర పౌర సమాజంలోని సంస్థలతో కలిసి పనిచేస్తాయి. ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్ ఉద్యమానికి ఎఐపిఎస్ఎన్ మద్దతు ఇస్తుంది. వ్యాపార నమూనాలు, ఇతర సాంకేతికతలు వేగంగా మారుతున్న ప్రస్తుత సమయంలో ఎఐపిఎస్ఎన్‌లోని అంకిత భావం గల కార్యకర్తలు ఆ పరిణామాలను ఎప్పటికపుడు తెలుసుకోవాలి. తమ సంస్థలను ముందుండి నడిపించాలి. కార్మిక, పౌర సంఘాలు, వామపక్ష పార్టీలతో కలిసి విజ్ఞానాన్ని, సాంకేతికతను ఉమ్మడి ప్రయోజనాలుగా కొనసాగించడానికి కృషి చేయాలి.

### పర్యావరణం..వాతావరణమార్పులు

పెట్టుబడిదారి విధానం పర్యావరణాన్ని కూడా తీవ్ర స్థాయిలో విధ్వంసం చేస్తోంది. సైన్స్, సాంకేతికతను దుర్వినియోగం చేయడం ద్వారా ఈ వినాశనం సంభవిస్తోంది. ఆ కారణం చేతనే ప్రజాసైన్స్ ఉద్యమం దీనిపై దృష్టి సారిస్తోంది. పెట్టుబడిదారులు భూమిపైనా, వాతావరణంలోని సహజ పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నారు. ఫలితంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పులు భూగోళాన్ని ఒక ప్రమాదకర దశకు చేర్చాయి. ఈ మార్పులు మానవాళిని కోలుకోలేని విధంగా దెబ్బతీయడంతో పాటు భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితిని సృష్టించవచ్చు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ విపరీత ప్రభావాలను తట్టుకునే శక్తి లేదు. ప్రపంచవ్యాప్తంగా జంతువులు, వృక్షజాతులు వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇప్పటికే అనుభవిస్తున్నాయి.

పారిశ్రామిక యుగం ముఖ్యంగా వలస రాజ్యాల కాలం నుండి పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా సంచరించడం ప్రారంభమైంది. అభివృద్ధి చెందిన దేశాలు తమ గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాల కోసం

❝ ఇతర పర్యావరణ సమస్యలు కూడా దేశాన్ని, ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. జీవనోపాధి కోసం సహజవనరులపై ఆధారపడిన రైతులు, గిరిజనులు, అటవీ ప్రాంతాల్లో నివసించే ఇతరులు, మత్స్యకారులు, వివిధ రకాల జంతువుల పెంపకం దారులు ఈ సమస్యల కారణంగా తీవ్రంగా దెబ్బతిం టున్నారు. పెట్టుబడిదారులు విచ్చల విడిగా వనరులను ధ్వంసం చేయడం దీనికి కారణం. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత ఈ ప్రక్రియ మరింత జోరందుకుంది. ❞

వాతావరణాన్ని డంపింగ్‌యార్డుగా మార్చాయి. అదే సమయంలో భారీ లాభాలను ఆర్జించాయి. అయితే, ఈ ప్రభావంతో తలెత్తిన వాతావరణ సంక్షోభం పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు భయానకంగా మారింది. ఈ దేశాలు ఎక్కువ భారాన్ని మోస్తున్నాయి. నష్టాల నుండి బయటప డేందుకు భారీగా ఖర్చు చేయాల్సివస్తోంది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో సుదీర్ఘంగా జరిగిన వాతావరణ చర్చలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అన్యాయమైన ఈ భారాన్ని కొంతైనా తగ్గించుకోవడానికి అవకాశం కల్పించాయి. అమెరికాతో పాటు పాశ్చాత్య దేశాలు అనుసరిస్తున్న దుర్మార్గమైన వైఖరిని ఎఐపిఎస్‌ఎన్ తన సభ్యసంస్థలు, మేధావులు, విద్యావేత్తలతో కలిసి బట్టబయలు చేసింది. భూతాపాన్ని తగ్గించేందుకు పారిస్ ఒప్పందం ఆదేశాన్ని ఉల్లంఘిస్తున్న తీరును ప్రచారం చేశాం. ఈ కృషి కొనసాగాలి. ఈ సమస్యను మరింతగా అర్థం చేసుకునేందుకు కృషిని కొనసాగించాలి. సమస్యను ఎదుర్కోవడంలో జాతీయంగా, అంతర్జాతీయంగా పరస్పర అవగాహన పెంపొందించుకోవడం, ఉమ్మడిగా పనిచేయడం వంటివి చేయాలి. సామాజికంగా, న్యాయపరంగా, ఆర్థికంగా సమానమైన, స్థిరమైన పర్యావరణం వైపు ప్రపంచక్రమాన్ని పయనింప చేయడం ద్వారా పెట్టుబడిదారి వ్యవస్థను ఎదుర్కొని, ఈ సమస్యను అధిగమించవచ్చు.

వాతావరణ మార్పులు భారతదేశంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భారీ వర్షం కొండచరియలు విరిగిపడటం, పట్టణాలను సైతం ముంచెత్తే వరదలు, వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపేలా అతివృష్టి, అనావృష్టిలు. తీర ప్రాంత కోత, సముద్ర మట్టాల పెరుగుదల వంటివి తీవ్ర నష్టాన్ని కలుగచేస్తున్నాయి. వీటిని పరిశీలించి, నష్టాన్ని సాధ్యమైనంత మేర తగ్గించేందుకు అవసరమైన చర్యలను కేంద్ర ప్రభుత్వంతో పాటు అనేక రాష్ట్రాల ప్రభుత్వాలు తీసుకోవడం లేదు. ఈ నేపథ్యం లో మనం ఈ ప్రభావాలను క్రమబద్ధంగా అధ్యయనం చేయడంలో కీలకపాత్ర పోషించాలి. సమస్యలను పరిష్కరించడానికి ప్రతిపాదనలు తయారు చేయడంలోనూ, తగిన విధానాలు తయారుచేసి అమలు చేయడానికి ఉద్యమాలు రూపొందించడానికి కృషి చేయాలి. విద్యావేత్తలు, మేధావులతో కలసి విస్తృత ఫ్రంట్‌లు ఏర్పాటు చేసి అటువంటి ఉద్యమం వైపు అడుగులు వేయాలి.

ఇతర పర్యావరణ సమస్యలు కూడా దేశాన్ని, ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. జీవనోపాధి కోసం సహజవనరులపై ఆధారపడిన రైతులు, గిరిజనులు, అటవీ ప్రాంతాల్లో నివసించే ఇతరులు, మత్స్యకారులు, వివిధ రకాల జంతువుల పెంపకం దారులు ఈ సమస్యల కారణంగా తీవ్రంగా దెబ్బతిం టున్నారు. పెట్టుబడిదారులు విచ్చల విడిగా వనరులను ధ్వంసం చేయడం దీనికి కారణం. 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత ఈ ప్రక్రియ మరింత జోరందుకుంది. సులభతర వ్యాపారం పేరిట పర్యావరణాన్ని విచ్చలవిడిగా దెబ్బతీసేందుకు కార్పొరేట్లకు అనుమతి ఇచ్చారు. చట్టాలన్నింటినీ నీరుగార్చారు. ఫలితంగా అడవులను, సముద్రాలను కార్పొరేట్లు విధ్వంసం చేస్తున్నారు. అటవీసంపదతో పాటు, సముద్రాలలోని మత్స్యసంపదను సమూలంగా దోచుకుంటు న్నారు. భూమిని, వాతావరణాన్ని, నదులను, సముద్రాలను కాలుష్యంతో నింపుతున్నారు. ఈ ధోరణిని ఎఐపిఎస్‌ఎన్ గట్టిగా ప్రతిఘటించాలి. బాధిత ప్రజల అభిప్రాయాలను సమీకరించాలి. ఈ వినాశకరమైన విధానాన్ని ప్రతిఘటించేందుకు విస్తృత పోరాటాలను నిర్మించాలి.

భోపాల్ గ్యాస్ దుర్ఘటన అనంతరం ప్రజాసైన్స్ ఉద్యమం, ఇతర ఎన్‌జిఓలు చేసిన కృషితో అనేక నిబంధనలు అమలులోకి వచ్చినప్పటికీ, వాటి ఉల్లంఘన, హానికర పదార్థాల దుర్వినియోగం విచ్చల విడిగా సాగుతోంది. పారిశ్రామిక కాలుష్యం అవధులు లేకుండా పెరగుతోంది. ఈ నేపథ్యంలో ఎఐపిఎస్‌ఎన్‌తో పాటు సభ్య సంస్థలు ఈ తరహా సంఘటనలపై ఇటీవల కాలంలో దృష్టి సారిస్తున్నాయి. ఈ కృషిని కొనసాగించాలి. మరింతగా పట్టు సాధించాలి. పార్టీ సభ్యుల సామర్థ్యాలను మెరుగుపరచాలి.

**విద్య**

ప్రజా సైన్స్ ఉద్యమంలో విద్య అనేది చాలా కాలంగా ఒక కీలకాంశంగా ఉంది. విద్య విస్తృత పరిధిలోకే సైన్స్– సాంకేతికత, సైన్స్ ప్రచారం తదితర అంశాలు వస్తాయి. కెఎస్‌ఎస్‌పి పని మాతృభాషపై దృష్టి పెట్టిన ప్రారంభ రోజులకు తిరిగి వెడుతుంది. పాఠశాలల్లో విజ్ఞానశాస్త్ర బోధనలో ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించడంలో ఏకలవ్య నైపుణ్యతను పొందింది. వినూత్న బోధన, పాఠ్యాంశాలు, పుస్తకాలు, బోధనా సామాగ్రి, ఉపాధ్యాయులకు శిక్షణ వంటి అంశాలనే ఏకలవ్య రూపొందించింది. హోషింగాబాద్‌లో సైన్స్ బోధన ఒక కార్యక్రమంగా చేపట్టిన ఆ సంస్థ, మధ్యప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో సైన్స్ బోధనను నిర్వహిస్తోంది.

1987లో ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్, భారత్ జన విజ్ఞాన యాత్రను విజయవంతంగా నిర్వహించింది. ఆ స్ఫూర్తితో 1990లో భారత జ్ఞాన విజ్ఞాన జాతను నిర్వహించింది. అప్పటి నుండి ప్రజా సైన్స్ ఉద్యమంలో విద్య కీలకస్థానంలో నిలిచింది. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో ప్రజాసైన్స్ ఉద్యమం మమేకమైంది. మారుమూల గ్రామాలకు కూడా వెళ్లి సైన్స్ ఉద్యమ కార్యకర్తలు పనిచేశారు. ఈ కృషి దాదాపుగా దేశమంతా సాగింది. ఆ తరువాత కాలంలో సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమమే కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాతీయ అక్షరాస్యత ఉద్యమం (నేషనల్ లిటరసీ మిషన్ –ఎన్‌ఎల్‌ఎం)గా ఆవిర్భవించింది. భారత జ్ఞాన్ విజ్ఞాన్ సమితి (బిజివిఎస్) ద్వారా ఈ కార్యక్రమాన్ని సైన్స్ ఉద్యమం నిర్వహించింది. వేలాది మంది ఉపాధ్యాయులు, వాలంటీర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. బిజివిఎస్ కేంద్రంగా సైన్స్ ఉద్యమ సంస్థలు

అనేక రాష్ట్రాల్లో ఏర్పడ్డాయి. సైన్స్ ఉద్యమం బలహీనంగా ఉన్న హిందీ రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమం ద్వారా లక్షలమందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాం.

వివరంగా కాకపోయినప్పటికీ కొన్ని అంశాలను ప్రస్తావించాలి. అక్షరాస్యత కార్యక్రమాలతో ఉన్న ప్రమేయం క్రమేణా అక్షరాస్యత అనంతర కార్యక్రమాలకు దారి తీసింది. నూతన అక్షరాస్యులకు బోధనను కొనసాగించడం, వయోజనవిద్య, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంచడం వంటి కార్యక్రమాలకు విస్తరించింది. ఈ కార్యక్రమాలకు క్రమేణా ప్రభుత్వ మద్దతు తగ్గినప్పటికీ సైన్స్ కార్యకర్తల కృషి మాత్రం కొనసాగింది. ప్రాథమిక ఆరోగ్యం, ఆరోగ్యసంరక్షణ అవగాహన, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఇలా ప్రజల సామూహిక భాగస్వామ్యం గల అనేక కార్యక్రమాలు ఎఐపిఎస్ఎన్‌కు ప్రధానాంశాలుగా మారాయి. వీటిద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత సంబంధాలు ఏర్పడ్డాయి. పెద్ద సంఖ్యలో వాలంటీర్లు, సైన్స్ సంఘాలు ఏర్పాటయ్యాయి. ఆ సంబంధాలను కొనసాగించడం, సమన్వయం సాధించడం, సమీకృతం చేసి నూతన సామర్థ్యాలను పెంచాల్సిన కర్తవ్యం భవిష్యత్‌లో కీలకంగా మారనుంది.

విద్యారంగంలో ప్రజాసైన్స్ ఉద్యమానికి ఉన్న చారిత్రిక అనుబంధం 2020లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టిన నూతన విద్యావిధానం (నేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్-ఎన్ఇపి) కు వ్యతిరేకంగా ఎఐపిఎస్ఎన్‌ను ముందంజలో నిలిపింది. విద్య, వైద్యం వంటి సామాజిక సేవా రంగాల నుండి ప్రభుత్వం క్రమేణా తప్పుకోవడాన్ని సైన్స్ ఉద్యమం చాలా కాలంగా విమర్శిస్తోంది. వ్యతిరేకంగా ప్రచారం చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం, పాఠశాల స్థాయి నుండి ఉన్నతవిద్య వరకు ప్రైవేటీకరించడం. విద్యను వ్యాపార వస్తువుగా చేయడం వంటి చర్యలు ఎన్ఇపితో మరింత తీవ్రం కాను న్నాయి. పరిణామ సిద్ధాంతంతో పాటు జీవశాస్త్రానికి సంబంధించిన అంశాలు, పర్యావరణ పాఠాలు, చరిత్రలో కొన్ని అంశాలను మాధ్యమిక విద్య స్థాయి నుండి ఉన్నతస్థాయి వరకు తొలగించడం ద్వారా విద్యను కాషాయికరించడం కూడా బిజెపి ప్రభుత్వ నూతన విద్యావిధానంలో భాగమే. దీనికి వ్యతిరేకంగా సైన్స్ ఉద్యమం ప్రస్తుతం విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాలు, పౌరసమాజంలోని మేధావులు ఎన్‌జిఓలతో పాటు కలిసివచ్చే ఇతరలను కలుపుకుని అఖిల భారత స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వ విద్యపై పెద్ద దాడిగా కేంద్ర ప్రభుత్వ చర్యలను ఎఐపిఎస్ఎన్ భావిస్తోంది. ఈ చర్యల వల్ల ప్రభుత్వ విద్యాసంస్థలు ఒకవైపు మూతపడుతుండగా, లాభాల కోసం నడిచే కార్పొరేట్ విద్యా సంస్థలు పెద్ద ఎత్తున ఏర్పడుతాయి. ఫలితంగా చదువును మధ్యలోనే మానివేసే వారి సంఖ్య పెరుగుతుంది. పేద, ధనిక వ్యత్యాసాలు పెరుగుతాయి. దేశ అభివృద్ధిలో విద్యతో పాటు విజ్ఞానశాస్త్ర ప్రాధాన్యత కూడా తగ్గుతుంది.

> **ఆరోగ్య రంగంపై కూడా ఎఐపి ఎస్ఎన్ మొదటినుండి పనిచేస్తోంది. సైన్స్ ఉద్యమ సంస్థలు, పార్టీ నేతృత్వంలోని వైద్యుల సమూహాలు, మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఇతరులతో కలిసి ఔషధరంగంలో ప్రజానుకూల చర్యల కోసం 1980వ దశకంలో కృషి చేయడం ప్రారంభించారు. ఔషధాల అధిక ధరలు, గుత్తాధిపత్యం, పేటెంట్లు, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సంవత్సరాల తరబడి సాగిన కృషి అనేక రాష్ట్రాల్లో నెట్‌వర్క్‌గా ఏర్పడటానికి దారి తీసింది.**

### ఆరోగ్యం

ఆరోగ్య రంగంపై కూడా ఎఐపి ఎస్ఎన్ మొదటినుండి పనిచేస్తోంది. సైన్స్ ఉద్యమ సంస్థలు, పార్టీ నేతృత్వంలోని వైద్యుల సమూహాలు, మెడికల్ రిప్రజెంటేటివ్‌లు ఇతరులతో కలిసి ఔషధరంగంలో ప్రజానుకూల చర్యల కోసం 1980వ దశకంలో కృషి చేయడం ప్రారంభించారు. ఔషదాల అధికధరలు, గుత్తాధిపత్యం, పేటెంట్లు, ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై సంవత్సరాల తరబడి సాగిన కృషి అనేక రాష్ట్రాల్లో నెట్‌వర్క్‌గా ఏర్పడటానికి దారి తీసింది. హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రారంభంలో ఇవి చిన్న సంస్థలుగా ఏర్పడి అనంతర కాలంలో పెద్ద సంస్థలుగా విస్తారమైన ప్రజానీకాన్ని ప్రభావితం చేసే స్థాయికి ఎదిగాయి. ఇక్కడ కూడా ప్రజాసైన్స్ ఉద్యమానికి నూతన సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటం అనివార్యంగా మారింది. ఆరోగ్య రంగంలో ప్రాథమిక స్థాయి నుండి కూడా ప్రభుత్వం తప్పుకోవడం కార్పొరేట్ సంస్థల, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయం పెద్ద ఎత్తున పెరగడంతో ఆరోగ్య పరిరక్షణ కోసం సామాన్యులు కూడా అత్యధికంగా ఖర్చు చేయాల్సిన దేశాల్లో భారతదేశం కూడా చేరింది. ఈ చర్యలకు వ్యతిరేకంగా సైన్స్ ఉద్యమం పెద్ద ఎత్తున ఉద్యమించింది. ప్రజల ఆరోగ్యానికి చేటు తెచ్చే ప్రభుత్వ విధానాలను ప్రజల వద్దకు తీసుకుపోవడం, వారిని చైతన్యం చేయడం ఈ నాటి అవసరం.

### ప్రత్యామ్నాయాలు ... జీవనోపాధి

ప్రస్తుత వ్యవస్థ యొక్క దుష్ప్రభావాల గురించి మాట్లాడటమే కాకుండా, సాంకేతికతను వినియోగించి చేతివృత్తుల నైపుణ్యాలలో ప్రత్యామ్నాయ లభివృద్ధి విధానాలను రూపొందించి ప్రదర్శించాలని అనేవారు మనలో చాలామందే ఉన్నారు. ఈ తరహా కృషి పెట్టుబడిదారి పారిశ్రామిక విధానానికి అడ్డుకట్ట వేస్తుందని వారు చెబుతారు. ప్రజాసైన్స్ ఉద్యమం దీనిపై దృష్టి సారించింది. కెఎస్ఎస్‌పి యొక్క ఇంటిగ్రేటెడ్ రూరల్ టెక్నాలజీ సెంటర్, డిఎస్ఎఫ్‌కు చెందిన సెంటర్ టెక్నాలజీ ఆఫ్ దెవలప్‌మెంట్ తదితర సంస్థల సహకారంతో చేతివృత్తుల ఆధారంగా కేంద్రీకృత గ్రామీణ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి కృషి చేశాయి. అభివృద్ధిచెందిన టెక్నాలజీని వినియోగించి, కార్మికశక్తిని సక్రమంగా వాడుతూ, పారిశ్రామిక పద్ధతిలో ఈ సంస్థలు నడిచాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన విలువను సృషించాలన్న లక్ష్యంగా 1980 నుండి ఈ శతాబ్దపు తొలి సంవత్సరాల వరకు దాదాపు 200కు పైగా ఇటువంటి సంస్థలు పనిచేశాయి. వీటికి అప్పటి ప్రభుత్వ సహకారం లభించింది.

ప్రభుత్వ రంగ సంస్థలకు మద్దతు ఉపసంహరించుకోవడం, ప్రైవేటు రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి ప్రస్తుత వాతావరణంలోనూ ఈ తరహా సంస్థలు అనేకం పనిచేస్తూ అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మద్దతు స్థిరంగా పాతుకుపోయిన కేరళలో మినహా మిగిలిన అన్ని చోట్లా 'పీపుల్స్

> **"ప్రజా సైన్స్ ఉద్యమం సాంప్రదాయ జ్ఞానాన్ని ఎప్పుడూ కొట్టిపారవేయలేదు. అదే సమయంలో ఆధునిక విజ్ఞాన శాస్త్రం కన్నా గొప్పదని అంగీకరించలేదు. నిర్ధిష్ట చారిత్రిక కాలాల ఉత్పత్తిగా సాంప్రదాయ జ్ఞానాన్ని సైన్స్ ఉద్యమం గుర్తించింది. వాటిలో కొన్ని కాల పరీక్షకు నిలిచాయి. మరికొన్నింటిని ఆధునిక విజ్ఞానశాస్త్రం అధిగమించింది. ట్రయల్ అండ్ ఎర్రర్ పద్దతుల్లో కొన్ని ఇప్పటికీ ప్రభావవంతంగా పనిచేస్తున్నాయి."**

సెక్టార్' నిర్మాణం కోసం ప్రయత్నాలు, పోరాటాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రబలమైన ఆర్థిక నిర్వహణలేని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులతో గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా కృషి సాగుతోంది. పేదరిక నిర్మూలనకు, స్థానికాభివృద్ధికి ఈ తరహా కృషి ప్రత్యామ్నాయ నమూనాగా ఉంటుందని సైన్స్ ఉద్యమం భావిస్తోంది. ప్రస్తుతం ఎటువంటి సంస్థాగత నిర్మాణం లేని గ్రామీణ కార్మికులను సమాన అవకాశాల భవిష్యత్తు కోసం సమీకరించడానికి దోహదపడతాయి.

### సాంప్రదాయ విజ్ఞానం

ప్రజా సైన్స్ ఉద్యమానికి సాంప్రదాయ విజ్ఞానపు వినియోగం గురించి, దానికి ఇచ్చే స్థానం గురించి తరచు ప్రశ్నలు ఎదురవుతుంటాయి. మధ్యయుగంలేదా పూర్వ ఆధునిక కాలానికి చెందిన జ్ఞానం కావడంతో మార్క్సిస్టులు దానిని గతలో తిరస్కరించారన్న ఆరోపణ ఉంది. మరోవైపు ఆధునిక విజ్ఞానాన్ని పాశ్చాత్య –పెట్టుబడి నమూనాగా చెబుతూ తిరస్కరించే మేధావులు కూడా ఉన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా భారతదేశ సాంప్రదాయ జ్ఞానాన్ని పునరుద్దరించాలన్న డిమాండ్ కూడా తరచు వస్తూ ఉంటుంది. ఈ వాదనను ఆర్ఎస్ఎస్, బిజెపిలు సొంతం చేసుకున్నాయి. పురాతన కాలం (వేదిక్ సంస్కృత్)లో భారతీయులు ఆధునిక విజ్ఞానశాస్త్రం కన్నా గొప్ప జ్ఞానాన్ని కలిగి ఉన్నారని, మధ్య యుగంలో దేశంపై దాడిచేసిన ఆక్రమణ దారులు దానిని ధ్వంసం చేశారని వారు చెబుతున్నారు. అత్యుత్తమమైన ఆ జ్ఞానం పట్ల గర్వపడాలని, దానిని సమకాలిన సమాజంలో తిరిగి ప్రవేశపెట్టాలని వారు అంటారు.

ప్రజా సైన్స్ ఉద్యమం సాంప్రదాయ జ్ఞానాన్ని ఎప్పుడూ కొట్టిపారవేయలేదు. అదే సమయంలో ఆధునిక విజ్ఞాన శాస్రం కన్నా గొప్పదని అంగీకరించలేదు. నిర్థిష్ట చారిత్రిక కాలాల ఉత్పత్తిగా సాంప్రదాయ జ్ఞానాన్ని సైన్స్ ఉద్యమం గుర్తించింది. వాటిలో కొన్ని కాల పరీక్షకు నిలిచాయి. మరికొన్నింటిని ఆధునిక విజ్ఞానశాస్త్రం అధిగమించింది. అనేక ఇతర అంశాల మాదిరే ఇక్కడ కూడా జరిగింది. ఆచరించడం దానిలో వచ్చిన తప్పులను దిద్దుకుని ముందుకు పోవడం (ట్రయల్ అండ్ ఎర్రర్) పద్దతుల్లో కొన్ని ఇప్పటికీ ప్రభావవంతంగా పనిచేస్తున్నాయి.

ఈ అంశాలన్నీ వివరిస్తూ ఎఐపిఎస్ఎన్ అనేక బుక్‌లెట్లను తెచ్చింది. అనేక సంస్కృతుల్లో మాదిరే భారతీయ సాంప్రదాయ జ్ఞానంలోనూ అనేక విలువైన విషయాలు ఉన్నాయి. అయితే, వీటిలో చాలా వరకు చరిత్రలో కోల్పోయాము. భారతదేశంలోని సాంప్రదాయ విజ్ఞానశాస్త్ర చరిత్రను బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు చెబుతున్నట్లు పురాణగాధలుగా చెప్పకుండా, శాస్త్రీయ పద్దతులను వినియోగించి తీవ్రంగా అధ్యయనం చేయాలి.

### కొన్ని బలహీనతలు..

రానున్న సంవత్సరాల్లో మూడు ప్రధాన రంగాల్లో ఉన్న బలహీనతలను అధిగమించాల్సి ఉంది

సైన్స్ అండ్ టెక్నాలజీని దృష్టిలో ఉంచుకుని కొన్ని ప్రత్యేక అంశాలతో సామాజిక న్యాయ సాధనకు ఒక వేదికను రూపొందించడానికి ఎఐపిఎస్ఎన్ కొన్ని సంవత్సరాలుగా కష్టపడుతోంది. ఇతర సంఘాలు, సంస్థలు ఈ అంశంపై దృష్టి సారించడంలేదు.

అదే విధంగా మహిళా రంగంలో చేయాల్సిన కృషి ప్రస్తుతం బిజివిఎస్ సమతా కార్యక్రమాల్లో భాగంగా జరుగుతోంది. దీనిని క్రమబద్ధీకరించాలి. ఇతర ప్రజాసంఘాలు దృష్టి సారించని భిన్నమైన దృక్పధంతో ఈ పని జరగాలి. యువజన రంగంలో కూడా కొంత కాలంగా ఎఐపిఎస్ఎన్ పనిచేస్తోంది. విజ్ఞానశాస్త్ర కేంద్రంగా ఈ కృషిని కొనసాగించాలి. ఈ మూడు రంగాల్లోనూ పెద్ద ఎత్తున మేదోమధనం జరగాల్సి ఉంది, వర్క్‌షాపులు, సమావేశాలు నిర్వహించడం ద్వారా ఎఐపిఎస్ఎన్, బిజివిఎస్ సంఘాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి.

❊


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,**
**అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**
**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# సౌహార్ద్ర సందేశాలు

(2వ పేజీ తరువాయి)

## పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ (పి.సి.పి)

ప్రియమైన కామ్రేడ్స్,

మీ పార్టీ 24వ మహాసభల సందర్భంగా పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ తరపున మా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాం. మీ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాం. మీ పార్టీ నిర్వహిస్తున్న పోరాటాలను మరింత బలోపేతం చెయ్యడానికి, భారత కార్మిక వర్గం ప్రయోజనాలు పరిరక్షించడానికి ఈ మహా సభలు వేదిక కావాలని ఆశిస్తున్నాం.

ప్రపంచ ప్రజానీకం ఇవాళ అత్యంత క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంస్థాగత సంక్షోభం తీవ్రతరం అవుతున్నది. అమెరికా తదితర సామ్రాజ్యవాద శక్తుల ప్రాభవం సాపేక్షంగా దిగజారుతున్నది. ఈ సంక్షోభానికి, దిగజారుతున్న సామ్రాజ్యవాద ప్రాభవానికి ప్రతిఫలనమే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక కావడం. ట్రంప్ ఎన్నిక సంక్షోభ పరిస్థితులను మరింత తీవ్రతరం చేసే అవకా శం ఉన్నది. అమెరికన్ పాలన వర్గాలలో వివిధ శక్తుల మధ్య నెలకొన్న ఘర్షణలు, వైరుధ్యాలు గానీ, ఐరోపా యూనియన్ సామ్రాజ్యవాద శక్తులతో నెలకొన్న ఘర్షణ పూరిత వాతావరణం గానీ సామ్రాజ్య వాద దోపిడి స్వభావాన్ని గానీ, ప్రపంచ వనరులను కొల్లగొట్టడం, ప్రజానీకాన్ని దోపిడీ చేసే పద్ధతులలో గానీ ఎలాంటి మార్పుకు దోహదం చెయ్యవు. కానీ, గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగిస్తున్న పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాలు గానీ, నయా-ఉదారవాద దోపిడి విధానాలు గానీ ఇంకా ఎంతోకాలం మనజాలవు అన్న వాస్తవానికి ఇవి సంకేతాలు. అయితే ప్రపంచాధిపత్యాన్ని, శ్రమ దోపిడిని, వనరులను కొల్లగొట్టడాన్ని నిలబెట్టు కోవడానికి, యధావిధిగా కొనసాగించడానికి సామ్రాజ్యవాద శక్తులు కొత్త కొత్త మార్గాలను ఎంచుకొంటాయి. ఈ క్రమంలోనే పాలక వర్గాలు నియంతృత్వాధికారాన్ని, ఫాసిస్టు లక్షణాలను, యుద్ధోన్మాదాన్ని మార్గంగా ఎంచుకుంటాయి. ప్రజల హక్కుల మీదా, జీవన ప్రమాణాల మీద దాడికి తెగబడతాయి. యుద్ధాలను ప్రేరేపిస్తాయి.

పాలస్తీనా ప్రజానీకంపై జాతిహననానికి పాల్పడడం, మధ్యప్రాచ్యంలో యుద్ధాలకు తెగబడ్డం అమెరికా, ఇంగ్లాండ్, ఇయు దేశాల సామ్రాజ్యవాదపు ప్రతీఘాత - యుద్ధోన్మాద స్వభావాన్ని పట్టిస్తున్నాయి.

అమెరికా, తదితర సామ్రాజ్యవాద శక్తుల ప్రాభవం సాపేక్షంగా తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా విశాలమైన. సంక్లిష్టమైన బలాబలాల పునరేకీకరణలో భాగంగా జి-7 కూటమిలో కొత్త దేశాలను చేర్చుకున్నాయి. ముందుగా చైనా, ఆనక భారత్ తదితర దేశాలకు అవకాశం కల్పించాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నియంత్రిస్తున్న అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థలో తలెత్తిన అంతర్గత వైరుధ్యాలకు ఇది సంకేతం. ఒకవిధంగా ఇది కీలకమైన పరిణామంగా భావించవచ్చు. సామ్రాజ్యవాద దూకుడును ప్రతిఘటించేందుకు ఇది ఒక వేదికగా ఉపయోగపడవచ్చు. అదే సందర్భంలో ఆరు నూరైనా సామ్రాజ్యవాద శక్తులు తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఈ వేదికను వాడుకోవడానికి చూడడం కూడా అంతే సహజంగా ప్రయత్నస్తాయి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం - ప్రస్తుతం ఈ వేదిక నుండి కార్మికుల, కష్టజీవుల, వర్ధమాన దేశాల వాణి వినిపించేదానికి, తమ వర్గ ప్రయోజనాలను పరిరక్షించుకునేదానికి, ప్రపంచ వినాశనానికి దారితీసే అణ్వాయుధ యుద్ధ పరిస్థితులు తలెత్తకుండా నివారించడానికి, నిలవరించే దానికి కృషిచేసే అవకాశం అయితే ఉన్నది. ఇంకా చెప్పుకోవాలంటే కమ్యూనిస్టు పార్టీ పెద్దఎత్తున ప్రజాపోరాటాలు పెంపొందించేదా నికి స్పష్టమైన అవకాశాలు ఉన్నాయి.

ఈ పరిణామాల ప్రభావం నుండి మా దేశం - పోర్చుగల్ కూడా తప్పించు కోలేదు. ఒకే ఏడాదిలో మా దేశంలో రెండవసారి (మే 18న) ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ భారాలను సామాన్య ప్రజానీకం మీద మోపేందుకు, ఐరోపా యూనియన్ దన్నుతో నిరంకుశ సైనికీకరణను పెంపొందించేందుకు ఉద్దేశించిన మితవాద ప్రచారం పెద్ద ఎత్తున కొనసాగుతున్నది. తప్పుడు ప్రచారాలు, పచ్చి మితవాద శక్తులను పెంపొందించడం, భావోద్వేగాలను రెచ్చగొట్టడం పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. అయినప్పటికీ ఇవేవీ మితవాద విధానాలకు వ్యతిరేకంగా మా పార్టీ నిర్వహిస్తున్న కార్మికవర్గ పోరాటాల తీవ్రతకు ఆటంకంగా మేం భావించడం లేదు. బడా పెట్టుబడికి ఊడిగం చెయ్యడానికి, ఐరోపా యూనియన్ ప్రయోజనాలకు పాదాక్రాంతం అవడానికి దారితీస్తున్న పాలకవర్గాల మితవాద విధానాలకు వ్యతిరేకంగా మా పార్టీ చేపట్టిన పోరాటం కొనసాగుతున్నది. అలాగే సామ్రాజ్యవాద శక్తుల దాడికి లోనవుతున్న పాలస్తీనా నుండి క్యూబా వరకు వివిధ దేశాల ప్రజానీకానికి మా పార్టీ సంఘీభావంగా నిలుస్తున్నది. ప్రపంచశాంతి కోసం తనవంతు కృషి కొనసాగిస్తున్నది. రానున్న ఎన్నికలను తీవ్రతరమవుతున్న మితవాద, యుద్ధోన్మాద శక్తులకు వ్యతిరేకంగా మా పార్టీ పోరాటం సాగించాల్సిన మరో రంగంగా వేం భావిస్తున్నాం.

సంక్లిష్టమైన సవాళ్ళతో కూడిన ప్రస్థుత పరిస్థితులలో కమ్యూనిస్టులు, కార్మిక వర్గ పార్టీలు, సామ్రాజ్యవాద వ్యతిరేక, శాంతికాముక శక్తుల మధ్య ఐక్యత, సహకారం పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని, ఈ ఐక్యతను పోరాట మార్గంలోకి మళ్లించాల్సి ఆవశ్యకతను మేం గుర్తించాం. సామాజిక ప్రగతి, శాంతి, సుస్థిరతలను ఆకాంక్షించే శక్తులతో విశాల వేదికను నిర్మించి సామ్రాజ్య వాదానికి, యుద్ధాలకు వ్యతిరేకం గాను, మానవాళిపై పాలక శక్తులు నిరంకుశంగా రుద్దాలని చూస్తున్న ప్రమాదకర సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను పెంపొందించడానికి పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తున్నది.

ఆక్రమణదారీ, దోపిడీదారీ, సామ్రాజ్య వాద ప్రమాదకర విధానాలకు వ్యతిరేకంగా కార్మిక - ప్రజాపోరాటాలు కొనసాగుతాయి. ఈ పోరాటాలను మరింతగా పెంపొందించి దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామిక హక్కులను కాపాడుకోవడానికి, సమాజాన్ని అభ్యుదయ, విప్లవకర మార్గాన నడిపించేదానికి మా పార్టీ కృషి చేస్తుంది.

గత ఏడాది డిసెంబరు నెలలో జరిగిన మా పార్టీ 22వ మహాసభ ఈ విశ్వాసంతోనే 'ఫోర్స్ ఆఫ్ ఏప్రిల్' నినాదం ఇచ్చింది. కార్మికులను, సాధారణ ప్రజానీకంతో సజీవ సంబంధాలు నెలకొల్పుకునేదానికి కృషి కొనసాగిస్తుంది. దేశభక్తియుత వామపక్షపు ప్రత్యామ్నాయం నిర్మించడానికి, ఏప్రిల్ విప్లవల స్ఫూర్తితో సోషలిజం సాధించడానికి కట్టుబడి ఉన్నది. ఈ సందర్భంగా మీ పార్టీ నిర్వహించే పోరాటాలకు మా సంఘీభావాన్ని ప్రకటిస్తున్నాం. మన ఉభయ పార్టీల మధ్య సంప్రదాయంగా వస్తున్న ద్వైపాక్షిక సంబంధాలు, స్నేహ, సహకారాలు మరింత ధృఢతరం కావాలని ఆశిస్తున్నాం. మీ పార్టీ 24వ మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాం.

పోర్చుగీస్ కమ్యూనిస్ట పార్టీ - భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ల స్నేహ సంబంధాలు చిరకాలం కొనసాగాలి.

**పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ, కేంద్ర కమిటీ**

**(అనువాదం - కె.సత్యరంజన్)**

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 12 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# విద్యుత్ తలసరి వినియోగంలో 137 స్థానంలో భారత్



2023-24 లెక్కల ప్రకారం మొత్తం విద్యుత్ వినియోగంలో భారత దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నప్పటికీ తలసరి విద్యుద్ వినియోగంలో మాత్రం మొత్తం 218 దేశాల జాబితాలో 137వ స్థానంలో ఉంది. ఒక దేశంలోని విద్యుత్ వినియోగం సాధారణంగా ఆ దేశాభివృద్ధిని తెలియజేస్తుంది. అయితే జనాభా ఎక్కువగా ఉన్న దేశంలో మొత్తం విద్యుత్ వినియోగం ఎక్కువగానే ఉంటుంది. ఉదాహరణకు ప్రపచంలో అధ్యధిక జనాభా ఉన్న భారత దేశంలో విద్యుత్ వినియోగం జనాభా అంతటినీ కలిపి ఉంటుంది కనుక సహజంగా ఎక్కువగానే ఉంటుంది. అయితే ఆ దేశంలో ప్రజల తలసరి విద్యుత్ వినియోగం ఆ దేశపు నిజమైన అభివృద్ధిని ప్రతిబింబిస్తుంది.

ప్రస్తుతం ప్రపంచలో అత్యధికంగా విద్యుత్ వినియోగిస్తున్న దేశం చైనా, దాని తరువాత స్థానంలో అమెరికా, తరువాత మూడవ స్థానంలో భారత దేశం ఉన్నాయి. కానీ తలసరి వినియోగంలో చూసుకుంటే చైనా ప్రపంచ దేశాల్లో 47వ స్థానంలోనూ అమెరికా 10వ స్థానంలోనూ ఉన్నాయి. అమెరికాలో తలసరి వినియోగం ఏడాదికి 12,326 కిలోవాట్లు కాగా చైనాలో దానికి సగం 6,257 కిలోవాట్లు ఉన్నది. ఇక భారత దేశంలో ప్రజల తలసరి వినియోగం 1,395 కిలోవాట్లు ఉంది. ఇది చైనాతో పోలిస్తే సుమారు ఆరు రెట్లు తక్కువ, అమెరికాతో పోలిస్తే 12 రెట్లు తక్కువగా ఉంది.

అంటే అమెరికా ప్రజలు తలసరి ఒక నెలకు, చైనా పౌరులు తలసరి రెండు మాసాలకు వినియోగిస్తున్న విద్యుత్‌ను భారత దేశ ప్రజలు ఒక ఏడాది వినియోగిస్తున్నారన్నమాట.

తలసరి విద్యుత్ వినియోగంలో సోషలిస్టు దేశమైన చైనానే కాకుండా భారత దేశం కన్నా చాలా చిన్న దేశాలైన సోషలిస్టు వియత్నాం, క్యూబాలు మెరుగైన స్థితిలో ఉన్నాయని గణాంకాలు తెలియజేస్తున్నాయి. సరికొత్త లెక్కల ప్రకారం వియత్నాం ప్రజల తలసరి విద్యుత్ వినియోగం ఏడాదికి 2,520 కిలోవాట్లు. అంటే భారత దేశానికన్నా దాదాపు రెట్టింపు ఉంది. తలసరి విద్యుత్ వినియోగంలో ప్రపంచంలో వియత్నాం 103వ ర్యాంకులో ఉంది. అమెరికాచేత అన్ని విధాలా దిగ్బంధనానికి గురై ఉన్న క్యూబాలో కూడా తలసరి విద్యుత్ వినియోగం ఏడాదికి 1,453 కిలోవాట్లతో భారత దేశం కన్నా మెరుగైన స్థితిలో ఉంది.

పపంచంలో అత్యధికంగా తలసరి విద్యుత్ వినియోగిస్తున్న దేశం కతర్. ఇక్కడ తలసరి వార్షిక విద్యుత్ వినియోగం 2,25,000 కిలోవాట్లు. దాని తరువాత ర్యాంకుల్లో కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడాలు ఉన్నాయి.

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.15**, సంవత్సర చందా:**రూ.150**, పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ..........

వీధి ..........

గ్రామం ..........

మండలం లేదా పట్టణం ..........

జిల్లా ..........

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.